ప్రజాజ్యోతి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | గురువారం 05 నవంబర్ 2026 | సంపుటి: | సంచిక: 249 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , కార్తీక మాసము , తిథి: నవమి - 11:56:33 వరకు నక్షత్రంమాఘ - 27:27:08 వరకు కరణంగర - 11:56:33 వరకు, వణిజ - 23:27:51 వరకు పక్షంకృష్ణ యోగంశుక్ల - 09:53:39 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

సీఈసీ, ఈసీల విచారణకు సుప్రీం గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ, నవంబర్ 04(ప్రజాజ్యోతి): ప్రధాన ఎన్నికల కమిషనర్ , ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన చర్యల నుంచి విస్తృత రక్షణ కల్పించే నిబంధనపై సుప్రీం కోర్టు విచారణకు అంగీకరించింది. ఈ చట్ట నిబంధన రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను పరిశీలించిన ధర్మాసనం- కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. నాలుగు

మిగతా 2లో..

భారత నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించవచ్చు

హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక ప్రకటన

న్యూఢిల్లీ, నవంబర్ 04(ప్రజాజ్యోతి): హర్మూజ్ జలసంధిలో తాము విధించిన ఆంక్షల నుంచి భారత నౌకలకు మినహాయింపులు కల్పించినట్లు ఇరాన్ ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. ఆ జలసంధిలో భారత నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించవచ్చని తెలిపింది. భారత్‌తో పాటు చైనా, ఇరాక్, ఖతార్ దేశాల నౌకలకు

మిగతా 2లో..



ట్రంప్‌కు ఎదురుదెబ్బ

మధ్యంతర ఎన్నికల్లో ఘోర పరాజయం

అమెరికా కాంగ్రెస్‌లో డెమొక్రాట్ల క్లీన్‌స్వీప్..

సెనెట్‌ను కైవసం చేసుకున్న డెమొక్రాట్లు

అమెరికా ఎన్నికల్లో భారతీయుల హవా..

న్యూఢిల్లీ, నవంబర్ 04(ప్రజాజ్యోతి): వరుస విజయాలతో రిపబ్లికన్ల నుంచి యూఎస్ సెనెట్ నియంత్రణను డెమొక్రాట్లు హస్తగతం చేసుకున్నారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఈ ఫలితాలు కోలుకోలేని రాజకీయ ఎదురుదెబ్బగా మారాయి. సంప్రదాయకంగా రిపబ్లికన్లకు కంచుకోటలుగా ఉన్న టెక్సాస్, సౌత్ కరోలినా, నార్త్ కరోలినా రాష్ట్రాల్లో డెమొక్రాట్లు ఘన విజయం సాధించి సీట్లను ఎగరేసుకుపోవడమే కాకుండా, కీలకమైన జార్జియా, న్యూ హాంప్‌షైర్ స్థానాలను విజయవంతంగా నిలబెట్టుకున్నారు. ఈ విజయంతో వాషింగ్టన్ అధికార సమీకరణాల్లో అనూహ్య మార్పు చోటుచేసుకుంది. 100 మంది సభ్యులుండే యూఎస్ సెనెట్‌లో 2020 ఎన్నికల తర్వాత డెమొక్రాట్లు తిరిగి పూర్తి ఆధిపత్యాన్ని దక్కించుకున్నారు. ఇప్పటివరకు 53-47 ఆధిక్యంతో ఉన్న రిపబ్లికన్లు సెనెట్‌పై తమ పట్టును కోల్పోయారు. దేశవ్యాప్తంగా రిపబ్లికన్ అభ్యర్థుల తరఫున ట్రంప్ స్వయంగా విస్తృత ప్రచారం నిర్వహించినప్పటికీ ఓటర్లు డెమొక్రాట్లకే పట్టం కట్టారు. అధ్యక్షుడిగా ట్రంప్ చివరి రెండేళ్ల పదవీకాలం మిగిలి ఉన్న తరుణంలో ఈ ఎన్నికలు ఆయన నాయకత్వానికి, రాజకీయ ప్రభావానికి గట్టి పరీక్షగా నిలిచాయి. ఈ ఎన్నికల్లో అత్యంత కీలక పరిణామం టెక్సాస్ రాష్ట్రంలో చోటుచేసుకుంది. రిపబ్లికన్ అభ్యర్థి కెన్ పాక్స్టన్‌పై డెమొక్రాట్ జేమ్స్ తలారికో సంచలన విజయం సాధించారు. 1988 తర్వాత టెక్సాస్ నుంచి ఒక డెమొక్రాట్ యూఎస్ సెనెట్‌కు ఎన్నికవడం ఇదే తొలిసారి కావడం విశేషం.సౌత్ కరోలినాలోనూ ఇలాంటి సంచలనమే నమోదైంది. గత జూలైలో మరణించిన రిపబ్లికన్ సెనెటర్ లిండ్సే గ్రాహం సోదరి, ట్రంప్ మద్దతుతో బరిలోకి దిగిన

మిగతా 2లో..



ట్రంప్‌కు ఎదురుదెబ్బతో భారత్‌కు ఊరట!

న్యూఢిల్లీ, నవంబర్ 04(ప్రజాజ్యోతి): భారత్‌కుఈ పెను రాజకీయ మార్పు భారత విదేశాంగ, వాణిజ్య విధానానికి సరికొత్త వ్యూహాత్మక ఊరటను ఇస్తుందని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇప్పటివరకు అకస్మాత్తుగా నిర్ణయాలు తీసుకుంటూ, భారీ సుంకాలను అస్త్రంగా మార్చి తీవ్ర ఒత్తిడి పెంచిన ట్రంప్ శైలికి అమెరికా కాంగ్రెస్ నిఘా కళ్లెం వేయనుంది. ఫలితంగా భారత్-అమెరికా ద్వైపాక్షిక చర్చల్లో న్యూఢిల్లీ వైఖరి మరింత బలపడే అవకాశం లభించింది. రెండు పార్టీల నియంత్రణ ఏర్పడటంతో ఏకపక్ష నిర్ణయాలకు తెరపడి విధానపరమైన స్పష్టత వస్తుందని అంచనా వేస్తున్నారు. ట్రంప్ ప్రభుత్వ హయాంలో భారతీయ ఎగుమతిదారులు నిరంతరం సుంకాల భయంతో ఊగిసలాడాల్సి వచ్చింది. ఇప్పుడు కాంగ్రెస్‌లో మెజారిటీ కోల్పోయిన నేపథ్యంలో విదేశీ వాణిజ్యంపై ఏకపక్ష పన్నులు విధించే

మిగతా 2లో..

ఆర్మీలోకి శాశ్వత ఎంపిక

- సర్వీస్ మరో రెండేళ్లు పొడిగింపు
- అగ్నివీరులకు కేంద్ర కేబినెట్ తీపికబురు
- చిన్నారులపై వేధింపుల కట్టడికి ట్రాక్ కోర్టులు
- కేసులను విచారణకు 850 ఫాస్ట్ ట్రాక్ కోర్టు..
- వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్
- కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్ర కేబినెట్



న్యూఢిల్లీ, నవంబర్ 04(ప్రజాజ్యోతి): భారత సాయుధ దళాల నియామక ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన విధానపరమైన నిర్ణయం తీసుకుంది. 2022లో ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకం నిబంధనల ప్రకారం నాలుగేళ్ల పదవీకాలం ముగిసిన తర్వాత త్రివిధ దళాల నుంచి వైదొలగాల్సిన 75 శాతం అగ్నివీరులకు మరో రెండేళ్ల పాటు సర్వీసును పొడిగిస్తూ కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ చారిత్రక నిర్ణయాన్ని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి బుధవారం న్యూఢిల్లీలో అధికారికంగా ప్రకటించారు. అగ్నివీరులకు, దేశ రక్షణ రంగానికి ఇదొక ఎంతో ప్రాధాన్యత కలిగిన రోజని ఆయన అభివర్ణించారు. ఈ పొడిగించిన రెండేళ్ల కాలపరిమితి పూర్తయిన తర్వాత సైనిక ఎంపిక నిబంధనలకు అనుగుణంగా అర్హత సాధించిన వారందరినీ రెగ్యులర్ సైనికులుగా శాశ్వత సర్వీసులోకి

మిగతా 12లో..



సదర్ అంటే రాష్ట్ర పండుగ

యాదవుల ఆత్మగౌరవ ప్రతీక

సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవం

వేడుకలకు 5 కోట్లు కేటాయించాం..

నగరంలో ఘనంగా సదర్ వేడుకలు

వేడుకకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 04(ప్రజాజ్యోతి): గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలనే ఆలోచన చేయలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కానీ, యాదవుల విజ్ఞప్తి మేరకు తమ ప్రభుత్వం సదర్‌ను అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించడమే కాకుండా, దీని నిర్వహణ కోసం రూ. 5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో శాస్త్రీయంగా కులగణన చేసి చూపించామని, ఈ తెలంగాణ మోడల్‌ను దేశమంతా అనుసరించేలా సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. తమ ప్రభుత్వంలో యాదవ సామాజిక వర్గానికి రాజకీయంగా, సామాజికంగా సముచిత స్థానం కల్పించామని వివరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళన కార్యక్రమంలో రేవంత్ రెడ్డి పాల్గొని యాదవ సోదరులందరికీ సదర్ పండుగ శుభాకాంక్షలు

మిగతా 2లో..



సత్తుపల్లిలో దిగ్భ్రాంతికర ఘటన

- చెరువులో చిక్కుకున్న మత్స్యకారులు
- వారిని కాపాడేందుకు రెస్క్యూ ఆపరేషన్
- చెరువులో బోల్తా పడ్డ ఎస్‌డీఆర్ఎఫ్ బోట్లు
- 11 మంది ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది గల్లంతు
- గల్లంతుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా

హైదరాబాద్, నవంబర్ 04(ప్రజాజ్యోతి): ఖమ్మం జిల్లా సత్తుపల్లి సమీపంలోని ప్రసిద్ధ బేతుపల్లి చెరువులో తీవ్ర దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. మురసు తుఫాన్ కారణంగా పడుతున్న భారీ వర్షాల వల్ల చెరువు నీటి ప్రవాహంలో చిక్కుకున్న మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా రంగంలోకి దిగిన రాష్ట్ర విపత్తు స్పందన దళం కి చెందిన రెండు పడవలు ప్రమాదవశాత్తూ నీటి ఉధృతికి తిరగబడ్డాయి. ఈ ఘటనతో బోట్లలో ఉన్న 11 మంది ఎస్‌డీఆర్ఎఫ్ రెస్క్యూ సిబ్బంది మరియు , పోలీసు కానిస్టేబుళ్లు ఒక్కసారిగా నీటి ప్రవాహంలో గల్లంతై కట్టుకుపోయారు. రక్షించాల్సిన సిబ్బందే ప్రమాదంలో చిక్కుకోవడంతో స్థానికంగా తీ

మిగతా 2లో..

ఢిల్లీ ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు

తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఏం ఇచ్చింది?

కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ ఘాటు విమర్శలు

హైదరాబాద్, నవంబర్ 04(ప్రజాజ్యోతి): కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు అన్యాయం చేస్తున్న పార్టీలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే.. బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం పలువురు నేతలు

మిగతా 12లో..



ఏఐతో భూ వివాదాల పరిష్కారమా..

జనగామ కలెక్టర్‌పై హైకోర్టు ఆగ్రహం..

కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు సస్పెండ్!

హైదరాబాద్, నవంబర్ 04(ప్రజాజ్యోతి): భూ వివాదాల పరిష్కారంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భూమి హక్కులకు సంబంధించిన కేసుల్లో నిజానిజాలను పరిశీలించకుండా.. సంబంధిత వ్యక్తుల వాదనలు వినకుండా ఏఐ ఆధారంగా ఉత్తర్వులు జారీ చేయడంపై తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఓ భూ వివాదంలో జనగామ జిల్లా కలెక్టర్.. ఏఐ రూపొందించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఆదేశాలు

మిగతా 12లో..

ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతి

- ప్రయాణికురాలు బస్సు నుంచి నెట్టివేత
- బస్సు కింద పడి కండక్టర్ కు గాయాలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- ప్రవళిక మృతి పట్ల సీఎం దిగ్భ్రాంతి
- ప్రభుత్వం 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు..
- 1 కోటి ప్రమాద బీమా అందిస్తామని వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 04(ప్రజాజ్యోతి): టికెట్ చిల్లర విషయంలో ఆర్టీసీ బస్సులో తలెత్తిన వివాదం మహిళా కండక్టర్ ప్రాణాలను బలిగొంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు డిపోనకు చెందిన కండక్టర్ గుండ్ల ప్రవళిక చికిత్స పొందుతూ మృతి చెందారు.

మిగతా 2లో..

సంపాదకీయం

ట్రంప్‌పై వ్యతిరేకత..

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్‌లు ఘన విజయం సాధించారు. సెనేట్‌తో పాటు ప్రతినిధుల సభలోనూ మెజారిటీ సాధించి రిపబ్లికన్‌ల ఆధిపత్యానికి తెరదించారు. దీంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రాజకీయంగా కీలక సవాలు ఎదురుకానుంది. తన విధానాలు, నిర్ణయాలతో ప్రపంచాన్ని టెన్షన్ పెట్టిస్తున్న ట్రంప్‌ను ఇప్పుడు మిడ్ టర్మ్ ఎలక్షన్స్ కంగారు పెట్టిస్తున్నాయి. యూఎస్ మిడ్ టర్మ్ ఎన్నికల్లో రిపబ్లికన్లకు ఊహించని పరిణామం ఎదురైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై తమ వ్యతిరేకతను మిడ్ టర్మ్ ఎన్నికల్లో చూపించారు ఓటర్లు. తాజాగా జరిగిన ఎన్నికలకు సంబంధించి ఇప్పటివరకు వెలువడిన ఫలితాల్లో డెమోక్రాట్లు కీలక స్థానాల్లో ముందంజలో ఉన్నారు. రిపబ్లికన్ల ఆధీనంలోని కీలక స్థానాలను డెమోక్రాట్లు కైవసం చేసుకుంటున్నారు. రిపబ్లికన్లకు కంచుకోటగా ఉన్న టెక్సాస్‌తో పాటు నార్త్ కరోలినా సీటును డెమోక్రాట్లు దక్కించుకున్నారు. కీలకమైన సెనేట్‌ను ఇప్పటికే తమ ఖాతాలో వేసుకున్నారు డెమొక్రాట్లు. మొత్తం 100 స్థానాలున్న సెనేట్‌లో మెజారిటీకి అవసరమైన 51 స్థానాలను దాటి ఆధిక్యం సాధించారు. గత ఎన్నికల వరకు 53 స్థానాలతో ఆధిపత్యం చెలాయించిన రిపబ్లికన్లకు ఈసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ నుంచి ఆరు స్థానాలను డెమొక్రాట్లు తమ ఖాతాలో వేసుకోవడంతో సెనేట్‌లో రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. మరికొన్ని రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు కొనసాగుతుండటంతో డెమొక్రాట్ల బలం మరింత పెరిగే అవకాశాలున్నాయి. అలాగే ప్రతినిధుల సభపైనా కన్నేశారు డెమొక్రాట్లు. మొత్తం 435 స్థానాలున్న హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌లో మెజారిటీకి 218 సీట్లు అవసరం. లేటెస్ట్ సరళిని పరిశీలిస్తే.. ప్రతినిధుల సభలోనూ డెమొక్రాట్లే విజయం సాధించే అవకాశాలున్నాయి. అదే జరిగితే అమెరికా కాంగ్రెస్‌లోని రెండు సభలూ డెమొక్రాట్ల నియంత్రణలోకి వస్తాయి.పలు రాష్ట్రాల్లో జరిగిన గవర్నర్ ఎన్నికల్లోనూ డెమొక్రాట్లు సత్తా చాటారు. గతంలో రిపబ్లికన్ల ఆధీనంలో ఉన్న టెక్సాస్, అయోవా, ఒహియో రాష్ట్రాలను డెమొక్రాట్లు కైవసం చేసుకున్నారు. అలాగే సౌత్ కరోలినా, అలబామాల్లో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకున్నారు. ఈ ఫలితాలతో అమెరికా కాంగ్రెస్‌లో అధికార సమీకరణాలు మారనున్నాయి. కాంగ్రెస్‌లోని రెండు సభలూ డెమొక్రాట్ల నియంత్రణలోకి వస్తే ట్రంప్ ప్రతిపాదించే చట్టాలు, బడ్జెట్ నిర్ణయాలు, కీలక విధానాలకు అడ్డంకులు ఎదురయ్యే అవకాశం ఉంది. అంతేకాదు.. ప్రభుత్వ యంత్రాంగంపై పర్యవేక్షణ, విచారణల విషయంలోనూ డెమొక్రాట్లకు బలం పెరుగుతుంది. దీంతో మిగిలిన రెండేళ్ల ట్రంప్ పాలనలో అమెరికా రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయి. ఎన్నికల ఫలితాలు రిపబ్లికన్లకు అనుకూలంగా లేకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు ట్రంప్. డెమొక్రాట్ల దూకుడు, రిపబ్లికన్లకు ఎదురుదెబ్బల నేపథ్యంలో సోషల్‌మీడియాలో వరుస పోస్టులు పెట్టారు. ఎన్నికల్లో తాను పోటీ చేసి ఉంటే భారీ మెజారిటీతో గెలిచేవాడినని, బ్యాలెట్‌పై తన పేరు ఉంటే రిపబ్లికన్లు విజయం సాధించేవారని చెప్పారు. అలాగే 'వీటో' అని రాసి ఉన్న క్యాప్ ఇమేజ్‌ను కూడా షేర్ చేశారు ట్రంప్. ఈ పోస్టుతో తన వీటో అధికారాన్ని గుర్తు చేస్తున్నారా..? లేక రాజకీయ ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపుతున్నారా? అన్న చర్చ మొదలైంది. మొత్తంగా ఎన్నికల ఫలితాల వేళ ట్రంప్ పోస్టులు అమెరికా రాజకీయాల్లో ఆసక్తికరంగా మారాయి. చే రెండేళ్ల పాటు ఆయన ప్రభుత్వ నిర్ణయాలపై డెమోక్రాట్‌లు గట్టి నిఘా పెట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో 'వీటో' అని రాసి ఉన్న ఎరుపు రంగు రిపబ్లికన్ టోపీ ఫొటోను పోస్ట్ చేశారు 2026 నవంబర్ 3న జరిగిన మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్‌లు అనూహ్య విజయాలు సాధించారు. తాజా లెక్కల ప్రకారం సెనేట్‌లో 100 స్థానాలకు గాను 53 స్థానాలను గెలుచుకున్నారు. ప్రతినిధుల సభలోనూ మెజారిటీకి అవసరమైన 218 స్థానాల మార్కును దాటి 220 స్థానాలను కైవసం చేసుకున్నారు. దీంతో రెండు సభల్లోనూ డెమోక్రాట్‌లకు ఆధిపత్యం లభించింది. టెక్సాస్, కాన్సాస్, సౌత్ కరోలినా వంటి సంప్రదాయ రిపబ్లికన్ ఆధిపత్య రాష్ట్రాల్లోనూ డెమోక్రాట్‌లు విజయాలు సాధించడం ఈ ఎన్నికల్లో ప్రత్యేకతగా నిలిచింది. నార్త్ కరోలినా, ఒహాయో రాష్ట్రాల్లోనూ సెనేట్ స్థానాలను గెలుచుకున్నారు). ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ట్రంప్ సోషల్ మీడియాలో స్పందించారు. ఎరుపు రంగు రిపబ్లికన్ టోపీపై 'వీటో' అని రాసి ఉన్న ఫొటోను పోస్ట్ చేశారు. డెమోక్రాట్‌లు తీసుకొచ్చే ప్రతిపాదనల్లో తనకు ఆమోదయోగ్యం కాని వాటిని అడ్డుకునేందుకు అధ్యక్షుడిగా తనకున్న వీటో అధికారాన్ని ఉపయోగిస్తాననే సంకేతాన్ని ఈ పోస్ట్ ద్వారా ఇచ్చారు. కాంగ్రెస్‌లో డెమోక్రాట్‌లకు మెజారిటీ రావడంతో ట్రంప్ ప్రభుత్వానికి పలు అంశాల్లో ఇబ్బందులు ఎదురుకావచ్చు. ప్రభుత్వ నిర్ణయాలపై విచారణలు చేపట్టడం, పరిపాలనా వ్యవహారాలపై ప్రశ్నలు లేవనెత్తడం, కొత్త చట్టాల ఆమోదాన్ని అడ్డుకోవడం వంటి అధికారాలు వారికి ఉంటాయి. ఏది ఏమైనా ట్రంప్ ఒంటెద్దు పోకడలకు అడ్డుకట్ట పడిందనే చెప్పుకోవాలి.

ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతి

మొదటిపేజీ తరువాయి..

చిల్లర విషయంలో కండక్టర్ ప్రవళికకు మరో మహిళా ప్రయాణికురాలితో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కోపంతో ఊగిపోయిన మహిళా ప్రయాణికురాలు, కదులుతున్న బస్సులోంచి కండక్టర్ ప్రవళికను బయటకు నెట్టేసింది. అనూహ్యంగా కిందపడిపోయిన కండక్టర్ కాళ్లపై నుంచి బస్సు వెనక చక్రాలు వెళ్లడంతో రెండు కాళ్లు నలిగిపోయాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రవళిక ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం తుదిశ్వాస విడిచింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా కండక్టర్ ప్రవళిక మృతి పట్ల ఆర్టీసీ కార్మికులు, యూనియన్ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని, ఆర్థిక సహాయంతో పాటు కుటుంబానికి అవసరమైన సహకారం అందించాలని యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రయాణికురాలి వల్ల చనిపోయిన మణుగూరు డిపో మహిళా కండక్టర్ ప్రవళిక కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రవళిక మృతదేహానికి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డిలు బుధవారం నాడు నివాళు లర్పించారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న ప్రవళిక తల్లిని పరామర్శించిన మంత్రి పొన్నం, ఆర్టీసీ కుటుంబం అంతా ఆ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు కేటాయించనున్నట్లు పొన్నం వెల్లడించారు. అలాగే ప్రభుత్వం, ఆర్టీసీ తరపున ఉమ్మడిగా రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా అందించడంతో పాటు, ఆర్టీసీ ఇన్సూరెన్స్ ద్వారా బ్యాంకుల నుంచి రూ.1 కోటి ప్రమాద బీమా అందిస్తామని తెలిపారు. ఆర్థికంగా ఎలాంటి ఇబ్బంది లేకున్నా, కోల్పోయిన కుటుంబ సభ్యురాలిని తిరిగి తీసుకురాలేమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఫ్యామిలీ సభ్యురాలిని కోల్పోవడం చాలా బాధాకరం అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే మేనేజ్మెంట్ తరఫున ఆసుపత్రికి వెళ్లి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు ప్రయత్నించినప్పటికీ దురదృష్టవశాత్తు ప్రవళిక ప్రాణాలు దక్కలేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు కార్మికుల సంక్షేమం, భద్రత కూడా రాష్ట్ర ప్రభుత్వానికి అంతే ముఖ్యమన్నారు. ఈ ఘటనలో నిందితురాలిపై మొదట హత్యాయత్నం కేసు నమోదు చేయగా, ప్రస్తుతం ప్రవళిక మృతితో హత్య కేసుగా మార్చి కఠినమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని మంత్రి పిలుపునిచ్చారు. ఒకవేళ తమ ఆర్టీసీ సిబ్బంది ఎక్కడైనా పొరపాటుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. అంతేకానీ నేరుగా చట్టాన్ని చేతిలోకి తీసుకుని ఓ మహిళా కండక్టర్‌ను తోసివేయడం వల్ల ఒక కుటుంబం రోడ్డున పడిందన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కార్మికుల సంక్షేమానికి అనేక నిర్ణయాలు తీసుకున్నామని, సిబ్బందిలో అసహనం లేకుండా పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించడంతో వారు సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ఆర్టీసీ అనేది అత్యంత క్రమశిక్షణతో పనిచేసే ఖాకీ యూనిఫాం అని, ప్రయాణికులకు సౌకర్యాలు అందించే బాధ్యత తమదని స్పష్టం చేశారు. ప్రయాణికులే దేవుళ్లుగా భావించి సేవ చేయడం సిబ్బంది బాధ్యత అని చెబుతూనే, సిబ్బందికి ఏమైనా అసౌకర్యం కలిగితే వారు చట్టబద్ధంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. పోయిన సామాగ్రి దొరికితే తిరిగి అప్పగించేంత బాధ్యత గల సంస్థ ఆర్టీసీ అని మంత్రి పొన్నం కొనియాడారు. కార్మికుల భద్రత, ప్రయాణికుల సౌకర్యం తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే చట్టపరిధిలోనే పరిష్కరించుకోవాలి తప్ప ఇలాంటి దాడులకు పాల్పడకూడదని కోరుతూ, బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి పునరుద్ఘాటించారు.వాస్తవానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మిట్టగూడెంనకు చెందిన ఓ ప్రయాణికురాలు గత నెల 25న మణుగూరు నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న మణుగూరు ఆర్టీసీ డిపోనకు చెందిన పల్లె వెలుగు బస్సు ఎక్కారు. ఆమెతో పాటు ఉన్న బాలుడికి టికెట్ తీసుకోవాలని మహిళా కండక్టర్ చెప్పారు. అయితే మొదట టికెట్ తీసుకునేందుకు ప్రయాణికురాలు నిరాకరించింది. కండక్టర్‌తో గొడవకు దిగింది. అనంతరం బాలుడికి టికెట్ తీసుకునేందుకు అంగీకరించింది. టికెట్ కోసం కండక్టర్‌కు ప్రయాణికురాలు నగదు ఇచ్చారు. టికెట్ ఇచ్చిన మహిళా కండక్టర్ ప్రవళిక దిగేటప్పుడు మిగిలిన చిల్లర తీసుకోవాలని ప్రయాణికురాలికి సూచించారు. అయితే ఇప్పుడే చిల్లర ఇవ్వాలని ప్రయాణికురాలు పట్టుబట్టింది. దీంతో వారి మధ్య మరోసారి మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో మిట్టగూడెం స్టాప్ రావడంతో ఆమె బస్సు దిగేందుకు ప్రయత్నించగా, ప్రయాణికురాలిని అశ్వాపురం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాలని కండక్టర్ ప్రయత్నించారు. ఈ మేరకు బస్సును ముందుకు నడపాలని డ్రైవర్‌కు కండక్టర్ సూచించగా, బస్సు కదులుతున్న సమయంలో ప్రయాణికురాలు కండక్టర్‌ను నెట్టివేసింది. దీంతో కండక్టర్ కదులుతున్న బస్సు వెనక చక్రాల కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆమె కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆరోజు నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కండక్టర్ ఆరోగ్య పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందింది.

సీఈసీ, ఈసీల విచారణకు సుప్రీం గ్రీన్ సిగ్నల్

మొదటిపేజీ తరువాయి..

వారాల్లోకా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది. ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ ఝా, సామాజిక కార్యకర్త అరుణ్ అగ్రవాల్ పిటిషన్లు దాఖలు చేయగా దీనిపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనాలతో కూడిన ధర్మాసనం విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇదే అంశంపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న మరో పిటిషన్‌తో కలిపి ఈ కేసుల్ని విచారిస్తామని పిటిషనర్ల తరఫు న్యాయవాదులకు తెలిపింది. 2023లో రూపొందించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ (అపాయింట్‌మెంట్, కండిషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టర్మ్ ఆఫ్ ఆఫీస్) చట్టంలోని సెక్షన్ 16 ను పిటిషనర్లు ఇక్కడ సవాల్ చేస్తున్నారు. ఈ నిబంధన ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్ లేదా ఎన్నికల కమిషనర్‌గా ప్రస్తుతం పని చేస్తున్న వ్యక్తిపై, గతంలో ఆ పదవిలో పనిచేసిన వ్యక్తిపై కూడా విధుల నిర్వహణలో చేసిన పనులు, వ్యాఖ్యలకు సంబంధించి ఏ కోర్టు కూడా సివిల్ లేదా క్రిమినల్ కేసుల్ని స్వీకరించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న కేసుల్ని కూడా కొనసాగించకూడదు. ఈ మేరకు సెక్షన్ 16 నిబంధన సీఈసీ, ఈసీలకు జీవితకాల సంపూర్ణ చట్టపరమైన రక్షణ కల్పిస్తోంది. అయితే ఈ ఇమ్యూనిటీ వారికి పదవిలో ఉన్నంతవరకే కాకుండా, పదవీ విరమణ తర్వాత కూడా వర్తిస్తుందనేదేదానిపై పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అవినీతి, ఉద్దేశపూర్వకంగా చేసిన వ్యాఖ్యలు, ఇతర తీవ్రమైన నేరాలకు పాల్పడినా ఈ నిబంధనల వారికి మినహాయింపు కల్పిస్తోందని పేర్కొంటున్నారు. తన పిటిషన్‌లో మనోజ్ ఝా ఈ సెక్షన్ 16 రాజ్యాంగ విరుద్ధం అని వాదించారు. ఎన్నికల కమిషనర్లు ఎన్నికైన ప్రజాప్రతినిధులు కాదని, అయినప్పటికీ వారికి రాష్ట్రపతి, ఎంపీలు, న్యాయమూర్తులకు రాజ్యాంగం కల్పించిన రక్షణ కంటే విస్తృతమైన ఇమ్యూనిటీని సాధారణ చట్టం ద్వారా కల్పించారని అభ్యంతరం తెలిపారు. రాష్ట్రపతి, గవర్నర్లకు ఆర్టికల్ 361, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఆర్టికల్స్ 105, 194 కింద కొన్ని ప్రత్యేక రక్షణలు ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. అయితే ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన ఆర్టికల్ 324లో ఇలాంటి మినహాయింపు లేదని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తిని తొలగించే విధానంలోనే సీఈసీని తొలగించాలనే నిబంధన ఉందని, అది భద్రతకు ఉద్దేశించినదే తప్ప, చట్టపరమైన చర్యల నుంచి సంపూర్ణ మినహాయింపు కాదని వివరించారు.ఒక ఎంపీ అవినీతికి పాల్పడితే విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందని, అదే విదంగా న్యాయమూర్తులపై కూడా కేసులు నమోదు చేయొచ్చని ఝా తన పిటిషన్‌లో ప్రస్తావించారు. ఇలా చేయకుంటే అధికారుల విధుల పేరుతో నేరానికి పాల్పడినా చర్యలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ వ్యక్తినీ రాజ్యాంగం చట్టానికి అతీతంగా ఉంచలేదని, అందుకే సాధారణ చట్టం ద్వారా అలాంటి రక్షణ కల్పించలేరని వాదించారు.

సదర్ అంటే రాష్ట్ర పండుగ

మొదటిపేజీ తరువాయి..

తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదర్ సమ్మేళనం అనేది కేవలం యాదవులకే పరిమితం కాదని, ఇది తెలంగాణ రాష్ట్ర ప్రజలందరి ఆత్మగౌరవ సమ్మేళనమని అభివర్ణించారు. హైదరాబాద్ సిటీలో నేడు ప్రసిద్ధి చెందిన గోల్కొండ కోట ఒకనాడు 'గొల్ల కొండ'గా ఉండేదని గుర్తుచేశారు. విశ్వనగరంగా ఎదుగుతున్న హైదరాబాద్ అభివృద్ధిలో యాదవ సోదరుల సహకారం ఎంతో ఉందో కొనియాడారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చిన ప్రతి ఒక్కరినీ యాదవులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని ప్రశంసించారు. యాదవ సోదరులకు తాము ఇచ్చిన ప్రాధాన్యతను ప్రస్తావించారు. అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని, అలాగే ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియమించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టత కలిగిన యాదగిరిగుట్ట గోశాలలో గోసంరక్షణకు అన్ని రకాల ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో జనాభా ప్రాతిపదికన యాదవులకు దక్కాల్సిన వాటా వారికి దక్కేలా అన్ని చర్యలు తీసుకుంటామని, వారి ఆత్మగౌరవానికి ఎక్కడా లోటు రాకుండా చూసుకునే బాధ్యత తమ ప్రభుత్వానిదే అన్నారు. తెలంగాణను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెట్టడమే తమ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగర సమగ్ర పురోగతికి మైలురాయిగా నిలిచే మూసీ నది పునరుజ్జీవం, మెట్రో రైలు విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రాజెక్టులను వేగంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర సంక్షేమం, ప్రగతి కోసమే పనిచేస్తున్న తమ ప్రభుత్వానికి, ఈ బృహత్తర అభివృద్ధి కార్యక్రమాలకు యాదవ సోదరులు సంపూర్ణ సహకారం అందించాలని ఈ సందర్భంగా కోరారు. రాష్ట్ర ప్రజలందరికి రేవంత్ రెడ్డి సదర్ శుభాకాంక్షలు తెలిపారు. సదర్ సమ్మేళనం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సదర్‌ను అధికారిక పండుగగా నిర్వహిస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు శాంతియుతంగా, సుఖసంతోషాలతో జీవిస్తున్నారన్నారు.

ట్రంప్‌కు ఎదురుదెబ్బతో భారత్‌కు ఊరట!

మొదటిపేజీ తరువాయి..

అధ్యక్షుడి విశేషాధికారాలను డెమొక్రాట్లు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తారు. దేశీయ రాజకీయాల్లో ప్రతిష్టంభన ఎదురవుతున్న తరుణంలో, విదేశాంగ రంగంలో విజయాలు సాధించాలని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. దీనితో భారత్‌తో ఎప్పటినుంచో నలుగుతున్న మధ్యంతర వాణిజ్య ఒప్పందం త్వరగా కొలిక్కి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారతీయ జనరిక్ మందులు, ఆభరణాలు, వజ్రాలు, విమాన విడిభాగాలపై విధిస్తున్న పరస్పర సుంకాలను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గించే ప్రతిపాదనలపై సంతకాలు త్వరపడవచ్చు. చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్‌ను తయారీ కేంద్రంగా మార్చే 'ఫ్రెండ్-షోరింగ్' విధానానికి ఇరు పార్టీల పూర్తి మద్దతు ఉండటం విశేషం. వాషింగ్టన్ అంతర్గత రాజకీయాల్లో ఎన్ని మార్పులు వచ్చినా భారత్-అమెరికా రక్షణ భాగస్వామ్యంపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడదు. అధునాతన సైనిక సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, సంయుక్త ఆయుధ తయారీ, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడును అడ్డుకునే అంశాల్లో రిపబ్లికన్లు, డెమొక్రాట్లు ఇద్దరూ భారత్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు. మధ్యంతర ఎన్నికల ఓటమి వెనుక పశ్చిమాసియా యుద్ధ పరిణామాలు కూడా ఉన్నందున, ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించాలని డెమొక్రాట్లు ట్రంప్ సర్కారుపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. పశ్చిమాసియాలో శాంతి నెలకొంటే అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు స్థిరపడతాయి. అత్యధికంగా ఇంధనాన్ని దిగుమతి చేసుకునే భారత ఆర్థిక రంగానికి ఇది కొండంత ఊరటనిస్తుంది. సాంకేతిక రంగంలో పనిచేసే భారతీయ నిపుణులపై హెచ్-1బీ వీసా పరిమితులను కఠినతరం చేయాలన్న ట్రంప్ ప్రణాళికలను డెమొక్రాట్ల కాంగ్రెస్ సమర్థవంతంగా అడ్డుకునే వీలుంది. అమెరికన్ టెక్ కంపెనీల పోటీతత్వానికి విదేశీ ప్రతిభ అవసరమని భావించే చట్టసభ సభ్యులు నిబంధనల సరళీకరణకు మద్దతు ఇవ్వవచ్చు. అయితే అమెరికా బడ్జెట్ కేటాయింపులపై కాంగ్రెస్, అధ్యక్షుడి మధ్య జరిగే రాజకీయ ఘర్షణలు ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితికి కారణమై రూపాయి మారకపు విలువపై ఒత్తిడి తెచ్చే ప్రమాదం లేకపోలేదు. అమెరికా కాంగ్రెస్‌లో అధికార సమతుల్యత మారడం భారత సంప్రదింపుల బృందాలకు విశేష బలాన్నిచ్చింది. అధ్యక్షుడి దూకుడుకు కాంగ్రెస్ అడ్డుకట్ట వేయడంతో, ఆసియా ప్రాంతంలో అత్యంత కీలకమైన భాగస్వామిగా ఉన్న భారత్ తన వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను సమాన స్థాయిలో దక్కించుకునే వెసులుబాటు లభించింది.

భారత నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించవచ్చు

మొదటిపేజీ తరువాయి..

ఈ రవాణా నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చినట్లు వెల్లడించింది. ఈ మేరకు ఇరాన్ పార్లమెంట్‌లోని జాతీయ భద్రత, విదేశాంగ విధాన కమిటీ ఉపాధ్యక్షుడు అహ్మద్ హయత్ మొఘద్దమ్ వ్యాఖ్యానించారు. "హర్మూజ్ జలసంధిలో రవాణా విషయానికి వస్తే మేము ఇప్పటికే నాలుగు దేశాలకు (భారత్, చైనా, ఇరాక్, ఖతార్) మినహాయింపులు ఇచ్చాం. అంటే మా కోణంలో వారు స్వేచ్ఛగా హర్మూజ్ గుండా రాకపోకలు సాగించవచ్చు. అమెరికాకు ఆయా దేశాలు ఈ జలసంధి గుండా ప్రయాణించడంపై ఎలాంటి సమస్యలు లేవు. ఈ నాలుగు దేశాల నౌకలు హర్మూజ్ జలసంధి గుండా స్వేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి. నిజానికి మేము వ్యాపారం చేస్తున్నాం కదా!. భారత నౌకలకు హర్మూజ్‌లో ఆంక్షల నుంచి ఈ మినహాయింపు ఇవ్వడం ద్వారా మేము వారి నుంచి మందులను దిగుమతి చేసుకుంటున్నాం. అలాగే చైనాకు ఈ వెసులుబాటు కల్పించడం ద్వారా వారి నుంచి రాజకీయ మద్దతు పొందుతున్నాం. అంతేకాకుండా వారి నుంచి మాకు ఆర్థిక చెల్లింపులు కూడా అందుతున్నాయి." అని అహ్మద్ హయత్ మొఘద్దమ్ పేర్కొన్నారు. అమెరికాతో ప్రత్యక్ష యుద్ధ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఉద్రిక్తతలను తగ్గించడానికి ఖతార్ ప్రతిపాదించిన శాంతి ఒప్పందాన్ని పరిశీలించాలని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘలిబాఫ్ సహా పలువురు రాజకీయ నాయకులు తమ దేశ సైనిక నాయకత్వానికి కోరుతున్నారు. అమెరికాతో ప్రత్యక్ష యుద్ధం మళ్లీ జరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఇరాన్ అంతర్గత అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ సీనియర్ రాజకీయ నాయకులు దౌత్యపరమైన పరిష్కారం కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఇరాన్ రాజకీయ నాయకులు దౌత్య మార్గాన్ని కొనసాగించడానికి ప్రయత్నిస్తుంటే, ఆ దేశ సైనిక వ్యూహకర్తలు మాత్రం మరోలా ఆలోచిస్తున్నారు. అమెరికా దళాలతో మళ్లీ ప్రత్యక్ష ఘర్షణకు దిగడమే రాబోయే రోజుల్లో ప్రధాన పరిణామం కానుందని వారు భావిస్తున్నారు. ఓవైపు చర్చలకు సిద్ధమవుతూనే, మరోవైపు యుద్ధానికీ ఇరాన్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా 10 లక్షల మంది యుద్ధ వాలంటీర్లకు శిక్షణ ఇచ్చేందుకు మరో సైనిక శిక్షణ శిబిరాన్ని ఏర్పాటుచేసింది. అమెరికా అణు బాంబు వేస్తుందేమోనని అనుమానిస్తున్న ఇరాన్ అందుకు ప్రజలను సన్నద్ధం చేస్తోంది. ఒకవేళ అణు దాడి జరిగితే ఎలా తప్పించుకోవాలో పేర్కొంటూ ఒక వీడియోను సైతం రిలీజ్ చేసింది. షెల్టర్లలోకి వెళ్లాలని, బయటి నుంచి గాలి చొరబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రేడియోధార్మికత నుంచి దూరంగా వెళ్లిపోవాలని ఆ వీడియోలో పేర్కొంది.ఇదిలా ఉండగా, అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌నకు ఎదురుదెబ్బ తగలడంపై ఇరాన్ స్పందించింది. ఈ ఎన్నికల ద్వారా అమెరికా ప్రజలు యుద్ధాన్ని తిరస్కరించినట్లు స్పష్టమైందని పేర్కొంది. ఓటర్ల తీర్పు యుద్ధానికి వ్యతిరేకంగా వెలువడిందని తెలిపింది.

సత్తుపల్లిలో దిగ్భ్రాంతికర ఘటన

మొదటిపేజీ తరువాయి..

ప్ర కలకలం రేగింది. బేతుపల్లి చెరువులో చేపల వేటకు వెళ్లిన కొందరు మత్స్యకారులు నీటి ఉధృతి పెరగడంతో చెరువు మధ్యలోనే చిక్కుకుపోయారు. వారి నుంచి సమాచారం అందుకున్న జిల్లా అధికార యంత్రాంగం వెంటనే ఎస్‌డీఆర్‌ఎఫ్ దళాలను అప్రమత్తం చేసింది. మత్స్యకారులను సురక్షితంగా బయటకు తీసుకురావాలనే లక్ష్యంతో 11 మంది సభ్యులతో కూడిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం రెండు మోటార్ బోట్లతో చెరువులోకి ప్రవేశించింది. అయితే, చెరువులో ఉన్న అనూహ్య నీటి సుడిగుండాలు, బలమైన నీటి ప్రవాహ హోరును తట్టుకోలేక బోట్లు అదుపుతప్పి బోల్తా పడటంతో ఈ ప్రమాదం సంభవించింది. సంఘటనా స్థలానికి సంబంధించిన సమాచారం అందగానే జిల్లా కలెక్టర్, ఎస్పీ సహా ఉన్నతాధికారులు బేతుపల్లి చెరువు వద్దకు చేరుకుని పరిస్థితులను సమీక్షించారు. నీటిలో గల్లంతైన ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పాటు చెరువులో చిక్కుకున్న మత్స్యకారులను రక్షించేందుకు అదనపు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను మరియు నైపుణ్యం కలిగిన ఈతగాళ్లను రంగంలోకి దించారు. చెరువు పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల సహాయంతో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. తీర ప్రాంతంలో అంబులెన్సులు, అత్యవసర వైద్య సదుపాయాలను సిద్ధంగా ఉంచారు. మరోవైపు, విషయం తెలిసిన వెంటనే నీటిలో చిక్కుకున్న సిబ్బంది , మత్స్యకారుల కుటుంబ సభ్యులు బేతుపల్లి చెరువు వద్దకు చేరుకోవడంతో అక్కడ విషాద ఛాయలు అలముకున్నాయి. రాత్రి వేళ కావడంతో వెలుతురు కొరత, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల సహాయక చర్యలకు కొంత ఆటంకం ఏర్పడినప్పటికీ, హెలికాప్టర్లు , ప్రత్యేక ఫ్లడ్‌లైట్ల సహాయంతో రెస్క్యూ బృందాలు నీటిలో ఉన్న వారిని ప్రాణాలతో బయటకు తీసేందుకు శ్రమిస్తున్నాయి. ప్రజాసేవలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ప్రమాదానికి గురికావడంపై స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అత్యవసరంగా స్పందించి విపత్తు నిర్వహణ దళాలకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరికరాలను అందించి, చిక్కుకున్న ప్రతీ ఒక్కరినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చాలని కోరుతున్నారు. ప్రస్తుతం బేతుపల్లి చెరువు వద్ద గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.





ట్రంప్‌కు ఎదురుదెబ్బ

మొదటిపేజీ తరువాయి..

డార్లిన్ గ్రాహమ్‌ను డెమొక్రాట్ అన్నీ ఆండ్రూస్ ఓడించారు. ఎలాంటి రాజకీయ అనుభవం లేని పీడియాట్రీషియన్ అయిన ఆండ్రూస్ అంచనాలను తలకిందులు చేస్తూ గెలుపొందారు. 1998 తర్వాత ఈ రాష్ట్రం నుంచి డెమొక్రాట్లు సెనెట్ సీటు గెలవడం ఇదే ప్రథమం. అలాగే నార్త్ కరోలినాలో మాజీ గవర్నర్ రాయ్ కూపర్ విజయం సాధించి రిపబ్లికన్ల సీటును డెమొక్రాట్ల ఖాతాలో వేశారు. ట్రంప్ బలపరిచిన మైఖేల్ వాట్లేను ఆయన ఓడించారు. 2008 తర్వాత ఇక్కడ డెమొక్రాట్ సెనెట్ ఎన్నికల్లో నెగ్గడం ఇదే మొదటిసారి. రిపబ్లికన్లు ఆశలు పెట్టుకున్న స్థానాలను కాపాడుకోవడంలో డెమొక్రాట్లు విజయం సాధించారు.
జార్జియా: 2024 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలిచిన జార్జియాలో సిట్టింగ్ డెమొక్రాట్ సెనేటర్ జాన్ ఓసాఫ్ రిపబ్లికన్ ఎంపీ మైక్ కాలిన్స్‌పై ఘనవిజయం సాధించారు. న్యూ హాంప్‌షైర్: రిటైర్ అవుతున్న సెనేటర్ జీన్ షాహీన్ స్థానంలో పోటీ చేసిన డెమొక్రాట్ క్రిస్ పాపాస్ మాజీ సెనెటర్ జాన్ సునునుపై గెలుపొందారు. దీనితో యూఎస్ సెనెట్‌కు ఎన్నికైన మొదటి ఓపెన్లీ గే (స్వలింగ సంపర్క) వ్యక్తిగా పాపాస్ చరిత్ర సృష్టించారు.
వర్జీనియా, డెలావేర్, న్యూజెర్సీ, రోడ్ ఐలాండ్, మసాచుసెట్స్‌లలో సిట్టింగ్ సెనెటర్లు మార్క్ వార్నర్, క్రిస్ కూన్స్, కోరీ బుకర్, జాక్ రీడ్, ఎడ్ మార్కీలు మళ్లీ విజయం సాధించారు. ఈ ఎన్నికల ప్రచారంలో ద్రవ్యోల్బణం, పెరిగిన జీవన వ్యయాలు, కుటుంబ ఖర్చులు ప్రధానాంశాలుగా నిలిచాయి. దేశ భవిష్యత్ దిశపై ఓటర్లలో వ్యక్తమైన అసంతృప్తి డెమొక్రాట్లకు లాభించింది. సెనెట్‌ను కైవసం చేసుకోవడం ద్వారా చట్టాల రూపకల్పన, అధ్యక్షుడి కీలక నియామకాల ఆమోదం, కాంగ్రెస్ పర్యవేక్షణ కమిటీలపై డెమొక్రాట్లకు పూర్తి పట్టు లభిస్తుంది. అంతేకాకుండా ట్రంప్ పరిపాలనపై దర్యాప్తులు చేపట్టే అధికారం వారికి దక్కుతుంది. మిగిలిన రెండేళ్ల పదవీకాలంలో ట్రంప్ అనుసరించే విధానాలు, శాసనపరమైన నిర్ణయాలకు సెనెట్ ద్వారా తీవ్ర అడ్డంకులు ఎదురుకానున్నాయి. ఒకవేళ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ కూడా డెమొక్రాట్ల వశమైతే కాంగ్రెస్‌పై రిపబ్లికన్ల ఏకపక్ష ఆధిపత్యం పూర్తిగా ముగిసినట్లే. మరోవైపు ఎన్నికల్లో భారత సంతతికి చెందిన రాజకీయ నాయకులు సత్తా చాటారు. డెమొక్రటిక్ పార్టీకి చెందిన సుహాస్ సుబ్రహ్మణ్యం, అరుణా మిల్లర్ తమ పదవుల్లో మరోసారి విజయం సాధించగా.. ఫ్లోరిడా కాంగ్రెస్ ఎన్నికల్లో పియా దండియా గెలుపొందారు. దీంతో అమెరికా రాజకీయాల్లో భారతీయ అమెరికన్ల ప్రాతినిధ్యం మరింత పెరిగింది. మరోవైపు, ఒహాయో గవర్నర్ పదవికి పోటీ చేసిన రిపబ్లికన్ నేత, డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారు వివేక్ రామస్వామికి ఎదురుదెబ్బ తగిలింది. డెమొక్రటిక్ ప్రత్యర్థి అమీ యాక్టన్ చేతిలో ఆయన ఓటమి పాలయ్యారు.

దేవునిగూడ గ్రామ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు



జన్నారం, నవంబర్ 4 (ప్రజాజ్యోతి) : నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు, ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు జన్నారం మండల అధ్యక్షులు నందు నాయక్ ఆధ్వర్యంలో బుధవారం రోజున దేవునిగూడ గ్రామ పంచాయతీ గ్రామ కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులుగా సింగిరెడ్డి సుధాకర్ రెడ్డి, అధ్యక్షులు గా కొంతం సతయ్య,ఉపాధ్యక్షులుగా నాంపల్లి రాజమల్లు, ఎంబడి మొగిలి,ప్రధాన కార్యదర్శి గా నర్సిగోజు శ్రీనివాస్,కార్యదర్శులు గా కూసునపెల్లి శాంతయ్య, సిదర్ల శ్రీనివాస్, మర్రిపెల్లి తిరుపతి, ప్రచార కార్యదర్శులు గా వొద్నాల మల్లేష్,మర్రిపెల్లి చిన్న తిరుపతి,సోషల్ మీడియా గుమ్ముల తిరుపతి, కునారపు వెంకటేష్,సలహాదారులు గా రామటెంకి రాజేష్,గూడ శంకరయ్య,రాగాల హనుమంతు, గొర్రె కొమురయ్య, సిరిపురం లింగయ్య, గడికోప్పుల రవీందర్ లను నియమించారు.ఈ కార్యక్రమంలో మండల నాయకుడు మచ్చ శంకరయ్య,మండల ప్రధాన కార్యదర్శి గొర్రె మహేష్, మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ మరిపెల్లి చంద్రయ్య, గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- యువత ఆలోచనలతోనే దేశాభివృద్ధికి నూతన దిశ

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి









మంచిర్యాల, 4, నవంబర్ (ప్రజాజ్యోతి) : వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో దేశంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పిలుపునిచ్చారు. దేశ నిర్మాణంలో యువతను భాగస్వాములను చేస్తూ, వారి ఆలోచనలు, అభిప్రాయాలను తెలుసుకునే ఉద్దేశంతో వికసిత్ భారత్--2047 కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల పట్టణంలోని ఎంఐఎంఎస్ డిగ్రీ కళాశాలలో యువ కాంక్లేవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రఘునాథ్ వెరబెల్లి విద్యార్థులతో ముఖాముఖి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షలకు అనుగుణంగా 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా నిలపాలంటే యువత వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని అన్నారు. దేశ అభివృద్ధిలో విద్య, ఉపాధి, పరిశ్రమల స్థాపన, వ్యవసాయ రంగాల్లో చేపట్టాల్సిన సంస్కరణలపై విద్యార్థులు తమ అభిప్రాయాలను, సూచనలను వెల్లడించారు. యువతలోని సృజనాత్మక ఆలోచనలు, నూతన ఆవిష్కరణలు దేశ ప్రగతికి దోహదపడతాయని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, పౌరులందరి సమష్టి కృషితోనే సాధ్యమవుతుందని అన్నారు. వికసిత్ భారత్--2047 సంకల్పాన్ని సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అమీరిశెట్టి రాజ్‌కుమార్, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, ఆకుల అశోక్‌వర్ధన్, సత్యనారాయణ, కమలాకర్‌రావు, రాకేష్ రెన్న, బింగి ప్రవీణ్, తరుణ్‌సింగ్, కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనగణనలో ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేయాలి

- ప్రతి బీసీ కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలి

- జాతీయ బీసీ కమిషన్ చైర్‌పర్సన్ సాధ్వి నిరంజన్ జ్యోతికి బహిరంగ లేఖ



మంచిర్యాల, 4, నవంబర్ (ప్రజాజ్యోతి) : దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జనగణనలో ప్రత్యేకంగా ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి బీసీ కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించే విధంగా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు జాతీయ బీసీ కమిషన్ చైర్‌పర్సన్ సాధ్వి నిరంజన్ జ్యోతికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మంచిర్యాల పట్టణంలోని ఇస్లాంపూర్ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 80 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా సమగ్రంగా బీసీ కులగణన చేపట్టకపోవడం విచారకరమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంట్ సాక్షిగా కులగణన చేపడతామని ప్రకటించినప్పటికీ, ప్రస్తుతం నిర్వహిస్తున్న జనగణనలో ప్రత్యేకంగా ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేయకపోవడం బీసీ సమాజానికి అన్యాయం చేయడమేనని విమర్శించారు. జనగణనలో ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేసి బీసీల జనాభా వివరాలు సేకరిస్తే జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో ప్రాతినిధ్యం, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, విద్యా, ఉద్యోగ రంగాల్లో తగిన అవకాశాలు కల్పించాల్సి వస్తుందనే ఉద్దేశంతో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారా అని ప్రశ్నించారు. దేశంలోని అన్ని వర్గాల జనాభా వివరాలను సేకరిస్తున్న ప్రభుత్వాలు బీసీల విషయంలో మాత్రం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. బీసీలకు దక్కాల్సిన సామాజిక, రాజకీయ వాటాను ఇంకా ఎన్నాళ్లు దూరం చేస్తారని నిలదీశారు. జాతీయ బీసీ కమిషన్ చైర్‌పర్సన్ సాధ్వి నిరంజన్ జ్యోతి ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించి, జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చడంతో పాటు దేశంలోని ప్రతి బీసీ కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సులు చేయాలని కోరారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బీసీల న్యాయమైన డిమాండ్‌ను, బీసీ సమాజ ఉద్యమ ఆకాంక్షలను గుర్తించి జనగణనలో ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేసి బీసీలకు న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పెద్దల్ల చంద్రకాంత్, రాష్ట్ర నాయకులు గజ్జల వెంకటయ్య, కడారి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంప్రదాయాలతో

శిక్షణ కలెక్టర్లకు అపూర్వ స్వాగతం!





• గుస్సాడీ నృత్యాలు, డప్పుల మోతతో హోరెత్తిన గాజిలి గ్రామం..

గ్రామస్థులతో కలిసి సందడి చేసిన అధికారులు

నేరడిగొండ నవంబర్ 05 (ప్రజాజ్యోతి) : ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నేరడిగొండ మండలంలోని గాజిలి గ్రామంలో శిక్షణ కలెక్టర్ల బృందానికి గ్రామస్థులు అపూర్వ స్వాగతం పలికారు. గ్రామానికి చేరుకున్న అధికారులకు డప్పుల మోతలు, కోలాటాలు, సంప్రదాయ నృత్యాలతో ఘనంగా ఆహ్వానం పలుకుతూ తమ సంస్కృతీ సంప్రదాయాలను చాటుకున్నారు. గ్రామానికి చేరుకున్న శిక్షణ కలెక్టర్ల బృందాన్ని గ్రామస్థులు సంప్రదాయబద్ధంగా స్వాగతించి, గ్రామ పటేల్ లక్ష్మణ్ ఇంటి వరకు డప్పుల చప్పుళ్లు, నృత్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ వేడుకలో గ్రామానికి చెందిన మహిళలు, చిన్నారులు, యువకులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సందడి చేశారు. ఈ సందర్భంగా అధికారులు సైతం గ్రామస్థులతో కలిసి గుస్సాడీ నృత్యాలు చేస్తూ అందరినీ అలరించారు. అధికారుల నృత్యాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.అనంతరం గ్రామస్థులను ఉద్దేశించి అధికారులు మాట్లాడుతూ.. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఎంతో విశిష్టమైనవని కొనియాడారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకు సాగడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, ఉప సర్పంచ్ ఆడేపు రవి, పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, పంచాయతీ కార్యదర్శి దత్త హరి, వార్డు సభ్యులు, మల్టీపర్పస్ వర్కర్లు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం గాజిలి గ్రామ పెద్దలు శిక్షణ కలెక్టర్ల బృందంతో పాటు సర్పంచ్, ఉప సర్పంచ్, పీఏసీఎస్ చైర్మన్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

పిప్రిలో నేడు కీలక ఆర్థిక అవగాహన శిబిరం..

జనధన్ ఖాతాలు, బీమా, పెన్షన్ పథకాలపై ప్రత్యేక దృష్టి.



అదిలాబాద్ టౌన్, నవంబర్ 4 (ప్రజాజ్యోతి) : ఇంద్రవెల్లి మండలం పిప్రి గ్రామపంచాయతీ కార్యాలయంలో నేడు ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభం అవుతుందని, ప్రధానంగా ప్రధానమంత్రి జనధన్ యోజన కింద ఖాతా ప్రారంభం, సంవత్సరానికి కేవలం 20 రూపాయలతో 2 లక్షల ప్రమాద బీమా, అలాగే 436 రూపాయలతో జీవిత బీమా పథకంపై వివరాలు తెలియజేస్తారు. 60 ఏళ్ల తర్వాత నెలకు రూ. 1,000 నుంచి రూ. 5,000 వరకు పెన్షన్ అందించే అటల్ పెన్షన్ యోజన వివరాలు కూడా చెప్పనున్నారు. ఆధార్ అనుసంధానం, నామినీ నమోదు, రీ-కేవైసీ, డీబీటీ సేవలపై కూడా సహాయం అందుతుంది. డిజిటల్ లావాదేవీలలో జాగ్రత్తలు, సైబర్ మోసాల నివారణ గురించి ప్రత్యేకంగా చర్చించనున్నారు. మోసం జరిగితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచన. గ్రామ రైతులు, మహిళా సంఘాలు, యువత అధికంగా హాజరవుతూ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీ. కృష్ణ కోరారు. శిబిర విజయవంతానికి స్థానిక సర్పంచ్ కోరంగే సుంగు ఉపసర్పంచ్ దుర్వా రంజు మాల,పంచాయతీ కార్యదర్శి సహకరించాలని కోరారు. ఈ శిబిరం ప్రతి అర్హ కుటుంబానికి ఆర్థిక భద్రతకు బాట వేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

బొరిగాం గ్రామాభివృద్ధే నా ధ్యేయం : ఎమ్మెల్యే అనిల్ జాదవ్





• రూ. 3.30 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ

• నూతన ఎంపీపీఎస్ పాఠశాలను ప్రారంభించిన బోథ్ ఎమ్మెల్యే

• గ్రామానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా

నేరడిగొండ నవంబర్ 05 (ప్రజాజ్యోతి) : మండలంలోని బొరిగాం గ్రామంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు బోథ్ శాసనసభ్యులు అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో కోట్లాది రూపాయల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో వర్షపు నీటి ముంపు సమస్య తలెత్తకుండా సుమారు రూ. 3 కోట్ల భారీ వ్యయంతో గుట్ట సైడ్ రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అలాగే గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎంపీపీఎస్ పాఠశాలను ప్రారంభించి విద్యార్థులకు అంకితం చేశారు. దీనితో పాటు రూ. 10 లక్షలతో మహిళా సంఘ భవనం, మరో రూ. 10 లక్షలతో కమ్యూనిటీ హాల్, రూ. 10 లక్షలతో జగదాంబ దేవి ఆలయ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు భూమిపూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. బొరిగాం గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. గ్రామానికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తున్నామని, గ్రామ ప్రజలందరూ ఎలాంటి విభేదాలకు తావు లేకుండా ఐక్యంగా, ప్రేమతో మెదలాలని పిలుపునిచ్చారు. బొరిగాం గ్రామానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు.

పాల్గొన్న ప్రముఖులు : ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ వినేశ్, ఉప సర్పంచ్ సంగీత బాయి, మాజీ సర్పంచ్ పవన్, పండరీ, రవీందర్ రెడ్డి, శివారెడ్డి, శ్రీకాంత్, జీవన్, రాథోడ్ సురేందర్, భూషణ్, మెర్సింగ్, మున్న నాయక్, చరణ్ నాయక్, నాయక్, కరోబారి, డావ్, గెరియా, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి







జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 4, (ప్రజాజ్యోతి) : నిర్మల్ జిల్లాలోని భైంసా మండలం మాటేగాం గ్రామంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

బుధవారం మాటేగాం గ్రామంలో కలెక్టర్ పర్యటించి, డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇళ్లకు సంబంధించిన రికార్డులు, లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులను గుర్తించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

అనంతరం భైంసా పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. స్థల విస్తీర్ణం, ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, తదుపరి చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ పర్యటనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, తహసీల్దార్ శశిభూషణ్, ఎంపీడీవో నీరజ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి





• సరస్వతీ అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

• జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 4, (ప్రజాజ్యోతి) : రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పుష్కరాల నాటికి అన్ని అభివృద్ధి, నిర్మాణ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బుధవారం బాసరలోని ఆలయ ఈవో కార్యాలయంలో పుష్కరాల ఏర్పాట్లు, సరస్వతీ అమ్మవారి ఆలయ నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పుష్కర ఘాట్ల మరమ్మతులు, నూతన ఘాట్ల నిర్మాణం, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, పిండ ప్రదాన ప్రాంతం, పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రం, భక్తుల పార్కింగ్, వీఐపీ పార్కింగ్ తదితర పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, పుష్కరాలకు వచ్చే ప్రముఖుల వసతికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి పనికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

అనంతరం సరస్వతీ అమ్మవారి ఆలయ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, పనుల్లో జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

పుష్కరాల ఏర్పాట్లు, ఆలయ నిర్మాణ పనులను సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని కలెక్టర్ సూచించారు.

ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ సుభాష్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసిన మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి : ఏపిఎం లలిత



జన్నారం, నవంబర్ 4 (ప్రజాజ్యోతి) : ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా యాక్సెంచర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్.ఎస్.డి.పి 158-హెర్బల్ ధూప్ స్టిక్స్ తయారీ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన మహిళలకు బుధవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో శిక్షకురాలు జొన్నలక్ష్మి, డిఆర్డిఏ ఐకెపి ఎపిఎం లలిత,మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వరలక్ష్మి చేతుల మీదుగా మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా ఏపీఎం లలిత మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలు నైపుణ్యాలను ఉపయోగించుకుని సొంత వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. హెర్బల్ ధూప్ స్టిక్స్, అగరబత్తులు, ఆవు పేడ ప్రమిదలు తదితర ఉత్పత్తులు తయారు చేసి మార్కెట్లో మంచి గుర్తింపు పొందాలని సూచించారు.మహిళల ఉత్పత్తుల విక్రయాలకు ఐకెపి తరఫున సహకారం అందిస్తామని,మార్కెట్లో ప్రదర్శన, విక్రయాలకు మద్దతు కల్పిస్తామని తెలిపారు.శిక్షణ పొందిన ప్రతి మహిళ విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదిగి స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని పాల్గొన్నవారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈడిఐఐ ప్రాజెక్ట్ ఆఫీసర్ బుక్యా దేవేందర్ నాయక్, మాస్టర్ ట్రైనర్ అలేఖ్య, వివోఏలు ముల్కల రవీందర్,రాథోడ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కరువును సమష్టిగా ఎదుర్కొందాం నీటిని పొదుపుగా వాడుకుందాం

• గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం నీరు విద్యుత్ సంరక్షణకు గ్రామస్తుల ప్రతిజ్ఞ



జైపూర్ నవంబర్ 4 ప్రజా జ్యోతి : కరువు పరిస్థితులను ముందుగానే గుర్తించి సమష్టి కృషితో ఎదుర్కొనేందుకు ఇందారం గ్రామం సిద్ధమైంది. జైపూర్ మండలంలోని ఇందారం గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం కరువు ప్రభావం నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ మేరకు సర్పంచ్ మహమ్మద్ ఫయాజుద్దీన్ మాట్లాడుతూ కరువు నివారణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి గ్రామస్తుడిపై కూడా బాధ్యత ఉందన్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని, బోరుబావులు, మోటార్లను అవసరానికి అనుగుణంగా క్రమపద్ధతిలో నడపాలని సూచించారు. రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని కోరారు.అలాగే పశువులకు పశు గ్రాసం కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవడంతో పాటు తాగునీటి తొట్టెలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నీరు, విద్యుత్ పొదుపును అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరిస్తూ ఐకమత్యంతో ముందుకు సాగితే కరువు ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. గ్రామసభలో గ్రామస్తులు నీరు, విద్యుత్ వృథా చేయకుండా వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

వరి ఎండిపోతుంటే అధికారులకు పట్టదా..?



జన్నారం, నవంబర్ 4 (ప్రజాజ్యోతి) : చివరి దశలో ఉన్న వరి పంటకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం చింతగూడ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.మాజీ ఎంపీపీ సుతారి వినయ్ మాట్లాడుతూ ఈ నెల 7 నుండి కడెం ప్రాజెక్టు నుండి సాగునీరు నిలిపివేస్తామని అధికారులు

సాగునీరు కోసం రోడ్డెక్కిన రైతన్నలు

ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పంట చేతికొచ్చే సమయంలో నీరు ఆపితే మా బతుకులు ఏం కావాలి..? లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పంట కళ్లముందే ఎండిపోతుంటే చూస్తూ ఊరుకుంటామా..?" అంటూ ప్రశ్నించారు.కడెం నీరు లేకపోతే పంట పూర్తిగా ఎండిపోయి అప్పులపాలవు తామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికా రులు తక్షణమే నిర్ణయం మార్చుకొని చివరి తడి వరకు సాగునీరు కొనసాగించాలని డిమాండ్ చేశారు.సాగునీరు అందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని



రైతులు హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ ఉదయ్ కిరణ్ అక్కడికి వెళ్లి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో



రాస్తారోకో విరమించారు .ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు పత్రాలను ఎంఆర్ఓ ఆఫీసులో అందించాలి

- బిఆర్ఎస్ పార్టీ సీనియర్ యువ నేత రామలింగం

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,నవంబర్ 04 (ప్రజా జ్యోతి): < హైదరాబాద్ రంగారెడ్డి పాలమూరు జిల్లాలో నూతన ఎమ్మెల్సీ ఓట్లను నమోదు చేసుకున్న గ్రాడ్యుయేట్ల అందరూ తమ యొక్క నమోదు పత్రాలను తప్పకుండా గెజిటెడ్



చేయించి స్థానిక బి ఎల్ఓలకు మరియు తాసిల్దార్ కు ఇవ్వాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ యువ నేత రామలింగం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియ గడువు పెంచినందుకు ఎన్నికల కమిషన్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గ్రాడ్యుయేట్లు అందరూ తమ యొక్క ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, రాబోవు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ యాదవ్,బుక్క నరసింహ,నవీన్,ఆనంద్ గ్రాడ్యుయేట్లు పాల్గొన్నారు.

రైతుల భాగస్వామ్యంతో పారదర్శకంగా భూ రీసర్వే

- నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి : అదనపు కలెక్టర్ వినోద్ కుమార్

వనపర్తి ప్రతినిధి, నవంబరు 4 (ప్రజాజ్యోతి):
భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు భూ సమగ్ర రీసర్వే కీలకమని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ అన్నారు. బుధవారం వనపర్తి మండలం నాచహళ్లి, కొత్తకోట మండలం నాంచారమ్మపేట, పుల్లారెడ్డికుంట గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా





సర్వే రికార్డులు, పనుల పురోగతిని తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. రీసర్వే పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేలో రైతులు, గ్రామస్తులను భాగస్వాములను చేస్తూ ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. భూముల కొలతల సమయంలో సంబంధిత యజమానులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఉండేలా చూడాలన్నారు. రైతుల సమక్షంలో పారదర్శకంగా సర్వే నిర్వహించడం ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా నాణ్యతతో సర్వే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వనపర్తి తహసీల్దార్ రమేష్‌రెడ్డి, కొత్తకోట తహసీల్దార్ సుభాష్‌నాయుడు, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడిగా గన్నోజు మోహనాచారి ఎన్నిక

- రెండోసారి అధ్యక్ష పీఠంపై మోహనాచారి

- సంఘం అభివృద్ధికి కృషి చేస్తా: మోహనాచారి

వనపర్తి, నవంబరు 4 (ప్రజాజ్యోతి):
వనపర్తి పట్టణ స్వర్ణకారుల సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా గన్నోజు మోహనాచారి రెండోసారి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పి. నవీనాచారి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా శ్యామ్‌సుందర్, మాధవాచారి వ్యవహరించి ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మోహన్, నారాయణదాస్ అనిల్, కృష్ణయ్య, కంసలి నాగార్జున్ తదితరులు పోటీ చేశారు. ఈ సందర్భంగా మోహనాచారి మాట్లాడుతూ.. స్వర్ణకారుల సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.



సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు సభ్యులందరి సహకారంతో ముందుకు సాగుతానని తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత కలిగిన పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలి

నాగర్ కర్నూల్ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ కోరే రెనయ్య



నాగర్ కర్నూల్ నవంబర్ 4 (ప్రజా జ్యోతి బ్యూరో)
హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కొరకు అర్హత కలిగిన ప్రతి ఒక్క పట్టబద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఓటర్లకుకోరే రెన్నయ్య విజ్ఞప్తి చేశారు ఈనెల 6 వ తేదీ ఓటర్ నమోదుకు చివరి రోజున ఉన్నందున ఈ యొక్క అవకాశాన్ని అర్హత కలిగిన పట్టభద్రులుసద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు

ఎన్నికల నేపథ్యంలో నాలుగు మండలాల్లో మద్యం దుకాణాలు బంద్

నవంబర్ 3 సాయంత్రం 5 గంటల నుంచి నవంబర్ 5 సాయంత్రం 5 గంటల వరకు మద్యం విక్రయాలపై నిషేధం

గద్వాల నవంబర్ 04(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ఆంధ్రప్రదేశ్‌లో రెండో విడత ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ,ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లాలోని నాలుగు మండలాల పరిధిలో ఎంపిక చేసిన 19 గ్రామాల్లో మద్యం విక్రయాలను పూర్తిగా నిషేధిస్తూ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఉత్తర్వులు జారీ చేశారు.తెలంగాణ ఎక్సైజ్ చట్టం –1968 లోని సెక్షన్ 20(1)ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. నవంబర్ 3వ,తేదీ సాయంత్రం 5 గంటల నుంచి నవంబర్ 5వ,తేదీ సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత గ్రామాల్లోని మద్యం దుకాణాలు,2బీ బార్లు,కల్లు దుకాణాలను తప్పనిసరిగా మూసివేయాలని ఆదేశించారు.అయిజ మండలంలోని పులికల్,వెనిసోంపురం,రాజాపురం,కేశవరం,కుతకనూరు గ్రామాలు అలంపూర్ మండలంలోని



జిల్లెలపాడు,సుల్తాన్‌పురం,రాయలంపాడు, సింగవరం,కాశీపురం గ్రామాల్లో ఈ నిషేధం అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఉండవెల్లి మండలంలోని బస్వాపురం,పుల్లూరు,కల్గొట్ల,మెన్నిపాడు గ్రామాలు,రాజోలి మండలంలోని తుమ్మిళ్ల,ధన్వాడ,రాజోలి,పెద్దధన్వాడ, చిన్నధన్వాడ గ్రామాల పరిధిలోనూ మద్యం విక్రయాలు నిలిపివేయాలని స్పష్టం చేశారు.నిర్ణీత గడువులో మద్యం దుకాణాలు,బార్లు,కల్లు దుకాణాలు మూసివేయాలని నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు.ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు,వ్యాపారులు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని,ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

అంగన్వాడీ సరుకులు పక్కదారి పడితే కఠిన చర్యలు:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

- అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

గద్వాల నవంబర్ 04 (ప్రజా జ్యోతి ప్రతినిధి):
అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు,గర్భిణులకు నాణ్యమైన పౌష్టికాహారం సక్రమంగా అందిస్తూ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.అంగన్వాడీ సరుకులను పక్కదారి పట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలు కేవలం పౌష్టికాహారం,పూర్వ ప్రాథమిక విద్య అందించే కేంద్రాలుగానే కాకుండా చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించే కేంద్రాలుగా పనిచేయాలన్నారు.జిల్లాలో బరువు,ఎత్తు తక్కువగా ఉన్న చిన్నారులను గుర్తించి వారికి అవసరమైన వైద్య చికిత్సతో పాటు ప్రత్యేక పౌష్టికాహారం అందించాలని సూచించారు.చిన్నారుల్లో కంటి,చెవి,ఇతర ఆరోగ్య సమస్యలతో పాటు మానసిక వికాసానికి సంబంధించిన అంశాలను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు.కొన్ని ప్రాంతాల్లో మేనరిక వివాహాల కారణంగా అంగవైకల్యం,మేధోపరమైన సమస్యలతో బాధపడుతున్న చిన్నారులు ఉన్నారని,ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.రానున్న 20 రోజుల్లో అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులందరికీ అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు.

అంగన్వాడీలకు పక్కా భవనాల నిర్మాణం

జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు వివిజి రాంజీ పథకం కింద చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.భవనాలు అవసరమైన



కేంద్రాలకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు.అధికారులు తరచూ అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు.సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు కూడా తమ పరిధిలోని కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించి వాటి నిర్వహణపై బాధ్యత తీసుకోవాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన కోడిగుడ్లు సరఫరా చేయాలని,కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేసినట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా ఆహారం సిద్ధం చేసి అందరికీ సరిపడా పౌష్టికాహారం అందించాలని స్పష్టం చేశారు.అంగన్వాడీ సరుకుల పంపిణీ,వినియోగంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

జిల్లాలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు.బాల్యవివాహాల గురించి సమాచారం అందిన వెంటనే అంగన్వాడీ టీచర్లు,వివిధ శాఖల అధికారులు బాలల సంరక్షణ విభాగానికి తెలియజేయాలని ఆదేశించారు.చిన్నారులందరికీ ఆధార్ నమోదు ప్రక్రియను పూర్తి చేసి కార్డులు అందేలా ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఆధార్‌తో పాటు అవసరమైన వారికి జనన ధ్రువీకరణ పత్రాలు అందించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

సఖి కేంద్రం సేవలపై విస్తృత ప్రచారం

మహిళల రక్షణ, భద్రత కోసం ఏర్పాటు చేసిన సఖి కేంద్రం సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.పాఠశాలల్లో విద్యార్థులకు గుడ్ టచ్,బ్యాడ్ టచ్,కౌమార దశలో వచ్చే మార్పులు,బాలల హక్కులు, వ్యక్తిగత భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ప్రతి పాఠశాలలో చైల్డ్ సేఫ్టీ నోడల్ అధికారిని నియమించిన నేపథ్యంలో బాలల హక్కులు,భద్రతకు సంబంధించిన సమస్యలు ఎదురైతే బాలల సంరక్షణ విభాగం అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డీడబ్ల్యూఓ సునంద,డీసీపీవో నరసింహ,సీడీపీవోలు రాజేశ్వరి, హేమలత,సూపర్‌వైజర్లు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

అఖిలభారత 36వ మహాసభలను జయప్రదం చేయండి

రైతంగ సాయుధ పోరాట గడ్డ నల్లగొండలో జరుగుతున్న రైతు మహాసభలను జయప్రదం చేయండి

నాగర్ కర్నూల్ నవంబర్ 4 (ప్రజా జ్యోతి బ్యూరో)
నాటి బ్రిటిష్ సామ్రాజ్యవాదం, వలసవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో 1936లో అఖిలభారత కిసాన్ సభ ఆవిర్భవించి నేటికీ 90 సంవత్సరాలు అవుతున్నది. ప్రపంచ గుర్తింపు పొందిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల పురిటిగడ్డ నల్లగొండలో మొట్టమొదటిసారిగా అఖిలభారత కిసాన్ సభ 36వ రైతు జాతీయ మహాసభలుజరుగుతున్నాయని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దేశనాయక్ అన్నారు. ఈ మహాసభలను రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.
బల్మూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద రైతు సంఘం అఖిలభారత మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నాగర్ కర్నూల్ జిల్లాలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ఇప్పటికి 13 మండలాలకి కరువు మండలాలు ప్రకటించి మిగతా మండలాలను ప్రకటించలేదని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు, ప్రకటించిన కరువు మండలాల్లో ఆరధాన్యాలకు ఎకరాకు 25 వేల చొప్పున వాణిజ్య పంటలు పత్తి వంటికి ఎగరకు 50 వేల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీడు భూములకు సాగునీరు, అందించే ప్రాజెక్టుల కోసం, పరిశ్రమలను స్థాపించాలని డిమాండ్ చేశారు. నేడు రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కారానికి ఈ సమస్యల ఆందోళన పోరాటాల కార్యక్రమంలో నల్గొండలో జరిగే ఏఐకేఎస్



పోడు భూములకు పట్టాలు, కౌలు రైతులకు న్యాయంచేయాలని ,పంట రుణాలు, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సరఫరా, నేటికీ రుణమాఫీ అమలు కానీ రైతులకు వెంటనే చేయాలని పెండింగ్ రైతు భరోసా నిధులనుఇవ్వాలని ,వరంగల్ రైతు డిక్లరేషన్లు కాంగ్రెస్ ప్రకటించిన వాగ్దానాలు అమలుకై చర్యలు చేపట్టాలని ప్రేమిస్తే అనేక ఆందోళన పోరాటాలకు పునాది వేస్తామని వారు అన్నారు. వ్యవసాయ ఆధారిత 36 అఖిల భారత మహాసభ వేదిక కాన ఉందని ఈ మహాసభ విజయవంతం కావడానికి రైతులు రైతు శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శంకర్ నాయక్ మండల నాయకులు బాలరాజు కృష్ణయ్య భారీమం ఆంజనేయులు రాయుడు లాలు కృష్ణగన్న నారాయణ రైతులు తదితరులు ఉన్నారు,

మొల్ల మాంబ కీర్తిని చాటుదాం.. ఐక్యతను చూపుదాం

- కుమ్మరుల ఐక్యతకు మొల్ల మాంబ విగ్రహ భూమిపూజ వేదిక
- నవంబర్ 11న మొల్ల మాంబ విగ్రహానికి భూమిపూజ

వనపర్తి, నవంబరు 4 (ప్రజాజ్యోతి):
తొలి తెలుగు కవయిత్రిగా పేరొందిన ఆతుకూరి మొల్లమాంబ తెలుగుజాతి గర్వించదగ్గ మహా రచయిత్రి అని మాజీ కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ బొడ్డుపల్లి పరుశురాం, శ్రీరంగాపురం కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు గోవిందు అన్నారు. బుధవారం శ్రీరంగాపురం మండలంలో కుమ్మరి సంఘం అధ్యక్షులు, యువజన నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నవంబర్ 11న వనపర్తి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేతుల మీదుగా మొల్లమాంబ విగ్రహ భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నన్నయ్య ఆదికవి అయితే, మొల్ల ఆదికవయిత్రిగా తెలుగు సాహిత్య చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. రాజుల ఆస్థానాల అండ లేకుండానే సామాన్యులకు సైతం అర్థమయ్యే అచ్చ తెలుగులో రామాయణాన్ని రచించి శ్రీరాముడికి అంకితం చేసిన గొప్ప కవయిత్రి మొల్ల అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మొల్లమాంబ విగ్రహ భూమిపూజ కార్యక్రమానికి వనపర్తి జిల్లా పరిధిలోని కుమ్మర కుటుంబాల సభ్యులు, కుల పెద్దలు, యువత, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం, ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బొడ్డుపల్లి మన్యం, మండల సంఘం అధ్యక్షుడు శేఖర్, ఉపాధ్యక్షుడు ఎల్లస్వామి, యువజన అధ్యక్షుడు సురేష్, శ్రీరంగాపురం టౌన్ అధ్యక్షుడు తిరుపతయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



మహిళల ఆర్థిక స్వావలంబనకు అక్షరజ్ఞానమే పునాది

- చదవడం, రాయడం నేర్చుకునే మహిళకు రూ.5 వేల బహుమతి: మంత్రి జూపల్లి

వనపర్తి ప్రతినిధి, నవంబరు 4 (ప్రజాజ్యోతి):
మహిళలు అక్షరాస్యులైనప్పుడే ఆత్మవిశ్వాసంతో పాటు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు అవకాశాలు మెరుగుపడతాయని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం రావాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. బుధవారం పానగల్ మండలం తెల్లరాళ్లపల్లి గ్రామంలో నిరక్షరాస్య మహిళలకు మంత్రి పలకలు, బలపాలు పంపిణీ చేశారు. వీటి కొనుగోలుకు



గతంలో రూ.10 వేల ఆర్థిక సాయం అందించిన ఆయన, అక్షరాస్యత కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగాలని సూచించారు. మహిళలకు ప్రతిరోజూ ఉదయం గంట, సాయంత్రం గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని సర్పంచ్ జంబలయ్యను ఆదేశించారు. ఇందుకోసం మరో రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. చదువుకు వయసుతో సంబంధం లేదని పేర్కొన్న మంత్రి.. ముందుగా చదవడం, రాయడం నేర్చుకునే మహిళకు రూ.5 వేల నగదు బహుమతి ప్రకటించారు. మహిళల విద్యతో కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని అన్నారు.

జంతు జనన నియంత్రణకు పటిష్ట చర్యలు

- డంపింగ్ యార్డులో చెత్త నిర్వహణను మెరుగుపరచాలి: అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

వనపర్తి ప్రతినిధి, నవంబరు 4 (ప్రజాజ్యోతి):
జిల్లావ్యాప్తంగా వీధి కుక్కల జంతు జనన నియంత్రణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన అన్ని మౌలిక, వైద్య సదుపాయాలను ఒకేచోట ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం నాగవరం శివారులోని జంతు జనన నియంత్రణ కేంద్రం, డంపింగ్ యార్డును ఆయన సందర్శించి నిర్వహణ తీరును పరిశీలిం



చారు. ఈ సందర్భంగా వీధి కుక్కలకు నిర్వహిస్తున్న శస్త్రచికిత్సలు, వైద్య సేవలు, కేంద్రంలోని సదుపాయాలపై ఆరా తీశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించి తడి, పొడి చెత్తను వేగంగా వేరు చేసి, వ్యర్థాల నిర్వహణకు పటిష్ట వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గతంలో అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి, మరోసారి అలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల నిర్వహణలో మేట్లదే కీలక బాధ్యత!

చిన్నంబావి, నవంబర్ 04 (ప్రజాజ్యోతి)
గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకం పనులను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు కూలీలకు నిరంతరం పని కల్పించడంలో మేట్లు కీలక పాత్ర పోషించాలని ఏపీఓ ధనుంజయ రాజు సూచించారు. చిన్నంబావి మండల పరిధిలోని దగడపల్లి రైతు వేదికలో ఉపాధి హామీ పథకం కింద వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న మేట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టే పనుల నిర్వహణ, కూలీలకు పని కల్పించే విధానం, పని ప్రదేశాల్లో హాజరు నమోదు, రోజువారీ పనుల వివరాల నమోదు, పనుల కొలతలు, కూలీలకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలపై ఎంపీడీవో సుర్ణ ఆదర్శ్ గౌడ్ మేట్ల విధులు, బాధ్యతలు, పథకం కింద చేపట్టే 375 రకాల పనులపై అవగాహన కల్పించారు. పనుల్లో నాణ్యత, పారదర్శకత పాటించాలని సూచించారు. అనంతరం ఏపీఓ ధనుంజయ రాజు మేట్లకు వివరంగా అవగాహన కల్పించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాల్సిన విధానాన్ని వివరించారు.ఈ సందర్భంగా ఏపీఓ ధనుంజయ రాజు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంత పేద కూలీలకు జీవనోపాధి కల్పించే ముఖ్యమైన పథకమని పేర్కొన్నారు. ఈ పథకం లక్ష్యాలు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలయ్యేలా మేట్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.గ్రామాల్లో అందుబాటులో ఉన్న కూలీలకు ముందుగానే పనుల వివరాలు తెలియజేసి, పనులకు హాజరయ్యేలా సమన్వయం చేసుకోవాలని తెలిపారు. పని ప్రదేశాల్లో కూలీల హాజరును నిబంధనల ప్రకారం నమోదు చేయడంతో పాటు, రోజువారీ పనుల వివరాలు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. పనుల కొలతలు, కూలీల పని సామర్థ్యం, వారికి అందించాల్సిన



సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. పనుల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శకత పాటించాలని, కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసర మైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి మేటు తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, ఉపాధి హామీ పనుల అమలులో అధికారులకు మరియు కూలీలకు మధ్య సమన్వయకర్తగా వ్యవహరించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి పథకం విజయవంతానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఈసీ వెంకటేశ్వర్లు,టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ) మేకల గోపాల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కత్తి కురుమూర్తి, భాస్కర్ నాయక్, రామకృష్ణ, భాస్కర్ నాయుడు, భారతి, అరుణ, విష్ణు, మేట్లు అనుకలి అంజలమ్మ, సీతామాలక్ష్మి , శ్రీనివాసులు, మాధవి,మధుసూదన్, మద్దూరి రాజు, వెంకటేష్, రాజశేఖర్, అంజతొద్దిన్, గ్రామాల మెట్లు తదితరులు పాల్గొన్నారు.

మహాదేవపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 04 (ప్రజా జ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ బుధవారం రోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని, సీసీ కెమెరాల పనితీరును, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

బాధిత కుటుంబానికి వైద్య చికిత్సకు రూ.2 లక్షల ఎల్ఓసీ అందజేత

మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో బాధితుడికి వైద్య సాయం



కాటారం, నవంబర్ 4, ప్రజా జ్యోతి: అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండల కేంద్రానికి చెందిన మాతంగి శాంతికుమార్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆశ్రయించగా రూ. 2 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు. బాధితుడి కుటుంబ సభ్యులు వైద్య సహాయం కోసం మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ. 2 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన ఆసుపత్రి సహాయకులు బాధిత కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ పత్రాన్ని అందజేశారు. అనారోగ్య సమయంలో ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచిన మంత్రి శ్రీధర్‌బాబుకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కుడుముల శ్రీనివాస్ మృతి చెందడం బాధాకరం

కుడుముల శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించిన బడే నాగజ్యోతి



మంగపేట నవంబర్ 04 (ప్రజాజ్యోతి) : మంగపేట మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ తమ్ముడు కుడుముల శ్రీనివాస్ మృతి చెందడం బాధా కరమని బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి అన్నారు.శ్రీనివాస్ మృతి చెందిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజక వర్గ ఇంచార్జి బడే నాగ జ్యోతి బుధవారం మంగపేట మండలం మొట్లగూడెం (మల్లూరు) లోని వారి స్వగృహానికి వెళ్లి మృతుడు శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.కార్యక్రమంలో జిల్లా నాయకుడు జగదీష్, మండల మాజీ ప్రధాన కార్యదర్శి గుండేటి రాజు యాదవ్,మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోరం సంతోష్,సొసైటీ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్,ఎస్టీ సెల్ మాజీ మండల అధ్యక్షుడు తోలెం నర్సింహారావు,నర్సింహా సాగర్ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు ఊడుగుల శ్రీనివాస్ యాదవ్,బోరు నర్సాపూర్ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు రావుల రమణ,మైనార్టీ సీనియర్ నాయకుడు భూట్టో,ఎస్టీ సెల్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి కెక్కం జగదీష్,పార్టీ నాయకులు, కోరం నర్సింహులు, యూత్ నాయకులు గౌని రమేష్,నాగ,బొడ మహేష్, సాదనపల్లి రవి,అరవింద్, సోషల్ మీడియా వారియర్స్ బీస సాంబయ్య,గుడివాడ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు గ్రామంలో ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం

నాలుగు రకాల చెత్త వేరుచేయడంపై ప్రత్యేక దృష్టి!



రాయపర్తి నవంబర్ 4, ప్రజా జ్యోతి : సుప్రీంకోర్టు మార్గదర్శకాలు మరియు ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల (ఎస్ డబ్ల్యూ ఎం–2026) ప్రకారం, వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొత్తూరు గ్రామంలోబుధ వారం ఘన వ్యర్థాల నిర్వహణపై ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 8వ వార్డులో ఇంటింటికీ తిరిగి ప్రజలకు చెత్త సేకరణ మరియు దాని విభజనపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ స్వప్న సంతోష్ కందికట్ల ముఖ్య వక్తగా హాజరై, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు నాలుగు రకాల చెత్తను (తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన/ప్రమాదకరమైన చెత్త మరియు సానిటరీ వ్యర్థాలు) వేర్వేరుగా ఎలావేరుచేయాలో సవివరంగా వివరించారు. చెత్తను వేరుచేసిఅందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సొంతం చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు గ్రామ కార్యదర్శి ఎండి ఆస్మా ,8వ వార్డు సభ్యులు నేలవెల్లి సుబ్బారావు, కారోబార్ కందికట్ల సురేష్ , పంచాయతీ సిబ్బంది తాటికాయల బాబు తాటికాయల భాస్కర్ గ్రామస్తులందరూ తడి, పొడి చెత్తను వేరుచేసి పంచాయతీ సిబ్బందికి అందించాలని, తద్వారా కొత్తూరు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలనికోరారు.

పారదర్శకంగా భూముల రీ సర్వే చేపట్టాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి - ఆత్మకూర్‌లో భూ రీసర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్







ఆత్మకూరు, నవంబర్ 4 (ప్రజాజ్యోతి): భూముల రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలం బ్రాహ్మణ పల్లి రెవెన్యూ లోని కామారం గ్రామం లో జరుగుతున్న భూముల రీ సర్వే తీరును హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంకా ఎన్ని ఎకరాలలో సర్వే పూర్తి చేయాల్సి ఉందనే వివరాలను భూములు, కొలతలు శాఖ ఏడీ నూర్ సింగ్, సర్వేయర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రోవర్లతో సర్వే నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. అక్కడ ఉన్న స్థానిక రైతులతో సర్వే తీరు గురించి కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భూముల సరిహద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలను కచ్చితంగా నమోదు చేసే దిశగా రీసర్వే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. భూముల రీసర్వేను పూర్తి చేయడంలో రైతులు సహకరించాలని సూచించారు. సర్వే సమయం లో రైతులు తమ భూమి హద్దులను సరిగా చూపించాలని అన్నారు. సర్వేయర్లు సర్వే సమయం లో జాగ్రత్తలు వహించాలని సూచించారు. పారదర్శకంగా చేపడుతున్న భూముల రీసర్వేతో రైతుల భూ హక్కులకు భరోసా లభిస్తుందన్నారు. రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు, సర్వేయర్లకు సూచించారు. ఈ కార్యక్రమం లో స్థానిక తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, కామారం సర్పంచ్ తోట లక్ష్మీ, ఇతర అధికారులు, సర్వేయర్లు, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పల్లా సుందర్ రాంరెడ్డి పరామర్శ



దేవరుప్పుల, నవంబర్ 4 (ప్రజాజ్యోతి) : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు మండలంలోని అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు అల్లాం స్వామి తండ్రి అల్లాం సోమయ్య ఇటీవల మరణించగా, ఆయన కుటుంబాన్ని బుధవారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం అదే గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు పులిగిల్ల శ్రీనివాస్ ఇటీవల సర్జరీ చేసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు.ఆయన వెంట మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, మండల నాయకులు వంగ అర్జున్ మండల, గ్రామ నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

గవర్నర్ కోటాలో గడ్డం భాస్కర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలి

సీఎం రేవంత్‌రెడ్డికి బీసీ సంఘాలు, పద్మశాలీ నాయకుల విజ్ఞప్తి





పరకాల, నవంబర్ 04, (ప్రజా జ్యోతి): శాసనమండలిలో బిసి సమాజానికి సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని బీసీ సంఘాల ప్రతినిధులు, పద్మశాలీ నాయకులు, మేధావులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పరకాల పట్టణంలోని రిజైర్డ్ ఎంప్లాయీస్ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు, ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ గడ్డం భాస్కర్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. విద్యా, పరిశోధనా రంగాల్లో విశేష అనుభవం కలిగిన ఆయన చేనేత రంగ సమస్యలపై కూడా పరిశోధనలు చేశారని తెలిపారు. నేతన్నల సమస్యలు, చేనేత సహకార సంఘాల బలోపేతం, బీసీల అభ్యున్నతి కోసం శాసనమండలిలో సమర్థంగా గళం వినిపించగలరని పేర్కొన్నారు. పద్మశాలీ సమాజానికి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు.
ఈ సమావేశంలో మాజీ మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు సాదు రఘువీర్, మాజీ వైస్ ప్రిన్సిపల్ నల్లల భిక్షపతి, బీసీ నాయకులు గునికంటి రవి, ఎం.ఎన్. మూర్తి, శ్రీకాంత్, బైరి రవి, సాయికుమార్, సునీల్, జనార్దన్, తాళ్లపల్లి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పులను కరువు మండలంగా ప్రకటించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేష్



దేవరుప్పుల, నవంబర్ 4(ప్రజాజ్యోతి) : ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం నెలకొందని, దేవరుప్పుల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి నివారణ చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేష్ డిమాండ్ చేశారు.బుధవారం మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ సమావేశంలో రెడ్డిరాజుల నారాయణ అధ్యక్షత వహించగా రమేష్ పాల్గొని మాట్లాడుతూ..పంట నష్టానికి వరికి రూ.30 వేలు, పత్తి, మిర్చికి రూ.50 వేలు, ఇతర పంటలకు రూ.20 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని, విద్యుత్ కోతలు లేకుండా సాగునీరు అందించాలని కోరారు.తాగునీటి సమస్య నివారణకు ప్రత్యేక నిధులు, రేషన్ కార్డుపై 12 కిలోల బియ్యం, 14 రకాల నిత్యావసరాలు, ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు.సమావేశంలో మండల కార్యదర్శి ఇంటి వెంకటరెడ్డి, గడ్డం యాదగిరి, కొప్పుల ఉప్పలయ్య, చింత మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో మేధావులు భాగస్వాములు కావాలి

- ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

- గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పిలుపు



హసన్‌పర్తి,నవంబరు4(ప్రజాజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణకు మేధావులు, ఉపాధ్యాయులు, వైద్యులు, ప్రజాస్వామ్యవాదులు భాగస్వాములు కావాలని భాజపా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. హసన్‌పర్తిలోని మహాలక్ష్మి బాంకెట్ హాల్ లో వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి మేధావుల సదస్సు నిర్వహించారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. మూకదాడులను నిర్మూలించండి' అనే అంశంపై జరిగిన ఈ సదస్సుకు మాజీ 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని, జాబితాలో పారదర్శకత తీసుకురావడమే దీని ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. మరణించిన వారి పేర్లు, ఒకటి కంటే ఎక్కువసార్లు నమోదైన ఓట్లు, నివాసం మారిన వారి వివరాలను నిబంధనల ప్రకారం సరిచేయడమే ఈ ప్రక్రియ లక్ష్యమన్నారు. దీనిపై కాంగ్రెస్ ప్రజల్లో అపోహలు సృష్టిస్తూ దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు.విదేశీ శక్తుల ప్రేరణ, ఆర్థిక సహకారంతో కాంగ్రెస్‌తో పాటు కొన్ని ఇతర శక్తులు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి ప్రయత్నాలను మేధావులు గుర్తించి, వాస్తవాలను ప్రజలకు వివరించాలని కోరారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తుల ప్రయత్నాలను అడ్డుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా రానున్న రోజుల్లో ర్యాలీలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, అల్లం మల్లికార్జునరావు, ఆకుతోట శాంతారామ్ కర్ర, గూడూరి లక్ష్మీనారాయణతో పాటు వివిధ మండలాల నాయకులు, ఉపాధ్యాయులు, వైద్యులు, మేధావులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

గూనిపర్తిలో భూ రీసర్వే

పరిశీలించిన అదనపు కలెక్టర్ ఎన్.రవి



హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్ 04, (ప్రజాజ్యోతి) : హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూనిపర్తి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు ఎన్ని ఎకరాల భూమిని సర్వే చేశారు, ఇంకా ఎంత విస్తీర్ణంలో సర్వే పూర్తి చేయాల్సి ఉందనే వివరాలను అధికారులను, సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు.భూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దీత సమయంలోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు, సర్వేయర్లకు సూచించారు.
సర్వే పనుల్లో జాప్యం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ సురేష్ కుమార్, సర్వేయర్లు, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించొద్దు

వంగర, ముల్కనూరు పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య





హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్ 04, (ప్రజాజ్యోతి) : ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య సూచించారు. బుధవారం జిల్లాలోని వంగర, ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఫార్మసీలో మందుల నిల్వలు, పంపిణీ వివరాలు, ప్రయోగశాల రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని సిబ్బందికి సూచించారు. మాతా శిశు ఆరోగ్య సేవలు, సాధారణ టీకాలు, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాలను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.
అలాగే దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపునకు విస్తృతంగా పరీక్షలు నిర్వహించి, బాధితులకు సకాలంలో చికిత్స అందించాలని సూచించారు. టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా క్షయ రోగులను ముందుగానే గుర్తించాలన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నియంత్రణకు పారిశుద్ధ్య కార్యక్రమాలు, దోమల నివారణ చర్యలు చేపట్టాలని, ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. ఈ తనిఖీల్లో వంగర వైద్యాధికారులు డాక్టర్ రహమాన్, డాక్టర్ రూబీనా, ముల్కనూరు వైద్యాధికారి డాక్టర్ ముజీబ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి..



పరకాల, నవంబర్ 4 (ప్రజాజ్యోతి) : వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు వేగవంతం చేశారు. టీపీసీసీ, డీసీసీ నాయక త్వం, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం పరకాల పట్టణంలో పలువురు పట్టభద్రు లను గుర్తించి వారి నుంచి అవసరమైన ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులు సేకరించారు. అనంతరం ఫారం–18 ద్వారా దరఖాస్తులు పూర్తి చేసి, పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ల వద్ద ఆన్‌లైన్ లో నమోదు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి గెలుపు లక్ష్యంగా అర్హులైన పట్టభద్రులం దరినీ ఓటర్లుగా నమోదు చేయించేందుకు కృషి చేస్తున్నట్లు మడికొండ సంపత్ కుమార్ తెలిపారు.
ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి పట్టభద్రుడిని కలిసి ఓటు నమోదు ప్రక్రియను పూర్తి చేయించాలని వారు పేర్కొన్నారు.

నేల ఆరోగ్యాన్ని కాపాడడం మన అందరి బాధ్యత

మండల వ్యవసాయ శాఖ అధికారి వీరభద్రం



రాయపర్తి నవంబర్ 4 ప్రజా జ్యోతి : వరంగల్ జిల్లా రాయపర్తి మండలం రాయపర్తి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఖేత్ బచావో అభియాన్'లో భాగంగా బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సహేంద్ర భిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ సాగు ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని, పంట మార్పిడి, మల్చింగ్, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని, పప్పుధాన్యాలు,నూనెగింజలు, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. రైతులకు స్థిరమైన నికర ఆదాయం అందించడమే ఈ అభియాన్ లక్ష్యమని పేర్కొన్నారు.

మండల వ్యవసాయ అధికారి వీరభద్రం మాట్లాడుతూ ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో యాసంగిలో వరి,మొక్కజొన్న వంటి అధిక నీటి వినియోగ పంటలకు బదులుగా ఆరుతడి పంటలు,పప్పు దినుసులు, చిరుధాన్యాలు సాగు చేయాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. పశువులకు అవసరమైన మేత అందుబాటుపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నడం ద్వారా నేల సారాన్నిపెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు చిరు ధాన్యాలు, సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు.రైతులు కూరకాయల పంట సాగు చేస్తూ అధిక లాభాలు పొందాలని కోరారు.పామ్ ఆయిల్ పంట ,కురకాయల పంటలు మీద సబ్సిడీ పొంది రైతులు లబ్ధి పొందాలని కోరారు. ఎలక్ట్రిసిటీ ఏఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వనకాలం పంటలకు సరిపోను విద్యుత్తు అందిస్తాం అని .రైతులు యాసంగి లో మాత్రం తక్కువ నీళ్లు అవసరం ఉండే పంటలు సాగుచేసుకోవాలని.
గ్రామ సర్పంచ్ సహేంద్ర భిక్షపతి మాట్లాడుతూ అధికారులు చూపిన సూచనలు పాటించాలని, వరి కి బదులుగా తక్కువ నీటిని ఉపయోగించే పంటలు సాగు చేయాలని కోరారు. భూగర్భ జలాలు దృష్టిలో పెట్టుకొని, నీటిని పొదుపుగా వాడుకోవాలి కోరారు.గృహ అవసరాలకు అందించే విద్యుత్ కూడా పొదుపుగా వాడుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గుమ్మడి వీరభద్రం, పశువైద్యాధికారి, విద్యుత్ శాఖాధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి గీత, మహిళలు,గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



కృష్ణా జలాలతో చెరువులకు జలకళ..

ఎమ్మెల్యే వీరేశంకు కృతజ్ఞతలు

నల్లగొండ నవంబర్ 4 (ప్రజా జ్యోతి ప్రతినిధి):
నకిరేకల్: వర్షాభావ పరిస్థితులతో చెరువులు, కుంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం కృషితో



కృష్ణా జలాలు నియోజకవర్గానికి చేరాయని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు, నకిరేకల్ మాజీ కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాస్ అన్నారు. కృష్ణా జలాలతో చెరువులు, కుంటలు నిండుతున్న నేపథ్యంలో నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుంట చెరువు అలుగు వద్ద గంగమ్మ తల్లికి పసుపు, కుంకుమ, పూలు, కొబ్బరికాయలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశంకు నియోజకవర్గ ప్రజలు, రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రజలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శ్రీకారం

ఆలేరు నవంబర్ 4 (ప్రజా జ్యోతి):
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీలోని 6 వ వార్డు బహుదూర్ పేటలో పర్ష భవాని మహేష్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆలేరు మున్సిపల్ వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు ముగ్గు పోసి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు ఎజాస్, పిఎసిఎస్ డైరెక్టర్ వట్టిపల్లి





శ్రీనివాస్, కురుమ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్, గొర్ల కాపర్ల సంఘం అధ్యక్షులు వట్టిపల్లి లక్ష్మణ్, బిఆర్ఎస్ నాయకులు పల్లె మహేష్, కాంగ్రెస్ నాయకులు వట్టిపల్లి వెంకటేష్, మహేష్ భాస్కర్ ,సాయినాథ్ ,పర్ష నరేష్, పవన్ ,రంజిత్ ,బాలకృష్ణ, భాను తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కు అందజేత

ఆలేరు నవంబర్ 4 (ప్రజా జ్యోతి):
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో సిల్వర్ సుపత్రిక కుమార్తె కళ్యాణ లక్ష్మి చెక్కును బుధవారం గ్రామ సర్పంచ్ బెదరబోయిన యాకమ్మ



వెంకటేష్ అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గాదె సోమిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాటమరాజు, పరశురాములు, మహేష్, మండల యూత్ అధ్యక్షులు బండపల్లి మహేష్,గుండెల రవి,సోములు,చందు, శ్రీకాంత్ , సంపత్ తదితరులు పాల్గొన్నారు.

దూడల నట్టల నివారణ

ఆలేరు నవంబర్ 4 (ప్రజా జ్యోతి):
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మందన పల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దూడల నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రేణుక ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి యాకుబ్ నాయక్ మాట్లాడుతూ, దూడల ఆరోగ్య సంరక్షణలో నట్టల నివారణ మందులు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని, వీటి వల్ల దూడలు ఆరోగ్యంగా ఎదిగి పశుసంపద వృద్ధి చెందుతుందని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మొత్తం 48 దూడలకు ఉచితంగా నట్టల నివారణ మందులను వేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పద్మ శశిరేఖ సుదర్శన్ , వార్డ్ సభ్యులు గ్రామ కార్యదర్శి సర్వర్ నాయక్ , నరసింహ, గోపాలమిత్రలు సుధాకర్ ,శ్రీకాంత్, గోపి, గ్రామ రైతులు, పశుపోషకులు పాలుగోన్నారు .



వెంకన్నకు పరామర్శ

ఆలేరు నవంబర్ 4 (ప్రజా జ్యోతి):
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శర్బనాపురం గ్రామానికి చెందిన పిఎసిఎస్ మాజీ చైర్మన్ మొగలగాని మల్లేష్ సోదరుడు వెంకన్న పంజాగుట్ట లోని నిమ్స్ ఆసుపత్రిలో బ్రెయిన్ సంబంధిత చికిత్స పొందుతున్న విషయం ఆలేరు మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి తెలుసుకొని బుధవారం వారిని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను సూచించారు. వారి వెంబడి కుటుంబ సభ్యులు ఉన్నారు



ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు

నకిరేకల్‌లో నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం

నల్లగొండ నవంబర్ 4 (ప్రజా జ్యోతి ప్రతినిధి):
ఎల్ నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తలెత్తే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు



చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై నకిరేకల్ పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నియోజక వర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ప్రజలకు, ముఖ్యంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, వ్యవసాయ రంగానికి అండగా నిలిచేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ విప్ వేముల వీరేశం మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధమవుతోందని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎల్ నినో పరిస్థితులకు ముఖ్యమంత్రే కారణమన్నట్లుగా ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సరికాదని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. కృష్ణా జలాల ద్వారా తాగునీటి అవసరాల నిమిత్తం కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి మండలాల్లోని చెరువులను నింపేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. కరోనా సంక్షోభానికి గత ప్రభుత్వం కారణం కానట్లే, ప్రస్తుత కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వం కారణం కాదని





వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే ప్రణాళికను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జీ రామ్ జీ పథకాన్ని సర్పంచులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎల్ నినో ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ సంక్లిష్ట పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొన్నప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షల బోరు పంపులు ఉండగా, ప్రస్తుతం తెలంగాణలో వాటి సంఖ్య 37 లక్షలకు పెరిగిందని తెలిపారు. దీంతో విద్యుత్ వినియోగం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ఎండల తీవ్రత పెరిగే కొద్దీ విద్యుత్ అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. పరిమిత నీటితో ఏ పంట సాగు చేస్తే ఎక్కువ ప్రయోజనం ఉంటుందో ఆలోచించి సాగు చేపట్టాలని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఎన్. ప్రేమ్ కరణ్ రెడ్డి, శ్రీనివాస్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీకాంత్, డీఆర్‌డీఓ వై. శేఖర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం అందించాలలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

భువనగిరి,నవంబర్ 4(ప్రజాజ్యోతి):
బుధవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని మైనారిటీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్,అనురాగ్ జయంతి సందర్శించి,పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యా బోధన,వసతి సౌకర్యాలు, భోజన నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలలో ప్రస్తుతం ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు, ఎంత మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారని , ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా హాజరవుతున్నారా అనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. మీకు ఇష్టమైన సబ్జెక్టులు ఏవి? భవిష్యత్తులో ఏం చదవాలను కుంటున్నారని ?పాఠశాలలో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయా?ఏమైనా సమస్యలు ఉన్నాయా?అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తమ లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు.అనంతరం పాఠశాలలోని వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. ఈ రోజు విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలించి, ఆహార నాణ్యత, రుచిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన, రుచికరమైన,



పౌష్టికాహారం అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్య, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, పాఠశాల సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమం లో జిల్లా రెవిన్యూ, మైనారిటీ అధికారి జయమ్మ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కోదాడలో టి ఎస్ డబ్ల్యూ సి గోదాంపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

అవకతవకలకు ఆస్కారం లేదు: జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్

కోదాడ టౌన్, నవంబర్ 04 (ప్రజా జ్యోతి):
కోదాడ పట్టణంలోని టీఎస్ డబ్ల్యూ సి గోదాంలో జిల్లా కలెక్టర్



తేజస్ నందాలాల్ పవర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ నరసింహ, సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారులు, తహశీల్దార్, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు. వరి ధాన్యం కొనుగోలు సీజన్ నేపథ్యంలో రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా ఉండేందుకు కలెక్టర్ ఈ తనిఖీ చేపట్టారు. గోదాంలోకి వచ్చిన ధాన్యం, బయటకు వెళ్లిన ధాన్యం, ప్రస్తుత నిల్వకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, లారీల రాకపోకల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... "రైతు పండించిన ప్రతి గింజకు లెక్క ఉండాలి. ధాన్యం నిలువలో, తూకంలో ఏ మాత్రం అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదు. బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం. గోదాం నిర్వహణలో పారదర్శకత తప్పనిసరి" అని అధికారులను హెచ్చరించారు. గోదాంలో ధాన్యం తేమ శాతం, గోనె సంచుల నిల్వ, భద్రతా ఏర్పాట్ల గురించి కూడా ఆరా తీశారు. వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మురుగు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంట నేపథ్యంలో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. తనిఖీ అనంతరం గోదాంలో పనిచేస్తున్న కార్మికుల వద్దకు స్వయంగా వెళ్లిన కలెక్టర్ వారిని ఆప్యాయంగా పలకరించారు. వారి వేతనాలు, పని గంటలు, భద్రత, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. చాలా మంది కార్మికులకు లేబర్ కార్డులు లేవని తెలియడంతో వెంటనే స్పందించిన కలెక్టర్, "అర్హులైన ప్రతి కార్మికుడికి తక్షణం లేబర్ కార్డు అందించాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందేలా చూడాలి" అని లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీతో గోదాం సిబ్బందిలో కలకలం రేగింది. ఈ తనిఖీ పట్ల రైతులు, కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.. భవిష్యత్తుకు భరోసా!

ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

నీటి వృథాను అరికట్టి భూగర్భ జలాలను పెంపొందించాలి: మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి

హాలియా,నవంబర్4(ప్రజా జ్యోతి):
ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో భవిష్యత్తులో తలెత్తే నీటి ఎద్దడి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే నీటి వనరుల



సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని హాలియా మున్సిపల్ కమిషనర్ కే.రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం హాలియాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతి ఇంటి ఆవరణలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు (రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ రీచార్జ్ పిట్స్) నిర్మించుకోవాలని సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవడం ద్వారా భూగర్భ జలమట్టాలను పెంచుకోవచ్చని తెలిపారు.ముఖ్యంగా నీటి పైపులైన్లు,ఇంటి నల్లాల వద్ద ఏర్పడే లీకేజీలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, తద్వారా విలువైన తాగునీరు వృథా కాకుండా అరికట్టవచ్చని పేర్కొన్నారు.నీటి సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు. వర్షపు నీటిని సంరక్షించడం, నీటి వృథాను నివారించడం, వినియోగించిన నీటిని సాధ్యమైనంతవరకు పునర్వినియోగించుకోవడం వంటి పద్ధతులను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో అలవర్చుకోవాలని సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ, స్థిరమైన నీటి నిర్వహణ విధానాలను పాటించినప్పుడే భవిష్యత్తు తరాలకు నీటి కొరత లేకుండా చూడగలమని వివరించారు.ప్రస్తుతం నుంచే నీటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతి ఇంటి నుంచి నీటి



పొదుపు కార్యక్రమం ప్రారంభం కావాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములై సమిష్టిగా కృషి చేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ కుందూరు వెంకట్ రెడ్డి,వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు,వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వెరుశనగ సాగుతో రైతులకు మేలు

వరి సాగుకు స్వస్తి పలకాలి ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

కొండమల్లేపల్లి, నవంబర్ 04(ప్రజాజ్యోతి):
మండలంలో ఎఫ్‌పీఓ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ



అధికారి జానకిరాములు ముఖ్య అతిథిగా హాజరై రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల మార్పిడికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగుకు బదులుగా వేరుశనగ వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని, వరి సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని రైతులకు సూచించారు.వేరుశనగ సాగులో నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడంతో పాటు విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యం, చీడపీడల నివారణకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. ఎఫ్‌పీఓ సంస్థ ద్వారా విత్తనాల పంపిణీ చేపట్టడం రైతులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ తులసి, ఎఫ్‌పీఓ ప్రతినిధులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ క్రాంతి కుమార్

తుంగతుర్తి, నవంబర్ 4,(ప్రజా జ్యోతి):
సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ క్రాంతి కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సైబర్ నేరాల పట్ల పోలీస్



ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, అపరిచితులకు బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటీఎం, ఆధార్, పాన్‌కార్డు ఇతర వివరాలు తెలపవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఏ వెంకటయ్య, పోలీస్ సిబ్బంది రాంబాబు, జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసుల కొరడా.. ఇద్దరికి జైలు శిక్ష

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు: ఎస్సై ఏడుకొండలు

అనంతగిరి, నవంబర్ 4 (ప్రజాజ్యోతి):
మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో అనంతగిరి మండల పరిధిలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని బుధవారం కోదాడ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా, కేసును విచారించిన మెజిస్ట్రేట్ ఇద్దరికీ ఒక్కొక్క రోజు జైలు శిక్ష విధించారు. దీంతో వారిని తదుపరి చర్యల్లో భాగంగా హుజూర్‌నగర్ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా అనంతగిరి ఎస్సై ఏడుకొండలు మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహన



దారులతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా మండల పరిధిలో నిరంతరం వాహన తనిఖీలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా ప్రయాణించాలని ఎస్సై సూచించారు.

బీజేపీ నాయకుడి దంపతులపై దాడి

★ చర్యలు తీసుకోవాలని ఏసీపీకి ఫిర్యాదు







కమ్మర్‌పల్లి (ప్రజాజ్యోతి) నవంబర్ 4: ఇనాయత్ నగర్ గ్రామానికి చెందిన బీజేపీ కమ్మర్ పల్లి మండల ఉపాధ్యక్షుడు రవి, ఆయన భార్యపై వారం రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దాడికి పాల్పడినట్లు బీజేపీ నాయకులు బుధవారం ఒక ప్రకటన లో ఆరోపించారు. ఈ ఘటనలో రవి కాలు, చేయి విరగడంతో పాటు తలకు గాయాలయ్యాయని, ఆయన భార్య చేతులు కూడా విరిగాయని తెలిపారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి బాధిత దంపతులను పరామర్శించారు. అనంతరం ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి కి కలిసి దాడికి పాల్పడిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, బాధితులకు న్యాయం చేయాలని కోరినట్లు చెప్పారు. బీజేపీ కార్యకర్తలపై దాడులు పునరావృతం కాకుండా చూడాలని, కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మర్ పల్లి మండల అధ్యక్షుడు బద్దం రమేష్ రెడ్డి, మోర్తాడ్ మండల అధ్యక్షుడు శివానంద్ రెడ్డి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, చింత ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావంతో పంట మార్పిడిపై రైతులకు అవగాహన



కమ్మర్‌పల్లి (ప్రజాజ్యోతి) నవంబర్ 04: ఎల్ నినో ప్రభావంతో యాసంగి పంటల సాగులో పంట మార్పిడి చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి రమ్యశ్రీ రైతులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉప్పూరు గ్రామ పంచాయతీలో బుధవారం రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉందని, దీనివల్ల సాగునీరు, తాగునీటిపై తీవ్ర ప్రభావం పడుతుందని వాతావరణ శాఖ పెచ్చరించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి పంటకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేసుకునే పంటలను ఎంచుకోవాలని కోరారు. యాసంగిలో పెసర, మినుము, శనగ, జొన్న, సజ్జ వంటి పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో గ్రామ ఉపసర్పంచ్ శేఖర్, గ్రామ కార్యదర్శి సౌందర్య, రైతులు బోనగిరి భాస్కర్, బద్దం రమేష్, నరేష్, రాకేష్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును సందర్శించిన కలెక్టర్

★ బయో మైనింగ్‌ను వేగవంతం చేయాలని ఆదేశం ★ రోడ్లపై పశువులను వదిలితే.. కేసులు పెట్టండి





నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 4 (ప్రజాజ్యోతి) : ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. నాగారం శివారులోని డంపింగ్ యార్డును కలెక్టర్ బుధవారం సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారీగా ఇంటింటికి తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎరువును ఎవరికి అందజేస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. ప్రతి రోజు సగటున 600 మెట్రిక్ టన్నుల చెత్తను బయో మైనింగ్ జరుపుతుండగా, దానిని వెయ్యి మెట్రిక్ టన్నులకు పెంచాలని కలెక్టర్ సూచించారు. డంపింగ్ యార్డు ప్రాంతంలో ఖాళీ స్థలాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పచ్చదనం పెంపొందించాలని అన్నారు. డంపింగ్ యార్డు ప్రాంతం అంతా కవర్ అయ్యేలా సోలార్ ప్యానెల్స్ తో పని చేసే సీ.సీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, వ్యర్థాల శుద్ధి ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. డంపింగ్ యార్డు ప్రదేశంలోని రోడ్డుకు ఆనుకుని ఇరువైపులా వ్యర్థాలను పోగు చేయకుండా దూరంగా తరలించాలని అన్నారు.

రోడ్లపై పశువులను వదిలితే కేసులు నమోదు చేయండి

రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పశువులు సంచరించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. డంపింగ్ యార్డు ప్రాంతంతో పాటు నగరంలోని ప్రధాన రహదారులపై ఆవులు, ఇతర పశువులు ఎక్కడబడితే అక్కడ సంచరిస్తుండడం గమనించిన కలెక్టర్ అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. రోడ్లపై పశువుల సంచారం వల్ల వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పశువులు రోడ్లపై సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్లపై పశువులను వదిలితే కేసులు నమోదు చేయాలని, జరిమానాలు విధించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందించిన 8వార్డు కౌన్సిలర్

★ ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్న సిద్ధి శ్రీధర్



ఎల్లారెడ్డి, నవంబర్ -4(ప్రజా జ్యోతి) పట్టణంలోని 8వ వార్డులో మృతి చెందిన కంట్రపల్లి కిషన్ కుటుంబానికి అంత్యక్రియల కోసం రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని వార్డ్ కౌన్సిలర్ సిద్ధి శ్రీధర్ గుప్తా అందజేశారు.అనారోగ్యంతో కంట్రపల్లి కిషన్ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శ్రీధర్ గుప్తా మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.8వ వార్డు నుండి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన శ్రీధర్ గుప్తా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. ఇప్పటికే ఆడబిడ్డ జన్మిస్తే రూ.11 వేలు, ఆడబిడ్డ వివాహానికి రూ.10 వేలు అందజేస్తూ హామీలను నెరవేర్చారు. వార్డు ప్రజల కోసం బాడీ ఫ్రీజర్ బాక్స్ ఇచ్చారు. వార్డులో రెండు బోర్లు తవ్వించి విద్యుత్ మోటార్లు సమకూర్చారు.ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియల కోసం పదివేల రూపాయలు ఇస్తానని ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని తాజాగా నిలబెట్టుకున్నారు. ఎన్నికల్లో హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత మొండిచేయి చూపే నాయకులకు భిన్నంగా, ఇచ్చిన మాటకు కట్టుబడి సేవ చేస్తున్నారని స్థానికులు ప్రశంసిస్తున్నారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కూడా అయిన సిద్ధి శ్రీధర్ గుప్తా ఏ పార్టీతో సంబంధం లేకుండా స్వతంత్రంగా పోటీ చేసి భారీ మెజారిటీతో గెలిచి, 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని వార్డు ప్రజలు తెలిపారు.

కలెక్టర్ చేతుల మీదుగా

గోడ గడియారాలు అందజేత



ప్రజా జ్యోతి,లింగంపేట్ నంబర్ 4 లింగ పేట మండలంలోని లింగంపల్లి కుర్దు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు కలెక్టర్ ఆశిష్ సాగ్వాన్ గోడగడియారం అందజేశారు, గ్రామంలో పర్యటించిన కలెక్టర్ పలు అభివృద్ధి పనులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొల్ల సాయిరాం యాదవ్ మరియు అదనపు కలెక్టర్ గిరి, మండల అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ వుషూ ఛాంపియన్‌షిప్‌లో జహీరాబాద్ విద్యార్థుల సత్తా!

★ తెలంగాణ జట్టు తరఫున జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన శ్లోక్ సాగర్, ఉమా మహేశ్వరి



జహీరాబాద్, నవంబర్ 04 (ప్రజా జ్యోతి న్యూస్) జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో జహీరాబాద్ పట్టణానికి చెందిన విద్యార్థులు తమ ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు తెచ్చు కున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో నిర్వహించిన 25వ జూనియర్ జాతీయ వుషూ ఛాంపియన్‌షిప్--2026లో జహీరాబాద్‌కు చెందిన వజ్ర వీర మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు శ్లోక్ సాగర్, ఉమా మహేశ్వరి తెలంగాణ రాష్ట్ర జట్టు తరఫున పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ పోటీల్లో శ్లోక్ సాగర్ 6.98 పాయింట్లు, ఉమామహేశ్వరి 6.86 పాయింట్లు సాధించి ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయి వేదికపై తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడం ద్వారా జహీరాబాద్ పట్టణానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. చిన్న వయసులోనే క్రీడలపై ఆసక్తి పెంచుకుని, నిరంతర సాధనతో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వజ్ర వీర మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్లు శంకర్ సాగర్, సిద్ధా రెడ్డి మరియు కోచ్ సంధ్య చౌహాన్ క్రీడా కారులను అభినందించారు. భవిష్యత్తులో మరింత పట్టుదలతో సాధన చేసి ఉన్నత స్థాయి పోటీల్లో విజయాలు సాధించాలని, జహీరాబాద్ పట్టణంతో పాటు సంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభ పట్ల వారి తల్లిదండ్రులు, అకాడమీ నిర్వాహకులు, శిక్షకులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ..!

★ పేద చిన్నారులకు మరిన్ని సేవా కార్యక్రమాలు



జహీరాబాద్, నవంబర్ 04(ప్రజా జ్యోతి న్యూస్) ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని సామాజికవేత్త, ఇండస్ యూనివర్సల్ పాఠశాల వ్యవస్థాపకులు ఆర్. లింగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం చిలేపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 20 మంది విద్యార్థులకు పాఠశాల తరఫున క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఒక్కో విద్యార్థికి బుధవారం, శనివారం ధరించేందుకు రెండు జతల దుస్తులను అందజేశారు. భవిష్యత్తు లోనూ పేద విద్యార్థులకు అండగా నిలుస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని లింగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లారెడ్డి, ప్రధా నోపా ధ్యాయుడు సంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆఫీస్ పాటిల్, నాయకులు కే. మైపాల్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, కే. భూపతి రెడ్డి, కుత్బుద్దీన్, ఆరిఫ్, సద్దాం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కరువు ప్రభావిత రైతుల పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు చర్యలు చేపట్టాలి

★ ఖరీఫ్--2026 కరువు సహాయక చర్యలపై ప్రత్యేక డీసీసీ సమావేశం





సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి. : జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాలను పునరుద్ధరించి, రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు అర్హులైన రైతుల పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్ బ్యాంకు అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖరీఫ్--2026 కరువు సహాయక చర్యల్లో భాగంగా ప్రత్యేక డీసీసీ/డీఎల్ఆర్ఎల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కరువు ప్రభావిత మండలాల్లో అర్హులైన రైతుల వ్యవసాయ పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్, ఆర్‌బీఐ ఎల్‌డీఓ వి. ప్రదీప్ చంద్ర, నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ, వ్యవసాయ శాఖ అదనపు డీఏ బి. శ్రీదేవి, వివిధ బ్యాంకుల అధికారులు హాజరయ్యారు. కరువు ప్రభావిత మండలాల్లోని అర్హులైన రైతుల పంట రుణాలను నిబంధనల ప్రకారం పునర్వ్యవస్థీకరించడం, రుణాల తిరిగి చెల్లింపు గడువును పొడిగించడం,తాత్కాలిక వాయిదా సదుపాయం) కల్పించే అంశాల పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏఓ విజయలక్ష్మి మాట్లాడుతూ భారతీయ రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాలు, సంబంధిత బ్యాంకుల పాలక మండళ్లు ఆమోదించిన విధానాలకు అనుగుణంగా అర్హులైన రైతులకు సహాయక చర్యలు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు అవసరమైన రైతుల వివరాలను సక్రమంగా సేకరించి, భద్రపరిచి, నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్ మాట్లాడుతూ , ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2026 వరకు రెండు త్రైమాసికాల్లో జిల్లాలోని బ్యాంకులు మొత్తం 1,20,065 ఖాతాల ద్వారా రూ.2,520.18 కోట్ల పంట రుణాలను రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని మొత్తం 28 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించగా, వాటిలో 2 మండలాలు తీవ్ర కరువు ప్రభావిత మండలాలుగా, 26 మండలాలు మోస్తరు కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించినట్లు వివరించారు. పంట రుణాల పునర్వ్యవస్థీకరణ మాత్రమే ఈ ప్రక్రియలో భాగమని, దీనిని రుణమాఫీ పథకంగా భావించరాదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ ఎల్‌డీఓ వి. ప్రదీప్ చంద్ర, నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ, వ్యవసాయ శాఖ అదనపు డీఏ బి. శ్రీదేవి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడారంగంలో గ్రామీణ విద్యార్థుల సత్తా..

★ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన ప్రణయ్, మానసలకు ఘన సన్మానం

★ ఉత్తమ ప్రతిభ కనబరిస్తే ఇద్దరికీ తలా రూ.10 వేల ప్రోత్సాహక బహుమతి ప్రకటించిన సర్పంచ్ సాయి కిరణ్



అందోలు, నవంబర్ 04, (ప్రజాజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోనూ క్రీడా ప్రతిభకు కొదవ లేదని నిరూపిస్తూ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన నేరడిగుంట గ్రామ విద్యార్థులు ప్రణయ్, మనసలకు గ్రామంలో ఘన సన్మానం నిర్వహించారు. కబడ్డీ క్రీడలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఒగ్గు సాయి కిరణ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది విద్యార్థుల్లో అపారమైన క్రీడా ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం, శిక్షణ, అవకాశాలు లభిస్తే వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలరని పేర్కొన్నారు. చదువుతోపాటు క్రీడలకు కూడా విద్యార్థులు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం సాధారణ విషయం కాదని, విద్యార్థుల కృషి, పట్టుదలకు ఇది నిదర్శనమని కొనియాడారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రణయ్, మనసలు తమ ప్రతిభను చాటుకుని విజయం సాధించాలని, తద్వారా నేరడిగుంట గ్రామానికి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే ఇద్దరు క్రీడాకారులకు తలా రూ.10 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతి అందజేస్తానని సర్పంచ్ సాయి ప్రకటించారు. గ్రామంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, యువతను గుర్తించి ప్రోత్సహించడంతోపాటు వారి ఉన్నతికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని సర్పంచ్ భరోసా ఇచ్చారు. గ్రామీణ విద్యార్థుల క్రీడా ప్రతిభను గుర్తించి ఈ విధంగా సన్మానించడంతోపాటు ప్రోత్సాహక బహుమతులు ప్రకటించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ఇతర విద్యార్థులకు సైతం క్రీడల పట్ల ఆసక్తి పెంచి, మరింత ఉత్సాహంతో ముందుకు సాగేందుకు స్ఫూర్తినిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈశ్వర్, వార్డు సభ్యుడు బోయిని శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కౌడిపల్లి నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన నీరేష్

★ జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్ఐ



నవంబర్ 4 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి : కౌడిపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా నూతన బాధ్యతలు స్వీకరించిన నీరేష్ బుధవారం మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ను జిల్లా పోలీస్ కార్యాల యంలోమర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి మొక్కను అందజేశారు. కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌లో గతంలో ఎస్ఐగా విధులు నిర్వహించిన అమర్ జిల్లా పోలీస్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకొని, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత నమ్మకం పెంపొందించేలా అంకితభావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్ఐ నీరేష్‌కు సూచించారు.

పైతర గ్రామంలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమం

★ భూసుపోషణ, భూసంరక్షణపై రైతులకు అవగాహన





కొల్చారం, నవంబర్04(ప్రజా జ్యోతి) కొల్చారం మండలంలోని పైతర గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూసుపోషణ, భూసంరక్షణ, పంటల సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటలైన జొన్న, మొక్కజొన్న, కుసుమ, పొద్దుతిరుగుడు, అపరాలు వంటి పంటలను సాగు చేయాలని వ్యవసాయ అధికారులు సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూమి సారాన్ని కాపాడుకోవాలని తెలిపారు. సమగ్ర పోషక యాజమాన్య పద్ధతుల్లో భాగంగా పచ్చిరొట్ట పంటలు, జీవ ఎరువులు, సూక్ష్మ పోషకాలను వినియోగిస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వివరించారు. అలాగే మట్టి నమూనాల సేకరణ, పరీక్షల విధానం, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేశారు. మట్టి పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలకు అవసరమైన పోషకాలను అందిస్తూ సమర్థవంతమైన పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొల్చారం మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి, తునికి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రవి, గ్రామ ఉపసర్పంచ్ ఆరట్ల సుధాకర్, వ్యవసాయ విస్తరణ అధికారి అమృత్, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణానికి ముప్పుగా మారుతున్న చెట్ల నరికివేత

★ పాలకుల అత్యుత్సాహం, ★ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు శాపంగా మారనుంది





ములుగు,నవంబర్4(ప్రజాజ్యోతి) ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డుకిరువైపులా ఏపుగా పెరిగిన చెట్లను నరికి వేయడం పర్యావరణానికి, మానవ మనుగడకు అత్యంత ప్రమాదకరమైన సమస్యను ఎదుర్కొనే ప్రమాదం ఉంది.ఈ మధ్యకాలంలో రాజీవ్ రహదారిపై ఉన్న హవేలీ ఫామ్ సమీపంలో పెట్రోల్ పంపు నిర్మాణం చేపట్టి అడ్డంగా ఉన్నాయని చెట్లను నరికి వేయగా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది,గతంలో హరితహారం కింద నాటిన మొక్కలను పశువులు కానీ మేకలు కానీ మేస్తేనే అక్కడక్కడ జరిమానా విధించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి,విద్యుత్ తీగలకు,సరఫరాకు అడ్డుగా వస్తున్నాయని విద్యుత్ శాఖ అధికారులు కొమ్మలు నరికి వేయకుండా పెద్ద పెద్ద కొమ్మలను నరికి వేస్తూ మోడుగా మిగులుస్తున్నారు.అంతేకాకుండా దుకాణాలకు అడ్డుగా వస్తున్నాయని సాకులు చెబుతూ రాజీవ్ రహదారి వెంబడి ఉన్న గ్రామాలలో అనుమతులు లేకుండానే పచ్చని చెట్లను నరికి వేస్తున్నారు.చిన్న మొక్కలు మేకలు మేస్తేనే జరిమానా విధించిన అధికారులు అలాంటిది మొక్కలు వృక్షాలుగా ఎదిగి నీడనిస్తుంటే వాటిని కూకటి వేళ్లతో తీసివేసిన వారిపై చర్యలు తీసుకోవడం లేదంటే హరితహారానికి వారు ఇచ్చే ప్రాధాన్యత ఎంతో అర్థమవుతుంది.హరితహారం పేరుతో గత బిఆర్ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఉద్యమంలా మొక్కలు నాటి హరిత తెలంగాణకు ఊపిరి పోశారు,కానీ పాలకులు రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటాలన్న సంతోషంతో పైన ఉన్న విద్యుత్తు తీగలు ఉన్నాయని మరిచారో,లేక ఇన్ని వేల మొక్కలు నాటామన్న లెక్కల కోసమో విద్యుత్ తీగలను లెక్కచేయకుండా తీగల కిందనే మొక్కలు నాటగా అవి నేడు వృక్షాలుగా మారి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయని సంబంధిత అధికారులు కొమ్మలు నరికి వేయకుండా వృక్షాలనే కొట్టి వేస్తున్నారని, చెట్ల నరికివేతతో ప్రజలకు, పర్యావరణానికి, వాతావరణ కాలుష్యానికి తీవ్ర ముప్పుగా మారనుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారంతో భూములను కొన్న యజమానులు చదును చేయాలన్న ఉద్దేశంతో చెట్లను నరికి వేయడంతో వృక్ష సంపద పూర్తిగా దెబ్బతినగా,ఇప్పటివరకు దీనిపై స్పందించిన అధికారులే కరువయ్యారని, ఇలాగే వృక్షాలను నరుకుతూ పోతూ ఉంటే రానున్న కాలంలో పర్యావరణం ప్రమాదంలో పడనుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు కళ్ళు తెరిచి చెట్లు నరికే వారిపై కఠిన నిబంధనలు అమలు చేస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.వృక్ష సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తుంచుకోవాలంటున్నారు.

శాంతిభద్రతల కోసం ఖాకీల వేట.. తూప్రాన్‌లో భారీ కార్డన్ సెర్చ్

★ 105 మంది సిబ్బందితో కాలనీలో పోలీసుల క్షేత్రస్థాయి పరిశీలన

★ 450కి పైగా నివాసాల తనిఖీ.. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 64 వాహనాల స్వాధీనం

★ సీసీఎస్, షీ టీమ్స్, డాగ్ స్క్వాడ్ భాగస్వామ్యంతో ప్రత్యేక నిఘా

★ మెదక్ జిల్లా అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్,









తూప్రాన్, నవంబర్ 04 (ప్రజాజ్యోతి): నేరగాళ్ల గుండెల్లో గుబులు పుట్టించేలా, అసాంఘిక శక్తుల కదలికలకు చెక్ పెట్టేలా మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో పోలీసులు భారీ స్థాయిలో మెరుపు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు భద్రతపై భరోసా కల్పించడమే లక్ష్యంగా పట్టణంలోని 2బీహెచ్‌కే కాలనీలో బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు.ఈ భారీ ఆపరేషన్‌లో సుమారు 105 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని 450కు పైగా ఇళ్లను జల్లెడ పట్టారు. ఇంటింటికీ వెళ్లి నివాసితుల వివరాలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, వాహనాల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 61 ద్విచక్ర వాహనాలు, 3 త్రిచక్ర వాహనాలు కలిపి మొత్తం 64 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

డాగ్ స్క్వాడ్‌తో డ్రగ్స్‌పై నిఘా.. ఫింగర్‌ప్రింట్లతో నేరస్థుల గుట్టురట్టు

తనిఖీల్లో ప్రత్యేకంగా నార్కోటిక్ డాగ్ 'జూబి'ని రంగంలోకి దించి ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల ఉనికిపై క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. మరోవైపు ఆధునిక ఫింగర్‌ప్రింట్ డివైజ్‌ల సహాయంతో వ్యక్తుల వేలిముద్రలను పరిశీలించి, గతంలో నేరాలకు పాల్పడిన పాత నేరస్థుల వివరాలను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. సీసీఎస్, షీ టీమ్స్, డాగ్ స్క్వాడ్ బృందాల భాగస్వామ్యంతో తనిఖీలను మరింత పకడ్బందీగా నిర్వహించారు.

ప్రజల భద్రతే మా ప్రథమ కర్తవ్యం: అదనపు ఎస్పీ

ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, తూప్రాన్ పట్టణంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు నివసిస్తున్న నేపథ్యంలో వారి భద్రతకు విఘాతం కలిగించే వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి కట్టడి చేయడమే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.పోలీసుల తనిఖీలు సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడానికి కాదని, వారి ప్రాణ, ఆస్తుల రక్షణతో పాటు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడానికేనని స్పష్టం చేశారు. కాలనీల్లో నివసించే వారి వివరాలను పరిశీలిస్తూ అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగిస్తామని వెల్లడించారు.ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలు కనిపిస్తే తక్షణమే సమాచారం అందించాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతో నేరరహిత సమాజ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, ఇన్‌స్పెక్టర్ వెంకటరాజ్ గౌడ్, నర్సాపూర్ సీఐ రంగకృష్ణ, పలువురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు..

ఏల్ నీనో ఎఫెక్ట్ నేపథ్యంలో తాగునీటికి ముందస్తు కార్యాచరణ: కలెక్టర్

★ డిసెంబర్ తర్వాత సింగూరు ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా నిలిచిపోయే అవకాశం

★ ప్రతి నీటి బొట్టు ను ఒడిసి పట్టాలి

★ నీటి నిల్వలు, నీటి వనరుల లభ్యతను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు పర్యవేక్షించాలి

★ హవేలీ ఘన్పూర్ మండలం సర్ధన గ్రామంలో చెక్ డ్యాం పరిశీలన

★ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్







నవంబర్ 4 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి : ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు ఉండటంతో మెదక్ జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలకు సిద్ధమవుతోంది. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.ఈ నేపథ్యంలో హవేళి ఘన్‌పూర్ మండలం సర్ధన గ్రామంలోని చెక్‌డ్యామ్‌ను మిషన్ భగీరథ గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగభూషణం, తాసిల్దార్ సింధు రేణుక , గ్రామ సర్పంచ్ వినోద,ఎలక్ట్రిసిటీ డి .ఈ రామేశ్వర స్వామి, మిషన్ భగీరథ ఈ.ఈ సంపత్ కుమార్,ఇంట్రా డి ఈ నరేష్ గ్రామస్తులతో కలిసి ఆమె బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మిషన్ భగీరథ గ్రిడ్ సిబ్బంది ప్రత్యామ్నాయ నీటి సరఫరాకై ఏర్పాటుచేసిన మ్యాప్ పరిశీలిస్తూ పలు కీలక సూచనలు చేశారు డిసెంబర్ తర్వాత సింగూరు ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా నిలిచిపోయే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమస్యను ముందుగానే అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెదక్ జిల్లాకు రూ.42 కోట్ల నిధులు మంజూరు చేసిందని కలెక్టర్ వెల్లడించారు.ఈ సందర్భంగా సర్ధన చెక్‌డ్యామ్ వద్ద ప్రత్యేక గ్రిడ్ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి సుమారు 3.5 కిలోమీటర్ల మేర జక్కన్నపేట గ్రామం వరకు పైప్‌లైన్ కనెక్షన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా 33 గ్రామాలకు ప్రతిరోజూ ఒక్కొక్కరికి 55 లీటర్ల చొప్పున తాగునీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు.అంతేకాకుండా సర్ధన డ్యామ్‌తో పాటు పొద్చాన్‌పల్లి, కొత్తపల్లి, మిన్‌పూర్ చెక్‌డ్యామ్‌ల వద్ద కూడా గ్రిడ్ వ్యవస్థలు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ నీటి వనరులను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.ఏల్ నీనో ఎఫెక్ట్ ఉన్న నేపథ్యంలో నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ సూచించారు.గ్రామాలలో నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ నల్లాలను డమ్మీ చేయాలని, దీని వల్ల నేటి వృధాను అరికట్టాలనిసూచించారు. సంబంధిత సర్పంచులు గ్రామాలలో గ్రామసభలలో తీర్మానించుకొని సింగిల్, త్రీఫేస్ మోటార్లు నిర్దిష్ట సమయంలోనే ఆన్ చేసి నీటి విడుదల చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మిగతా సమయాలలో మోటార్ ఆఫ్ చేసి పెట్టుకోవాలన్నారు ఇందువల్ల బోర్లలో భూగర్భ జలాలు సమృద్ధిగా పెరుగుతాయన్నారు. అంతేకాకుండా విద్యుత్ పొదుపుఅవుతుందన్నారు. గ్రామాలలో ఉన్న త్రీఫేస్ మోటార్ నుండి నీటిని . ఓ.హెచ్ . ఆర్ ట్యాంక్ కి వినియోగించుకోవాలని త్రీఫేస్, సింగల్ ఫేస్ కరెంటు మరమ్మత్తులు గ్రామాలలో బోర్లు ఫ్లషింగ్ , డిపెన్ నింగ్ , హై రింగ్ సంబంధిత విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి లభ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా పరిస్థితులను నిరంతరం అంచనా వేస్తూ, దీర్ఘకాలిక సమస్యలు ఉన్న ఆవాసాల్లో సరఫరా అంతరాయాలను ముందుగానే గుర్తించాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రాబోయే రోజుల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారుఎల్‌నినోప్రభావాన్నిఎదుర్కొనేందుకు మెదక్ జిల్లాలో చేపడుతున్న చర్యలు కేవలం తాత్కాలిక నీటి కొరతను అధిగమించేందుకు మాత్రమే కాకుండా భవిష్యత్తు తరాలకు నీటి వనరులను అందుబాటులో ఉంచేందుకుఉపయోగపడనున్నాయి. అని వివరించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

అధికారుల నిర్లక్ష్యం... రోడ్డు పాలవుతున్న తాగునీరు



చిన్నకోడూరు,నవంబర్4,(ప్రజాజ్యోతి):- ఓ వైపు రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు నీటిని ఎంతో పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు నిరంతరం సూచిస్తుంటే మరోవైపు అధికారుల నిర్లక్ష్యం కారణంగా విలువైన తాగునీరు వృథాగా రోడ్ల పాలవుతోంది. మండల పరిధి మెట్టబండల నుండి చంద్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో తాగునీటి పైపులైన్లు పలుమార్లు పగిలిపోతుండటంతో ప్రజల దాహం తీర్చాల్సిన శుద్ధమైన తాగునీరు వృథాగా పోతుంది.పైపులు పగిలిన ప్రతిసారి సంబంధిత అధికారులు కేవలం నామమాత్రపు మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు తప్పితే శాశ్వత పరిష్కారం చూపటం లేదంటూ విమర్శలు ఇప్పటికే ఉన్నాయి.తాత్కాలిక పనుల కారణంగా కొద్ది రోజులకే మళ్లీ పైపులు పగిలి నీరు వృథా అవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, నాసిరకం పనులకు స్వస్తి పలికి, మన్నికైన పైపులైన్ల నిర్మాణాలతో మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మిషన్ భగీరథ పనితీరును పరిశీలించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్









కొండపాక నవంబర్ 4 (ప్రజా జ్యోతి):-, నవంబర్ 4: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, గ్రామీణ పారిశుధ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఐఏఎస్ బుధవారం సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం మంగోలు గ్రామ శివారులోని మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లోని ఫిల్టర్ హౌస్, ల్యాబ్, 75 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన క్లియర్ వాటర్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. ముందుగా జిల్లా కలెక్టర్ కె. హైమావతి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.అనంతరం మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా వివిధ గ్రామాలకు జరుగుతున్న తాగునీటి సరఫరా, నీటి నిల్వ సామర్థ్యం, పంపింగ్ వ్యవస్థ, పైపులైన్ల పనితీరు, గ్రిడ్ నిర్వహణ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రతిరోజూ సరిపడా, నాణ్యమైన శుద్ధమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మిషన్ భగీరథ నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.అంతకుముందు కుకునూరుపల్లి మండలం తిప్పారం గ్రామంలోని మల్లన్నసాగర్ తిప్పారం రా వాటర్ పంప్‌హౌస్‌ను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి, సీఈ రామచంద్ర, ఎస్ఈలు వెంకట్ రెడ్డి, రాజయ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిలిప్చెడ్ మండలంలో పలు అభివృద్ధి భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



నవంబర్ 4 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి : బుధవారం చిలిప్చెడ్ మండల కేంద్రంలో మహిళా భవనంతో పాటు,మండల మానవ వనరుల కేంద్రం (ఎం ఆర్ సి),సైన్స్ ల్యాబ్,భవిత కేంద్రం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. విద్యా, మహిళా సంక్షేమం విద్యార్థుల అభ్యున్నతికి ఈ కేంద్రాలుఉపయోగపడనున్నాయని ఏం ఎల్ ఏ సూచించారు.

ఆమనగల్ మార్కెట్ యార్డులో పందుల బెడద.. రైతులకు తప్పని నష్టం!

మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన కరువు



ఆమనగల్లు, నవంబర్ 4 ప్రజాజ్యోతి : రైతులు కష్టపడి పండించిన పంటలను విక్రయించేందుకు తీసుకొస్తున్న ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పందుల బెడద తీవ్ర సమస్యగా మారింది. మార్కెట్‌కు ప్రతి సంవత్సరం రైతులు తీసుకొచ్చే మొక్కజొన్న, వడ్లు తదితర ధాన్యాలను సేకరించి గోదాములకు తరలించే క్రమంలో పందుల సంచారం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్ యార్డులో పందుల సంచారాన్ని అరికట్టాలని మార్కెట్ కార్యదర్శి పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇప్పటివరకు మూడుసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు పందుల పెంపకందారులు వాటి ఆహారాన్ని బయట నుంచి తీసుకొచ్చి మార్కెట్ పరిసరాల్లో వినియోగిస్తుండటంతో పందుల సంచారం పెరిగి రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధాన్యం నిల్వలు, కొనుగోలు ప్రక్రియకు ఆటంకం కలగడంతో పాటు మార్కెట్ యార్డు ప్రతిష్ఠకు కూడా భంగం కలుగుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మార్కెట్ కార్యదర్శి పలుమార్లు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతుల సమస్యను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి పందుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మార్కెట్ యార్డును పందుల బెడద నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

భూ వినియోగ మార్పులకు త్వరగా అనుమతులివ్వాలి

శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్ నవంబర్ 4 (ప్రజా జ్యోతి) : ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో భూ వినియోగ మార్పులకు పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఎవీజీవీ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. బండ్లగూడ, ఫతుల్లాగూడ, కర్మన్‌ఘాట్, కొత్తపేట, లింగోజిగూడ, నాగోల్, హయత్‌నగర్ తదితర ప్రాంతాల్లోని పలు కాలనీలకు సంబంధించి ఓపెన్ స్పేస్, కన్జర్వేషన్, ఇండస్ట్రియల్, మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లను నివాస ప్రాంతాలుగా మార్చాలని ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. గతంలోనే అవసరమైన పత్రాలు అందజేసినా మూడేళ్లుగా ప్రక్రియ పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు.

అదేవిధంగా బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్‌లో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల ఆటస్థలాలు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధికి పరిపాలనాపరమైన, ఆర్థిక అనుమతులు మంజూరు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

దీనిపై హెచ్ఎండిఏ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, వైదేహి నగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోగుల రాంబాబు, కొత్త భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనానికి నాయకోటి పవన్ కుమార్‌కు ఆహ్వానం



ఎల్బీనగర్ కొత్తపేట, నవంబర్ 4 ప్రజా జ్యోతి : దీపావళి పండుగ సందర్భంగా నిర్వహించనున్న సదర్ సమ్మేళనానికి హాజరుకావాలని కోరుతూ కొత్తపేట యాదవ సంఘం ప్రతినిధులు బీజేపీ కార్యాలయంలో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సోదరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అంశాల పై సమీక్ష సమావేశం

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్, నవంబర్ 04, (ప్రజాజ్యోతి): శామీర్‌పేట మండలం అంతాయిపల్లి లోని ఐడీఓసీ కలెక్టరేట్ భవనంలో రెవెన్యూ అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు.

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని రెవెన్యూ సమస్యలు, భూ సంబంధిత అంశాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పెండింగ్ పనుల పరిష్కారానికి సంబంధించిన విషయాలపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమావేశంలో పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులల్లో నిర్లక్ష్యం చేయొద్దు





- రూ 4కోట్ల 43 లక్షల పనులపై సమీక్ష
- కూలి డబ్బుల చెల్లింపులో అవకతవకలకు అవకాశం లేదని వెల్లడి

తాండూరు నవంబర్ 4 ప్రజా జ్యోతి : వికారాబాద్ జిల్లా తాండూరు మండలంలోని పలు గ్రామాలలో చేపట్టిన ఉపాధ్యాయమి పనులపై సామాజిక తనిఖీ లో భాగంగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథులుగా, డిఆర్‌డిఓ ఏపీడి సత్తయ్య, డిఆర్‌డిఓ విజిలెన్స్ అధికారిణి కుసుమ మాధురి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. 2026- 2027 ఆర్థిక సంవత్సరం సామాజిక తనిఖీలో భాగంగా. 703 పనులకు గాను రూ 4 కోట్ల నలభై మూడు లక్షల నిధులు ఖర్చు చేసినట్లు వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు, సామాజిక అతనికి ఆడిటర్లు సమావేశము ముందు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏపీ డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో వికాసి భారతి పర్ రోజు గారు అండ్ అభివికా మిషన్ గ్రామీణ్ ద్వారా కూలీలకు పని కల్పించడంతోపాటు ఆన్లైన్ నమోదు ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. కూలీలకు రోజుకు రూ 308 రూపాయలు విడుదల చేయనుందని చెప్పారు. అదేవిధంగా గ్రామంలో 40 కూలీలకు పైగా ఉంటే అదనంగా ఒక మేటికి బాధ్యతలు ఇచ్చే ఏర్పాటు కూడా ఉంది అన్నారు. అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన వయోజనులకు ఉపాధి హామీ పనుల కోసం దరఖాస్తులు చేసుకుని వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వ ప్రసాద్ ఏపీఓ నర్సోత్తం రెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఈసి మధుసూదన్ రెడ్డి, పలు శాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులున్నారు.

భూగర్భ జలాలు పెంచేలా సర్పంచులు కృషి చేయాలి

- ఎల్ నీనో ప్రభావంపై నిర్లక్ష్యం చేయొద్దు
- మంచినీటి సరఫరా కోసం వ్యవసాయ బోర్లను గుర్తించాలి
- తాండూర్ ఎంపీడీవో విశ్వప్రసాద్





తాండూర్ నవంబర్ 4 ప్రజా జ్యోతి : గ్రామాలలో నీటి సమస్య రాకుండా సర్పంచులు తగు జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉందని తాండూర్ ఎంపీడీవో విశ్వ ప్రసాద్ పలు గ్రామాల సర్పంచ్లకు సూచించారు. మండల పరిషత్తు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలోని మంచినీటి బోర్ పంపుల వద్ద తప్పనిసరిగా రీఛార్జి పీట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా మంచినీటి పంపుల మరమ్మతులు చేయించడంతోపాటు పైప్లైన్ లీకేజీలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా సరిచేయాలని సూచించారు. ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది అన్నారు. జలసిరి పథకంలో భాగంగా ప్రభుత్వం సూచించిన విధంగా కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, వ్యవసాయ పొలాల వద్ద ఫామ్ ఫండ్ తవ్వించడం, వంటి కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగించాలని సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వం ద్వారా మంజూరైన అంగన్వాడి, ఢ్వాక్రా, పంచాయతీ భవనాలు వంటి అభివృద్ధి పనులను తక్షణమే ప్రారంభించాలని సూచించారు. ఇట్టి పనులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ముందుగానే నిధులు విడుదల అయినాయని ఎఫ్టి వో జనరేట్ చేసిన 15 రోజుల్లోనే బిల్లులు మీ ఖాతాలో జమ చేసే వెసులుబాటు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, పలు గ్రామాల సర్పంచులు సుదర్శన్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ గౌడ్, పండరి, వెంకట్ రెడ్డి, హేమలత, రామ్ రెడ్డి, పటేల్ విజయ్ కుమార్, శరణ్, చరణ్ సింగ్, గోపాల్,పలు గ్రామాల సర్పంచులు ఉన్నారు.

పట్టభద్రులందరు ఓటు నమోదు చేసుకోవాలి



- 2023కు ముందు డిగ్రీ పూర్తి చేసిన అందరూ అర్హులే
- వచ్చే ఏదాది జరగనున్న పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధమవుదాం
- తాండూరు మున్సిపల్ వైర్‌పర్సన్ నీరజ బాల్ రెడ్డి

తాండూరు నవంబర్ 4 ప్రజాజ్యోతి : వచ్చే ఏదాది జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కును నమోదు చేసుకోవడం కోసం 2023 కు ముందు డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులతో పాటు, మూడు సంవత్సరాల సమాన అర్హతలు ఉన్న అందరు కూడా ఈ నెల 6 వరకు ఆన్లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని తాండూర్ మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన పట్టభద్రులు రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిన విధంగానే మేధావుల సభకు ఎంపిటిసి పట్టబద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఓటు హక్కు పొందడం కోసం డిగ్రీ అర్హత ను నిర్ధారించడం జరిగిందన్నారు. దీంతో ప్రైవేటు పాఠశాలలతో పాటు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న అందరూ కూడా ఓటు హక్కును పొందడం ఎంతో అవసరం అన్నారు. బుధవారం రోజు పట్టణంలోని అక్షర ఉన్నత పాఠశాల, విశ్వవేద,గంగోత్రి విద్యాలయం, శ్రీ నేతాజీ గురుదేవ్ గురుకుల్, రహ్మనియా, ఫ్రంట్‌లైన్, యునైటెడ్ పబ్లిక్ స్కూల్, మార్నింగ్ స్టార్స్, సెయింట్ మార్క్ ఇంటర్నేషనల్, సెయింట్ మేరీస్ పాఠశాలలకు చెందిన నిర్వాహకులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రజాక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ గార్డెన్స్‌లో ఘనంగా సదర్ ఉత్సవాలు

- పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్
- మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహణ





శేరిలింగంపల్లి, నవంబర్ 04 (ప్రజాజ్యోతి) : దీపావళి పండుగను పురస్కరించుకుని మాజీ పార్లమెంట్ సభ్యులు శ్రీ అంజన్ కుమార్ యాదవ్, రాజ్యసభ పార్లమెంట్ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ గార్డెన్స్ ప్రాంగణంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సదర్ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సదర్ సమ్మేళనం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,వివిధ శాఖల మంత్రి,రాష్ట్ర యాదవ కురుమ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్, యాదవ బాంధవుల సమక్షంలో అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్,పటాన్ చెరు కార్పొరేటర్ శ్రీ మెట్టు కుమార్ యాదవ్,సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్,గోధ నరేందర్ యాదవ్ తో కలిసి విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. యాదవుల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సదర్ ఉత్సవాల్లో దున్నపోతుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

యాదవ బంధువులు పెద్ద ఎత్తున తరలివచ్చి సందడి చేశారు. అనంతరం కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, యాదవుల సంప్రదాయానికి ప్రతీక అయిన సదర్ పండుగను ఇంత ఘనంగా నిర్వహిస్తున్న మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ కి,ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యాదవులు ఎంతో కష్టపడి పెంచిన దున్నపోతులను ఈ వేదికపై ప్రదర్శించడం ఎంతో గర్వకారణమని, యాదవ బంధువుల ఐక్యతను చాటే ఈ సదర్ ఉత్సవం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అందరికీ దీపావళి మరియు సదర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సత్యనారాయణ, రవీంద్ర చారీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి.. రేపటి నుంచి యథావిధిగా నీటి సరఫరా

పృథ్వీ చౌదరి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ



ఎల్బీనగర్ నవంబర్ 4 (ప్రజా జ్యోతి) : జడ్జెస్ కాలనీ, సహారా బ్యాక్‌సైడ్, ఆటోనగర్ ప్రాంతాలకు నీటి సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ నిన్న పగిలిపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన టీపీసీసీ జనరల్ సెక్రటరీ పృథ్వీ చౌదరి వెంటనే స్పందించారు. హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి పైప్‌లైన్ మరమ్మతు పనులను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం మరమ్మతు పనులు పూర్తవుతున్నాయని, రేపటి నుంచి మూడు ప్రాంతాలకు ఎలాంటి అంతరాయం లేకుండా యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందని పృథ్వీ చౌదరి తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

అడ్వకేట్ డి,ఎల్,పాండు ముదిరాజ్‌కు సన్మానం చేసిన మాజీ జడ్పిటిసి కోట్ల మైపాల్



దౌల్తాబాద్ నవంబర్, 4(ప్రజాజ్యోతి) : హైదరాబాద్ హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందర్భంగా అడ్వకేట్ డి,ఎల్, పాండు ముదిరాజ్ నూ దౌల్తాబాద్ మండల మాజీ జడ్పీటీసీ కోట్ల మైపాల్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా, సన్మానించారు. అదేవిదంగా కోట్ల మైపాల్ ముదిరాజ్ హైకోర్టులో అడ్వకేట్ మెంబెర్ షిప్ గా నియమితులయ్యారు. వారినీ డి,ఎల్ పాండు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ విజయం ముదిరాజ్ సమాజానికి గర్వకారణం అని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహిస్తూ ప్రజలకు, న్యాయవ్యవస్థకు విశేష సేవలు అందించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు శ్రీనివాస్, వీరేష్, బదియ కృష్ణ,అడ్వకేట్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి!

కేజీబీవీలో పోలీసుల అవగాహన కార్యక్రమం



మోమిన్‌పేట్ నవంబర్ 4 (ప్రజా జ్యోతి) : వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం మోమిన్‌పేట్ పోలీసులు, వికారాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా, మహిళల భద్రత, బాలల హక్కులు, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తత వంటి అంశాలపై వివరించారు. ఏదైనా ఆపద ఎదురైతే వెంటనే పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జమీందారు వెంకటయ్య, పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్, నవంబర్ 4 (ప్రజా జ్యోతి) : మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సహారా ఎస్టేట్స్‌లో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డితో కలిసి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జక్కిడి రఘువీర్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కమ్యూనిటీ వాసులతో నాయకులు ఆత్మీయంగా ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు పోచబోయిన జగదీష్ యాదవ్, సీనియర్ నాయకులు విజయ భాస్కర్ రెడ్డి, బాలరాజు గౌడ్, రాకేష్ రెడ్డి, భవాని, అనిల్ కుమార్, సత్యం, సహారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కమ్యూనిటీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

బండారి జంగారెడ్డి 21వ వర్ధంతి

నివాళులర్పించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి కుటుంబ సభ్యులు



ఉప్పల్ నవంబర్ 04, (ప్రజాజ్యోతి) : ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తండ్రి బండారి జంగారెడ్డి 21 వ వర్ధంతి సందర్భంగా చీర్యాల లోని బండారి వ్యవసాయ క్షేత్రంలో సమాధికి నివాళులు అర్పించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఈ కార్యక్రమంలో బండారి నర్సింహారెడ్డి, నీలం రెడ్డి, వెంకట్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు బంధువులు తదితరులు పాల్గొన్నారు.



గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

మల్లాపూర్, నవంబర్ 4, ప్రజాజ్యోతి:
పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి, కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం



మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల పురోగతి, స్టేషన్ రికార్డులను పరిశీలించి, ఫిర్యాదుదారుల సమస్యలపై తక్షణమే స్పందించాలని సూచించారు. నేరాల నియంత్రణకు గస్తీని పెంచాలని, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రోడ్డు భద్రతా చర్యలు పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. ఆయన వెంట మెట్‌పల్లి సీఐ సురేష్ బాబు, ఎస్ఐ అనిల్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలి: ఎమ్మెల్యే సంజయ్

మల్లాపూర్, నవంబర్ 4, ప్రజాజ్యోతి:
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ఎలేటి మహేష్ రెడ్డి టీం ముందడుగు వేసింది. ఇందులో భాగంగా మండలంలోని కొత్త దాంరాజ్‌పల్లి గ్రామ యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు బుధవారం స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేశారు. ఈ కార్యక్రమానికి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ హాజరై



విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ఆటలు శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక వికాసానికి దోహదపడతాయని, పోటీల్లో పాల్గొనడం ద్వారా ఓటమిని తట్టుకునే శక్తి, గెలుపును ఆస్వాదించే మనస్తత్వం అలవడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడా రంగంలోనూ తమదైన గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ దామోదర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీకాంత్, ఎలేటి మహేష్ రెడ్డి, ఉపసర్పంచ్ హరీష్ రెడ్డి, కాటిపేల్లి ఆదిరెడ్డి, పన్నాల శేఖర్ రెడ్డి, వినోద్ రెడ్డి, తిట్ల రాజేష్, తోట శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సుధాకర్, కార్యదర్శి కీర్తి దివ్య తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

మేడిపల్లి, అక్టోబర్ 4 ప్రజాజ్యోతి:
జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని వల్లంపల్లి,తొంబారావుపేట్ గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం



రోజున క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామాల్లో కొనసాగుతున్న రీ సర్వే పనుల పురోగతిని, సర్వే నిర్వహిస్తున్న విధానాన్ని, భూ రికార్డుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే ప్రక్రియను చేపట్టాలని, భూముల హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.రీ సర్వే ద్వారా భూ రికార్డుల్లో ఖచ్చితత్వం ఉండేలా చూడాలని, నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, మేడిపల్లి మండల తహసీల్దార్ మునేందర్ , సర్వేయర్ కావ్య శ్రీ, ఆర్ ఐ లు వరలక్ష్మి , నాయక్, పంచాయతీ సెక్రెటరీ ప్రవీణ్, హుస్సేన్, సర్పంచులు సట్ట భూమేష్, నల్ల గంగారెడ్డి, వల్లంపల్లి గ్రామ ఉపసర్పంచ్ తొర్తి రమ్య– గోపి,జి పి ఓ లు నరేష్, కిషన్, మనసా,వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎస్పీ

వేములవాడ,నవంబర్,4:ప్రజాజ్యోతి.
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధాలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని కరీంనగర్ విజిలెన్స్ ఎస్పీ.జి. బసవ రెడ్డి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఎస్పీ కి ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తితో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం మండపంలో వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ ఈ.వో రమాదేవి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పిఆర్ఓ పెరిక శ్రీనివాస్,ఆలయ పర్యవేక్షకులు నరేందర్ సీనియర్ అసిస్టెంట్ నక్క తిరుపతి, ఆలయ ఉద్యోగులు మరియు వేద పండితులు పాల్గొన్నారు.



రక్తదానంలో మరోసారి మానవత్వాన్ని చాటిన కోరుట్ల సోషల్ సర్వీస్

ఆపదలో ఉన్న ఇద్దరు రోగులకు ఆపన్నహస్తం.. అత్యవసర సమయంలో స్పందించి రక్తదానం చేసిన యువకులు సేవా కార్యక్రమాలకు చిరునామాగా కోరుట్ల సోషల్ సర్వీస్ నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న వ్యవస్థాపక అధ్యక్షుడు అమేర్ ఖాన్

కోరుట్ల, నవంబర్ 4 ప్రజాజ్యోతి:
ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ భరోసా కల్పించడం, కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా



నిలవడం, ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న రోగులకు రక్తాన్ని అందించి ప్రాణదాతలుగా నిలవడం.. ఇవన్నీ సమాజం పట్ల బాధ్యతతో కూడిన సేవా కార్యక్రమాలు. ఇలాంటి సేవా భావాన్నే లక్ష్యంగా పెట్టుకొని కోరుట్ల పట్టణంలో కోరుట్ల సోషల్ సర్వీస్ నిరంతరం ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తనదైన గుర్తింపును సంపాదించుకుంటోంది. ముఖ్యంగా అత్యవసర సమయంలో రక్తం అవసర మైన రోగులకు అండగా నిలుస్తూ మానవత్వానికి ప్రతీకగా నిలుస్తోంది.తాజాగా కోరుట్ల పట్టణంలో చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులకు అత్యవస రంగా ఏ పాజిటివ్, బి పాజిటివ్ రక్తం అవసరం ఏర్పడింది. రోగుల ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని వారి కుటుంబ సభ్యులు రక్తం కోసం తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఎక్కడ రక్తం దొరుకుతుందో, ఎవరు సహాయం చేస్తారో తెలియని పరిస్థితుల్లో కోరుట్ల సోషల్ సర్వీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అమేర్ ఖాన్‌ను సంప్రదించారు.

– సమాచారం అందిన వెంటనే స్పందించిన అమేర్ ఖాన్:
రోగుల కుటుంబ సభ్యుల నుంచి రక్తం అవసరమనే సమాచారం అందుకున్న వెంటనే అమేర్ ఖాన్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్పందించారు. ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడమే నిజమైన సేవ అనే సంకల్పంతో తన సోషల్ సర్వీస్ సభ్యులైన అబ్రార్ ఖాన్, సయ్యద్ నాజిమ్‌లకు విషయం తెలియజేశారు. దీంతో వారు మానవత్వంతో ముందుకు వచ్చి వెంటనే రక్తనిధికి చేరుకొని అవసరమైన రక్తాన్ని దానం చేశారు.తమకు పరిచయం ఉన్నవారైనా, లేనివారైనా ఆపదలో ఉన్నప్పుడు సహాయం చేయాలనే మంచి మనసుతో ముందుకు వచ్చిన అబ్రార్ ఖాన్, సయ్యద్ నాజిమ్‌ల సేవాభావం అభినందనీయం. వారి తక్షణ స్పందనతో రోగులకు అవసరమైన రక్తం అందించేందుకు మార్గం సుగమమైంది. అత్యవసర సమయంలో రక్తదానం చేయడం ద్వారా వారు సమాజానికి మంచి సందేశాన్ని అందించారు.

– రక్తదానం ఒక్కటే కాదు.. ఎన్నో సేవా కార్యక్రమాలు:
కోరుట్ల పట్టణంలో కోరుట్ల సోషల్ సర్వీస్ పేరుతో వ్యవస్థాపక అధ్యక్షుడు అమేర్ ఖాన్ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు. కేవలం రక్తదాన కార్యక్రమాలకే పరిమితం కాకుండా సమాజంలోని నిరుపేదలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలుస్తూ తన సేవా ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.ముఖ్యంగా నిరుపేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక





ఇబ్బందులు ఎదురైనప్పుడు తమ వంతు సహాయాన్ని అందిస్తూ ఆ కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతున్నారు. పేద కుటుంబాలకు వైద్యపరమైన అవసరాలు ఏర్పడినప్పుడు సహాయం చేయడం, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు మెడికల్ క్యాంపులు నిర్వహించడం వంటి కార్యక్ర మాలను చేపడుతున్నారు.అత్యవసర పరిస్థితుల్లో రక్తం కోసం ఇబ్బందులు పడుతున్న రోగుల కుటుంబాలకు రక్తదాతలను సమకూర్చడం ద్వారా ఎన్నో కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. రక్తం అవసరమని సమాచారం అందిన వెంటనే స్పందించి అందుబాటులో ఉన్న రక్తదాతలను సంప్రదించడం, అవసరమైన వారికి రక్తం అందేలా సమన్వయం చేయడం వంటి కార్యక్రమాలతో సోషల్ సర్వీస్ సభ్యులు నిరంతరం సేవలందిస్తు న్నారు.

– యువతలో సేవాభావాన్ని పెంపొందిస్తున్న అమేర్ ఖాన్:
నేటి సమాజంలో చాలామంది తమ వ్యక్తిగత పనులు, బాధ్యతలతో బిజీగా ఉన్నప్పటికీ సమాజం కోసం కొంత సమయం కేటాయిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో గొప్ప విషయం. అలాంటి సేవా భావాన్ని యువతలో పెంపొందిస్తూ అమేర్ ఖాన్ ముందుకు సాగుతున్నారు.సేవ చేయడానికి ఆర్థిక స్థోమత ఒక్కటే అవసరం లేదని, మంచి మనసు, స్పందించే హృదయం ఉంటే సమాజానికి ఎంతో మేలు చేయవచ్చని కోరుట్ల సోషల్ సర్వీస్ కార్యకలాపాలు చాటిచెబుతున్నాయి. ఒకవైపు రక్తదానం, మరోవైపు నిరుపేదలకు ఆర్థిక సహాయం, ఇంకోవైపు వైద్య శిబిరాలు.. ఇలా వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు చేరువవుతు న్నారు.

– సేవకు హద్దులు లేవు.. మానవత్వానికి కులమతాలు లేవు:
ఆపదలో ఉన్న వ్యక్తికి సహాయం చేయడమే నిజమైన మానవత్వం. రక్తం అవసరమైన సమయంలో రక్తదానం చేయడం ద్వారా ఒక రోగికి మాత్రమే కాకుండా ఆ రోగిని నమ్ముకొని జీవిస్తున్న కుటుంబ సభ్యులకు కూడా ఎంతో ధైర్యాన్ని అందించినట్లవు తుంది. అందుకే ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకొని, వైద్యపరంగా అర్హత ఉన్నవారు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.కోరుట్ల సోషల్ సర్వీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అమేర్ ఖాన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని, మరెంతోమంది యువకులు ఇలాంటి సామాజిక సేవల్లో భాగస్వాములు కావాలని పట్టణ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.పదవులు, ప్రచారాలు, స్వార్థ ప్రయోజనాలకు అతీతంగా ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే అసలైన సామాజిక సేవ. రక్తదానం నుంచి నిరుపేదల వివాహాలకు ఆర్థిక సహాయం వరకు పలు సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న కోరుట్ల సోషల్ సర్వీస్.. సమాజంలో సేవాభావానికి ఒక మంచి ఉదాహర ణగా నిలుస్తోంది.

'ఎల్‌నినో' ముప్పు రానివ్వొద్దు.. తాగునీటికి ఇబ్బంది ఉండొద్దు!

చైర్మన్ పుల్కం రాజు 2వ వార్డులో పారిశుధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్ ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలకు ఆదేశం

వేములవాడ, నవంబర్ 4, ప్రజాజ్యోతి:
వేములవాడ పట్టణంలోని శాత్రాజుపల్లి రెండో వార్డులో బుధవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కమిషనర్ లోకేష్‌లు ,కలిసి మౌలిక




వసతుల కల్పన పనులను క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించారు. వార్డులో సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు (డ్రైనేజీ) పురోగతితో పాటు పారిశుధ్య పనులను స్వయంగా పరిశీలించారు. కాలనీ వీధుల్లో సంచరిస్తూ త్రాగునీటి ఇబ్బందులు, డ్రైనేజీల నిర్వహణ, పారిశుధ్యం తీరుపై ప్రజలను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకూడదని, ప్రతిరోజూ చెత్త సేకరణ సక్రమంగా జర గాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. పరిశీలన అనంతరం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో నీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉన్నందున, వార్డుల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి సరఫరా వ్యవస్థలో ఎలాంటి ఆటంకాలు రాకుండా నిరంతరం పర్యవేక్షించాలని అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పారదర్శకంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, పట్టణాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం తో



ముందుకు సాగుతున్నామని వారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్ స్థానిక కౌన్సిలర్ ఏనుగు జ్యోతి తిరుపతి రెడ్డి , సానిటరీ ఇన్స్పెక్టర్ సుకుమార్ మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ రాకేష్ ,మున్సిపల్ జవాన్లు, మున్సి పల్ సిబ్బంది పాల్గొన్నారు.

పారమిత విద్యార్థులు, ఉపాధ్యాయుడు లలిత్ మోహన్ సాహుకు ఘన సత్కారం

కరీంనగర్, నవంబర్ 4 (ప్రజాజ్యోతి):
జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన పారమిత హెరిటేజ్ పాఠశాల మ్యూజిక్ బ్యాండ్ విద్యార్థులు, జాతీయ స్థాయి ఇన్నోవేటివ్



టీచర్ అవార్డు గ్రహీత లలిత్ మోహన్ సాహును విశ్రాంత ప్రధాన ఎన్నికల అధికారి సి. పార్థసారథి, ఆర్డీఓ షర్మిల, డీఈఓ తిరుపతిరావు ఘనంగా సత్కరించి అభినందించారు. గ్వాలియర్‌లో నిర్వహించిన 21వ అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవం ఉద్భవ్ ఉత్సవ్–2026లో పారమిత మ్యూజిక్ బ్యాండ్ బృందం గ్రూప్ మ్యూజికల్ బ్యాండ్ విభాగంలో ప్రథమ స్థానం సాధించగా, సోలో విభాగంలో విద్యార్థి కిట్ల చరణ్ ప్రథమ, ఏవీకే క్రితిక్ ద్వితీయ స్థానాలు సాధించారు. మరోవైపు వివో ఇగ్నైట్ టీచర్ ఇన్నోవేషన్ ఫెలోషిప్–2026కు దేశవ్యాప్తంగా ఎంపికైన టాప్–10 ఉపాధ్యాయుల్లో లలిత్ మోహన్ సాహు చోటు దక్కించుకున్నారు. తెలంగాణ నుంచి ఎంపికైన ఏకైక ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందారు. ఈ విజయాలు విద్యాసంస్థకు, జిల్లాకు గర్వకారణ మని పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ వినోద్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

రైతులకు నాణ్యమైన విద్యుత్, సాగునీరు అందిస్తున్నాం ఆరుతడి పంటల సాగుతోనే ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించ వచ్చు బీఆర్ఎస్‌ది అసత్య ప్రచారం.. కరువుపై కనీస అవగాహన లేకుండా విమర్శలు సబ్సిడీపై ఆరుతడి విత్తనాలు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

సుల్తానాబాద్, నవంబరు 4(ప్రజా జ్యోతి):
రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి



ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్, సాగునీటితో పాటు సబ్సిడీపై విత్తనాలు అందిస్తూ వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను విస్మరించి బీఆర్ఎస్ నాయకులు కల్లిబొల్లి మాటలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు.బుధ వారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరుతడి విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత లేదని, రైతులకు రోజుకు 12 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు.

సాగునీటి కోసం ప్రత్యేక చొరవ:
వేసవిలో పంటలు ఎండిపోకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌తో కలిసి ఒప్పించి ఎనిమిది నియోజకవర్గాలకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయించామని విజయరమణారావు తెలిపారు. దీంతో చెరువులు, కుంటలు, బావుల్లో నీటిమట్టం పెరిగి భూగర్భ జలాలు వృద్ధి చెందాయని వివరించారు. నియోజకవర్గంలో సుమారు 24 వేల ఎకరాల్లో వరి సాగు జరిగిందని పేర్కొన్నారు. రైతులు ధాన్యాన్ని ఐకేపీ, సింగిల్‌విండో, వ్యవసాయ మార్కెట్ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవ చ్చని, లాభదాయక ధర లభిస్తే మిల్లర్లకు కూడా అమ్ముకోవచ్చని సూచించారు.

ఆరుతడి పంటల వైపు మళ్లాలి:
ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ



పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయని, భూగర్భ జలాలు తగ్గే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రభుత్వం ఎస్సీ రైతులకు ఉచితంగా, ఇతర రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరువు పరిస్థితులపై కనీస అవగాహన లేకుండా ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలకు దిగడం సరికాద న్నారు.

కాళేశ్వరం నీళ్లు ఎక్కడికి వచ్చాయో చెప్పాలి:
కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే అనేక సాగునీటి ప్రాజెక్టులకు పునాదులు పడ్డాయని విజయరమణారావు గుర్తుచేశారు. ఎస్సారెస్పీ కాలువల నిర్మాణానికి ఇందిరాగాంధీ హయాంలోనే శ్రీకారం చుట్టారని, అప్పటి నుంచి రైతులకు సాగునీరు అందుతోందన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సారెస్పీ కాలువల అభివృద్ధికి అదనంగా ఒక్క నిర్మాణం కూడా చేపట్టలేదని విమర్శించారు.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినా నేడు కూలిపోయిన పరిస్థితి నెలకొందని, ప్రాజెక్టును సందర్శిస్తున్న కొందరు నాయకులు అక్కడి నుంచి నీటిని ఎత్తిపోసి సాగునీరు అందిస్తామంటూ అవగాహన లేని వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. నీటిని ఎక్కడి నుంచి, ఎలా ఎత్తిపోస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మంత్రి హరీశ్‌రావు పెద్దపల్లి జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు కాళేశ్వరం నీళ్లు పెద్దపల్లి జిల్లాను ముద్దాడుతాయని చెప్పారని గుర్తుచేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏ నియోజకవర్గానికి కాళేశ్వరం నీళ్లు అందించారో నిరూపించాలని, నిరూపిస్తే తాను ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు.

యూరియాపై అవగాహన లేకుండా విమర్శలా?:
యూరియా సరఫరా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, ఆ విషయం తెలియకుండా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం బీఆర్ఎస్ నాయకుల అవగాహనారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్లు శ్రీగిరి శ్రీనివాస్, చిలుక సతీష్, కల్లెపల్లి జానీ, కృషి విజ్ఞాన శాస్త్రవేత్త సంపత్, సింగిల్‌విండో సీఈవో బూరుగు సంతోష్, మండల వ్యవసాయ అధికారి పైడితల్లి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దన్నాయక్ దామోదర్‌రావు, రైతు సెల్ మండల అధ్యక్షుడు పన్నాల రామన్న, సర్పంచులు కాంపల్లి సతీష్‌కుమార్, గుండేటి దేవేందర్, ఏరుకొండ స్రవంతి రమేష్, కరె గట్టయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు ఉట్ల వరప్రదీప్, తొర్రికొండ ప్రభాకర్, చింతల రాజు, అమీరిశెట్టి శ్రావణి రాకేష్, సింగిల్‌విండో డైరెక్టర్లు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

● బోనకల్ ఎస్సై మాచినేని రవి

బోనకల్, నవంబర్ 4 (ప్రజా జ్యోతి): మండలంలోని గ్రామాలలో దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేయదలచిన వారు సంబంధిత అధికారుల నుండి తప్పనిసరిగా ముందస్తు అనుమతులు, లైసెన్సులు పొందాలని బోనకల్ ఎస్సై మాచినేని రవి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనుమతులు పొందిన వారు మాత్రమే నిర్ణయించిన ప్రదేశాలలో, ప్రభుత్వ నిబంధనలు, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను పాటిస్తూ దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసినా, అక్రమంగా బాణసంచా నిల్వ చేసినా లేదా విక్రయించినా సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయనీ ఎస్ఐ మాచినేని రవి తెలిపారు . కావున వ్యాపారులు ఇట్టి విషయాన్ని గమనించి, నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసువారికి సహకరించాలని కోరారు.



ఈ నెల 13న జిల్లా స్థాయి మెగా క్విజ్ పోటీలు

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి విద్యార్థులలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై సమగ్ర అవగాహన కల్పించడం,మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో యువతను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, జిల్లా విద్యాశాఖ సహకారంతో ఈ నెల 13న జిల్లా స్థాయి మెగా క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఖమ్మం డివిజన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నషా ముక్త్ భారత్,తెలంగాణ రైజింగ్-2047 కార్యక్రమాలలో భాగంగా నవంబర్ 13, 2026 శుక్రవారం నాయుడుపేట సర్కిల్ సమీపంలోని టీసీవీ కల్యాణ మండపంలో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయని డిప్యూటీ కమిషనర్ అన్నారు. విద్యార్థుల్లో సాధారణ జ్ఞానం,చరిత్ర, సంస్కృతి,సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించడానికి ఈ వేదిక ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు.ప్రతి విద్యాసంస్థ నుండి గరిష్ఠంగా రెండు జట్లు ఒక్కో జట్టుకు ఇద్దరు చొప్పున మొత్తం నలుగురు విద్యార్థులు పాల్గొనవచ్చని, ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదని స్పష్టం చేశారు. ఈ క్విజ్ పోటీలను తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో నిర్వహిస్తారని, నషా ముక్త్ భారత్, భారత చరిత్ర-సాంస్కృతిక వారసత్వం, తెలంగాణ చరిత్ర-సాంస్కృతిక వారసత్వం మరియు సమకాలీన కరెంట్ అఫైర్స్ అంశాలపై ప్రశ్నలు ఉంటాయని వివరించారు. మొదట 20 ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో రాత పరీక్ష నిర్వహించి, టాప్ 12 జట్లను సెమీఫైనల్స్‌కు, ఆపై ప్రతిభ చూపిన 6 జట్లను గ్రాండ్ ఫైనల్స్‌కు ఎంపిక చేస్తామని తెలిపారు. ఫైనల్స్‌లో ఎల్‌సీడీ ప్రొజెక్టర్ ద్వారా ఆరు విభాగాల్లో దృశ్య, శ్రవణ ఆడియో,వీడియో మాధ్యమాల్లో క్విజ్ ఉంటుందని,విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తామని చెప్పారు.పోటీల్లో పాల్గొనగోరు విద్యాసంస్థలు నవంబర్ 10వ తేదీలోగా గూగుల్ ఫామ్,క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ సూచించారు. పాల్గొనే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పాఠశాలలు, కళాశాల యాజమాన్యాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.మరిన్ని వివరాలు లేదా సందేహాల కోసం ఖమ్మం- వన్ టౌన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి. చిరంజీవి 8712648841, ఖమ్మం- రెండవ టౌన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె. రాజు 8712648842, లేదా కిషోర్ రెడ్డి 95339 98674లను సంప్రదించాల్సిందిగా డిప్యూటీ కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సింగరేణిలో మరో బంపర్ గుడ్ న్యూస్..

● డిస్మిస్ అయిన వారికి తిరిగి ఉద్యోగం..!

● గైర్హాజరుతో తొలగించబడ్డారా..? మీకోసం మళ్ళీ తలుపు తెరిచిన సింగరేణి..!

● భట్టి చొరవతో 3 ఏళ్ల డిస్మిస్డ్ కార్మికులకు పునర్జన్మ..!

● 46 ఏళ్లలోపు వారికి మరో ఛాన్స్.. దరఖాస్తుకు చివరి తేదీ నవంబర్ 14..!

● కార్మిక కుటుంబాల్లో వెలుగులు.. హైపవర్ కమిటీతో పునఃపరిశీలన!





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. నవంబర్ 4, (ప్రజాజ్యోతి) : - సింగరేణి డిస్మిస్డ్ ఉద్యోగుల కుటుంబాల్లో మళ్ళీ వెలుగులు నింపే నిర్ణయం వచ్చింది. గైర్హాజరు కారణంగా ఉద్యోగం కోల్పోయి రోడ్డున పడ్డ వందలాది కుటుంబాలకు సింగరేణి యాజమాన్యం భారీ ఊరట కలిగించింది. 2023 నుంచి 2025 మధ్య కాలంలో గైర్హాజరు కారణంగా తొలగించబడిన మాజీ ఉద్యోగుల కేసులను పునఃపరిశీలించాలని యాజమాన్యం నిర్ణయించింది. వారిని మళ్లీ ఉద్యోగంలోకి తీసుకునేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కోల్ బెల్ట్ ప్రజా ప్రతినిధులతో సమావేశం సందర్భంగా డిస్మిస్డ్ ఉద్యోగులకు అవకాశం కల్పించాలని ప్రజా ప్రతినిధులు కోరారు. దీనిపై స్పందించిన భట్టి.. వెంటనే పరిశీలించాలని యాజమాన్యాన్ని ఆదేశించడంతో ఈ నిర్ణయం వెలువడింది. 01.01.2023 నుంచి 31.12.2025 మధ్య తొలగించబడిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, 01.04.2026 నాటికి 46 సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ వయసు ఉండాలని యాజమాన్యం స్పష్టం చేసింది. గత 5 ఏళ్లలో ఏదైనా 2 సంవత్సరాల్లో కనీసం 100 మస్టర్లు పూర్తి చేసి, వైద్యపరంగా ఫిట్ గా ఉండాలని సూచించింది. అర్హత కలిగిన వారు తాము చివరగా పనిచేసిన గని / డిపార్ట్ మెంట్ అధిపతికి దరఖాస్తు అందించాలని, చివరి తేదీ 14.11.2026గా నిర్ణయించినట్లు తెలిపింది.

కొత్తూరు గ్రామ ప్రజల యోగక్షేమాలై ముఖ్యం: పాలకవర్గం

సత్తుపల్లి నవంబర్04 (ప్రజా జ్యోతి) మురసు తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొత్తూరు సర్పంచ్ అయినంపూడి శ్రీనివాస్ రావు, ఉప సర్పంచ్ గొర్లమారి రామ్మోహన్ రెడ్డి అన్నారు. మురసు తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండటంతో పాలకవర్గ సభ్యులతో గ్రామంలో బుధవారం మొత్తం పరిశీలించారు. డ్రైనేజీల్లో కూరుకుపోయిన చెత్తను, మురికి నీటిని,నీళ్ల పోయేందుకు





సాఫీగా ఉండేందుకు, కాలువలను పంచాయతీ సిబ్బందితో కూడుకుపోయిన చెత్తను, డ్రైనేజీ క్లీనింగ్ వంటి పనులను ఉదయం నుండే పాలకవర్గం గ్రామపంచాయతీలో పర్యటించి,ఎక్కడా నీరు నిలువ లేకుండా చేసినారు.మురసు తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండటంతో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా పాలకవర్గాన్ని సంప్రదించాలని,అండగా మేము ఉంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.

మురసు తుఫాను నేపథ్యంలో
చౌడవరం ఎస్టీ కాలనీలో ఇల్లు మునక

వేంసూర్ నవంబర్ 4 ప్రజాజ్యోతి వేంసూరు మండలంలోని చౌడవరం గ్రామంలోని ఎస్టి కాలనీలో మురసు తుఫాను నేపథ్యంలో చాలా ఇల్లు మునిగిపోయి ప్రజలు దయనీయ స్థితిలో ఉన్నారు. కాలనీలోని ఇల్లన్ని శిథిలావస్థలో ఉన్నాయి, ఎప్పుడు కూలిపోతాయేమోనని, కాలనీలోని ప్రజలు రాత్రి



తెల్లవారులు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరి చేతిలో పెట్టుకొని రోడ్లమీద పడి కాపులు కాసినారు.ప్రభుత్వ, అధికారులు గానీ, స్థానిక శాసన సభ్యురాలు రాగమయి ఈ గ్రామానికి వచ్చి ఇక్కడ ఉన్న పరిస్థితుల్ని పరిశీలించి ప్రజలకు తగు సహాయ సహకారాలు అందించాలని, ఇందిరమ్మ ఇళ్ళను ఇచ్చి ఆదుకోవాలని,గ్రామ ప్రజలు, పెద్దలు, సర్పంచ్ నల్లిబోయిన చిన్న కృష్ణ, ఉపసర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, కోరుచున్నారు. అదేవిధంగా తుఫాన్ నేపథ్యంగా కురుస్తున్న వానలు వలన ప్రజల అప్రమత్తంగా ఉండాలని, కరెంటు స్తంభాల దగ్గర జాగ్రత్తగా ఉండాలని, కరెంటు వైర్లు తెగిపడితే వెంటనే సమాచారం అందించాలని, పశువుల కాపరులు పశువులని చెట్ల వద్ద కాకుండా, పశువుల కొట్టాలో జాగ్రత్తపరచుకోవాలని, వాగులు వంకలు పొర్లి ప్రమాదకరంగా ప్రవహిస్తున్న కారణంగా అనవసర ప్రయాణాలు మానుకోవాలని, గ్రామంలో 24 గంటలు అందుబాటులో ఉండి ప్రజలకు ఏ అవసరమైన దగ్గరుండి చూసుకుంటానని వివరించినారు. గ్రామంలో ఎటువంటి ప్రమాదాలు ఎదురైన, పంచాయతీ సిబ్బందికి, సర్పంచ్‌కి, ఉప సర్పంచ్ కుగాని, సెక్రెటరీ గాని తెలియజేయాలని తెలిపినారు.

బియ్యం విక్రయించే దుకాణాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

- దుకాణాల ఎదుట ధరల పట్టిక ఆధారంగా వినియోగదారులకు విక్రయించాలి

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సివిల్ సప్లై అధికారులు

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 4,(ప్రజా జ్యోతి) హైదరాబాద్ సివిల్ సప్లై కమిషనర్ ఆదేశాల మేరకు కొత్తగూడెం పట్టణంలో వివిధ బియ్యం విక్రయించే దుకాణాల ను అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, కొత్తగూడెం సివిల్ సప్లై డిఎం. ఎండి డి శంకర్ రావు, త్రినాధ్ బాబు మణుగూరు, అశ్వరావుపేట, భద్రాచలం కు





చెందిన సివిల్ సప్లై అధికారులు బుధవారం బియ్యం విక్రయించే షాపులను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు, ఈ సందర్భంగా వారు ప్రతి దుకాణం ముందు ధరల పట్టికను పెట్టి అట్టి పట్టికలో నిర్ణయించిన ధరల ప్రకారం వినియోగదారులకూ విక్రయించే విధముగా ఉండాలని దుకాణ యజమానులను ఆదేశించారు, ధరల పట్టికను లేకుండా వినియోగదారులకు బియ్యం విక్రయిస్తే నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం 6నూ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు ,అదే విధముగా వినియోగదారులు కూడా ఎవరైనా బియ్యం దుకాణాదారులు అధిక ధరలకు విక్రయించి నట్లు అయితే సివిల్ సప్లైస్ అధికారుల కు పిర్యాదు చేయాలన్నారు, అదేవిధంగా జిల్లలోనీ మిగత రైస్ దుకాణదారులు అందరు కూడా ధరల పట్టిక ను ఏర్పాటు చేసి, ఆయా ధరల ప్రకారం విక్రయించవలసినదిగా ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు జి ప్రభాకర్ ,జి రాజులు, ఎం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రీజియన్‌లో అండర్‌గ్రౌండ్
సర్ఫేస్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

● ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు

సత్తుపల్లి నవంబర్04 (ప్రజా జ్యోతి) సింగరేణి కొత్తగూడెం రీజియన్ పరిధిలో,అండర్‌గ్రౌండ్ నుంచి సర్ఫేస్‌కు రావాల్సిన పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, సత్తుపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు కోరారు.ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ డా. జనక్ ప్రసాద్ సూచన మేరకు, సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ ద్వారా కోటేశ్వరరావు కార్పొరేట్ జీఎం పర్సనల్ , కిరణ్ కుమార్‌ను కలిసి కార్మికుల సమస్యలను వివరించారు.ఈ విషయంపై కిరణ్ కుమార్ వెంటనే సానుకూలంగా స్పందిస్తూ, మరో పది రోజుల్లో సంబంధిత సర్క్యులర్ విడుదల చేసి పోస్టుల భర్తీ ప్రక్రియ చేపడతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అండర్‌గ్రౌండ్ నుంచి సర్ఫేస్ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయిన అనంతరం, సర్ఫేస్ నుంచి సర్ఫేస్ పోస్టులను కూడా సీనియారిటీ ప్రాతిపదికన కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తామని తెలియజేశారు. అలాగే సత్తుపల్లి ఏరియాలో ఫిబ్రవరి 1వ తేదీన విధులు నిర్వహించిన 61 మంది ఈపీ ఆపరేటర్ల ప్లే డే భత్యం సమస్యను కూడా కోటేశ్వరరావు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని కిరణ్ కుమార్ సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని కోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ మురళీకృష్ణ, ఫిట్ సెక్రటరీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలలో
దెబ్బతిన్న వరిబి మొక్కజొన్న పంటలను పరిశీలించిన డిపఓ

● 16 వందల ఎకరాల్లో మినిమ పంట

15 వందల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు అంచనా వేసిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 4,(ప్రజా జ్యోతి) మురసు తుఫాను ప్రభావంతో జిల్లాలో కురిసిన భారీ





వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను సంరక్షించుకునేందుకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు సూచించారు. తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొత్తగూడెం మండలం సుజాతనగర్ గ్రామంలో నేలకొరిగిన వరి పంట పొలాలను చైతన్య రెడ్డి, కొత్తగూడెం వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ), సుజాతనగర్ మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ)తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల పరిస్థితిని, వర్షాల కారణంగా జరిగిన నష్టాన్ని పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు మాట్లాడుతూ, వరి పంట నేలకొరిగిన ప్రాంతాల్లో పొలాల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని వెంటనే బయటకు పంపించాలని సూచించారు. నీరు ఎక్కువ సమయం నిల్వ ఉండకుండా మురుగు కాలువల ద్వారా నీటిని తొలగించాలని తెలిపారు. వరి కంకులు తడిసి ధాన్యం మొలకెత్తే పరిస్థితి ఉన్నచోట ఒక ట్యాంకు నీటిలో 100 గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేయడం ద్వారా మొలకలు రాకుండా నివారించవచ్చని అన్నారు.మిరప పంట సాగు చేస్తున్న రైతులు భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా నేలకొరిగిన మొక్కలను తిరిగి నిలబెట్టి కర్రలు లేదా ఇతర ఆధారాలతో కట్టుకోవాలని సూచించారు. మొక్కల మొదళ్ల వద్ద మట్టిని ఎగదోసి మొక్కలు పడిపోకుండా చూడాలని, చేలల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన పారుదల సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అధిక తేమ కారణంగా తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉన్నందున పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వ్యవసాయ శాఖ అధికారుల సలహా మేరకు అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి మండలాల్లో అధిక వర్షపాతం నమోదైన నేపథ్యంలో పంట నష్టంపై ప్రాథమిక అంచనాలు రూపొందించినట్లు బాబురావు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 1600 ఎకరాల్లో మిసుము పంట, 1,500 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలిస్తూ వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. తుఫాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులు పంటల సంరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని, అవసరమైన సాంకేతిక సలహాల కోసం సమీప వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు కోరారు.

ఆపదలో ఉన్న కుటుంబానికి ప్రభుత్వ అండ

● ప్రవళిక మృతిపై ఎస్‌కె ఖదీర్ తీవ్ర దిగ్భ్రాంతి

● సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన బాధిత కుటుంబానికి కొండంత ధైర్యం

అశ్వాపురం:నవంబర్ 4,ప్రజాజ్యోతి మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి అత్యంత బాధాకరమని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కో-ఆప్షన్ సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్.కె. ఖదీర్ ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో చోటుచేసుకున్న విషాద ఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రవళిక హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం తనను కలచివేసిందన్నారు. ప్రవళిక మృతి ఆమె కుటుంబానికి తీరని లోటని, ముఖ్యంగా తల్లికి తీరని వేదన మిగిల్చిందని పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రభుత్వ ప్రకటనతో కుటుంబానికి ఊరట

ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం హర్షణీయమని



ఖదీర్ అన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన భరోసా బాధిత కుటుంబానికి ముఖ్యంగా మృతురాలి తల్లికి కొంత ధైర్యాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు.

తల్లికి మనోధైర్యం కల్పించాలని ప్రార్థన

కన్నకూతురిని కోల్పోయిన తల్లి బాధ వర్ణనాతీతమని, ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ఆమెకు ప్రసాదించాలని కోరుకున్నారు. ప్రవళిక ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, బాధిత కుటుంబానికి తన సానుభూతిని మరోసారి తెలియజేశారు.

ప్రవళిక కుటుంబానికి అండగా ప్రభుత్వం..!

● కోటి రూపాయల భీమా, తల్లికి ఉద్యోగం..!

● ఉస్మానియాలో మంత్రి పొన్నం భావోద్వేగం..

● ప్రవళిక మృతి ఆర్టీసీకి తీరని లోటు..!

● దోషిపై హత్య కేసు.. కఠిన శిక్ష తప్పదు

● చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దు.. ఫిర్యాదు చేయండి, చర్యలు తీసుకుంటాం

● రవాణా శాఖ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. నవంబర్ 4, (ప్రజాజ్యోతి) : - ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద మృతి చెందిన ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక పార్థివదేహానికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి బుధవారం ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రవళిక తల్లిని పరామర్శించిన మంత్రి, ఆర్టీసీ కుటుంబం ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రవళిక మృతి ఆర్టీసీ కుటుంబానికి తీరని లోటని, ఆమెను కాపాడేందుకు ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందించేందుకు ప్రయత్నించినా దురదృష్టవశాత్తు ప్రాణాలు కాపాడలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రవళిక తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడంతో పాటు ప్రభుత్వం, ఆర్టీసీ నుంచి 10 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా, ఆర్టీసీ తీసుకున్న నిర్ణయం మేరకు బ్యాంకు నుంచి కోటి రూపాయల ప్రమాద భీమా అందుతుందని మంత్రి పొన్నం ప్రకటించారు. ఆర్థికంగా ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకుంటామని, అయినా కుటుంబ సభ్యురాలిని కోల్పోయిన బాధను ఎవరూ తీర్చలేరని అన్నారు. ఈ ఘటనలో దోషిపై ఇప్పటికే హత్యాయత్నం కేసు ఉందని, ఇప్పుడు హత్య కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలిగితే సిబ్బందిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, నేరుగా చట్టాన్ని చేతిలోకి తీసుకుని దాడి చేయడం వల్ల ఒక కుటుంబం రోడ్డున పడిందని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని, కార్మికుల సంక్షేమం, భద్రతే ప్రభుత్వ ప్రాధాన్యతని స్పష్టం చేశారు.

శిథిలావస్థలో ప్రహరీ గోడ కూలి ఆస్తి నష్టం

మిగిలిన గోడను పూర్తిగా తొలగించాలి

సర్పంచ్ పూనెం కృష్ణకు బాధిత కుటుంబ సభ్యుల వినతి

భద్రాచలం, నవంబర్ 4 (ప్రజా జ్యోతి):
పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో శిథిలావస్థకు చేరిన పాత ప్రహరీ గోడ కొంతభాగం కూలిపోవడంతో ఆస్తి నష్టం సంభవించింది. మిగిలిన గోడ కూడా





ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులు, కాలనీవాసులు సర్పంచ్ పూనెం కృష్ణను కలిసి ప్రమాదకరంగా ఉన్న మిగిలిన గోడను పూర్తిగా తొలగించాలని వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజల ప్రాణాలకు ముప్పు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదం జరిగిన తర్వాత కాకుండా ముందుగానే స్పందించి ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఏఐతో భూ వివాదాల పరిష్కారమా..

మొదటిపేజీ తరువాయి..

ఇచ్చారన్న ఆరోపణలపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేస్తూ, బాధ్యుల వివరణ కోరింది. ఈ వ్యవహారంపై జనగామ జిల్లా దేవరుప్పుల మండలం పెద్దమడూరు గ్రామానికి చెందిన మేడిపల్లి కొమురయ్య హైకోర్టును ఆశ్రయించారు. తన భూ వివాదానికి సంబంధించి ప్రత్యర్థులు సమర్పించిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ సెప్టెంబర్ 8వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారని పిటిషనర్ తెలిపారు. అయితే తన వాదనలను వినకుండా.. సంబంధిత భూమి రికార్డులు, వాస్తవాలను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఏఐ టూల్స్‌ను ఉపయోగించి ఉత్తర్వులు తయారు చేశారని.. అధికారులు తమ సొంత విచక్షణతో వ్యవహరించలేదని పిటిషనర్ తరపు లాయర్ ఎం. మాధవరెడ్డి హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నిర్ణయం వల్ల తనకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని వాదించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్‌వి శ్రవణ్ కుమార్ విచారణ చేపట్టారు. ఆస్తి హక్కులు, భూములకు సంబంధించిన వివాదాల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సామాన్య ప్రజలు, రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందని వ్యాఖ్యానించారు. కేవలం ఏఐతో రూపొందించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఇలాంటి కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. కేసులోని వాస్తవాలను స్వయంగా పరిశీలించడం, సంబంధిత పత్రాలను అధ్యయనం చేయడం, బాధితుల వాదనలు వినడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు.. జనగామ కలెక్టర్ సెప్టెంబర్ 8వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, జనగామ జిల్లా కలెక్టర్, దేవరుప్పుల తహసీల్దార్‌తో పాటు సంబంధిత ప్రైవేటు వ్యక్తులకు నోటీసులు జారీ చేసింది. వారి వివరణలు సమర్పించాలని ఆదేశించింది. రెవెన్యూ శాఖ తరపున హాజరైన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ హరిత.. ఈ అంశం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని కోర్టుకు తెలిపారు. రెవెన్యూ వ్యవహారాలను చూసే ప్రభుత్వ లాయర్ ఈ విషయంలో తదుపరి చర్యలపై సలహా కోరుతూ అడ్వకేట్ జనరల్ కార్యాలయాన్ని సంప్రదించినట్లు వివరించారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకోబోయే చర్యలేమిటో వివరించాలని అడ్వకేట్ జనరల్ ఏ. సుదర్శన్ రెడ్డిని హైకోర్టు ఆదేశించింది. ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలను కూడా కోర్టుకు తెలియజేయాలని సూచించింది. తదుపరి విచారణను నవంబర్ 18వ తేదీకి వాయిదా వేసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫిర్యాదుల పరిష్కారం, ఉత్తర్వుల తయారీలో ఏఐ, ఆటోమేషన్ సాధనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఈ కేసు తీవ్ర ప్రాధాన్యం సంతరించుకుంది. కొన్ని చోట్ల ప్రజలు సమర్పించిన ఫిర్యాదు పత్రాలకు సంబంధించిన ఫొటోలను తీసి.. ఏఐ టూల్స్ ద్వారా నమోదు చేసి.. వాటి ఆధారంగా సమాధానాలు, ఉత్తర్వుల ముసాయిదాలు తయారు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్న వేళ.. ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే అలా రూపొందించిన సమాచారాన్ని సంబంధిత అధికారులు స్వయంగా పరిశీలించకపోతే సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్న ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. పరిపాలనలో వేగం పెంచేందుకు టెక్నాలజీ ఉపయోగపడినా.. ప్రజల ఆస్తి హక్కులను ప్రభావితం చేసే నిర్ణయాల్లో అధికారుల స్వతంత్ర పరిశీలన, బాధ్యతాయుతమైన వ్యవహారం తప్పనిసరి అని ఈ ఘటన ద్వారా అర్థమవుతోంది. జనగామ భూ వివాదంపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ఈ అంశంపై ప్రభుత్వ యంత్రాంగం అనుసరించాల్సిన విధానాలపై చర్చకు దారితీశాయి.

ఢిల్లీ ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు

మొదటిపేజీ తరువాయి..

బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అమిత్ షా హైదరాబాద్‌కు వస్తే బండి సంజయ్ బాడీగార్డ్‌లా వ్యవహరించారని కేటీఆర్ విమర్శించారు. ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ కరీంనగర్ ప్రజల గౌరవాన్ని దిగజార్చవద్దని హితవు పలికారు. తనకంటే చిన్నవాడైన అమిత్ షాకు రాంచందర్‌రావు కాళ్లకు నమస్కరించడమేంటని ప్రశ్నించారు. అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారని, రాష్ట్రానికి ఏం ఇచ్చారని కేటీఆర్ నిలదీశారు. ఒక్క మెట్రో ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు లేదా విద్యాసంస్థనైనా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసమే తాపత్రయపడుతున్నారని విమర్శించారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళుతూ ఆయన 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా మారిపోయారని ఎద్దేవా చేశారు. అడవులు నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేసినట్లుగా.. భూములు అమ్మే బ్రోకర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఎలా ఉంటుందో అలా ఉందని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూమి వస్తే అమ్మేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆ భూములను అమ్మి సొమ్ము చేసుకోవాలని చూడకుండా, పేదలు, అమరవీరులు, ఉద్యమకారులకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తన అనుచరులతో కలిసి ఈరోజు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... "మియాపూర్‌లోని 550 ఎకరాల్లో 200 ఎకరాలు పేదల ఇళ్లకు, 100 ఎకరాలు అమరవీరులకు, మరో 100 ఎకరాలు ఉద్యమకారులకు కేటాయించండి. మిగిలిన భూమిలో పాఠశాలలు, కాలేజీలు కడితే మనస్ఫూర్తిగా స్వాగతిస్తాం" అని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఏడాదిలోపే కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక ఈ భూముల వ్యవహారాలపై దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చే చిత్తశుద్ధి ఉందా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఎక్కడో 80 కిలోమీటర్ల దూరంలోని ఎర్రవెల్లిలో కాకుండా, హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న మియాపూర్‌లోనే అమరవీరులకు ఇళ్లు కట్టివ్వాలని సవాల్ విసిరారు. 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ' పేరుతో జరుగుతున్న స్కాంలో భాగస్వాములైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పారిశ్రామికవేత్తలను ఆయన హెచ్చరించారు.

ఎల్‌నినో ప్రభావం.. పేదల బతుకులపై భారం..!

ఎల్ నినోతో వ్యవసాయానికి గండం..

8 వేల ఎకరాల్లో యాసంగి వరి సాగు బంద్..!

తగ్గిన సాగుతో కూలీలకు పనుల కొరత..

నిత్యావసర ధరలు పెరగడంతో సామాన్యుడిపై భారం

ఎల్‌నినో ప్రభావం పేద, మధ్యతరగతి ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, వర్షపాతం అసమతుల్యత, ఉష్ణోగ్రతల పెరుగుదల వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేస్తే.. దాని ప్రభావం క్రమంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడి జీవించే చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, రోజువారీ కూలీ పనులు చేసుకునే నిరుపేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. పంట దిగుబడులు తగ్గడం, సాగు ఖర్చులు పెరగడం, పనిదినాలు తగ్గడం, ఆహార పదార్థాల ధరలు పెరిగే పరిస్థితులు ఏర్పడితే పేదల కుటుంబ బడ్జెట్ తలకిందులయ్యే అవకాశముంది.

వ్యవసాయ రంగంపై ప్రభావం

ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో చోటుచేసుకునే మార్పులతో సంబంధం ఉన్న వాతావరణ దృగ్విషయం. దీని ప్రభావంతో ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో



వర్షపాతం, ఉష్ణోగ్రతల సరళిలో మార్పులు సంభవించవచ్చు. అయితే ప్రతి ఎల్‌నినో సమయంలోనూ ఒకే విధమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడతాయని చెప్పలేం. స్థానిక వాతావరణ పరిస్థితులు, రుతుపవనాల కదలికలు, నీటి నిల్వలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి.
వర్షాలు సకాలంలో కురవకపోవడం, సుదీర్ఘ విరామాలు ఏర్పడటం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం వంటి పరిస్థితులు పంటల ఎదుగుదలను దెబ్బతీస్తాయి. సాగునీటి వనరుల్లో నీటి నిల్వలు తగ్గితే రైతులు బోరుబావులు, ఇతర నీటి వనరులపై ఆధారపడాల్సి వస్తుంది. దీంతో విద్యుత్తు, డీజిల్, నీటి సరఫరా, ఎరువులు, పురుగుమందుల కోసం అదనపు ఖర్చులు చేయాల్సి రావచ్చు.ఇప్పటికే పెట్టుబడుల కోసం అప్పులు చేసిన రైతులకు పంట దిగుబడి తగ్గితే వాటిని తిరిగి చెల్లించడం కష్టమవుతుంది. పంట చేతికి రాకపోతే తదుపరి సీజన్‌లో సాగు చేయడానికి అవసరమైన పెట్టుబడులనూ సమకూర్చుకోలేని పరిస్థితి ఏర్పడవచ్చు. ఈ ప్రభావం చిన్న, సన్నకారు రైతులపై మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.చర్ల మండలం లో రైతులు వర ప్రసాదం గా భావించే తాలిపేరు ప్రాజెక్టు ఆయకట్టు కింద ఎలినినో ప్రభావం వల్ల ఈ ఏడాది యాసంగి సీజన్ లో వరి పంట సాగు నిలుపుదల చేయాలని అధికారులు, ప్రభుత్వ పాలకులు ముందుగా హెచ్చరిక జారీ చేశారు. సుమారు 8 వేల ఎకరాల్లో వరి పంట సాగు బంద్ కావడంతో

> **ఎల్‌నినో ప్రభావం పేద, మధ్యతరగతి ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, వర్షపాతం అసమతుల్యత, ఉష్ణోగ్రతల పెరుగుదల వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేస్తే.. దాని ప్రభావం క్రమంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడి జీవించే చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, రోజువారీ కూలీ పనులు చేసుకునే నిరుపేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది.**

కూలీలకు పనులు కరువు..

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయమే అనేక కుటుంబాలకు ప్రధాన జీవనాధారం. పొలం దున్నడం నుంచి నాట్లు వేయడం, కలుపు తీయడం, ఎరువులు వేయడం, పంట కోతల వరకు వివిధ దశల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి లభిస్తుంది. వర్షాభావం కారణంగా సాగు విస్తీర్ణం తగ్గినా, పంటలు దెబ్బతిన్నా, కోతల పనులు తగ్గినా కూలీలకు పనిదినాలు తగ్గిపోతాయి.రోజూ పని చేస్తేనే కుటుంబాన్ని పోషించుకునే వారికి ఒకటి, రెండు రోజుల పని కోల్పోయినా ఆ ప్రభావం ఇంటి ఖర్చులపై పడుతుంది. పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, ఇంటి అద్దె, విద్యుత్తు బిల్లులు, నిత్యావసర వస్తువుల కొనుగోలు భారంగా మారతాయి. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు తగ్గితే కొందరు కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు కూడా ఎదురుకావచ్చు.ఇప్పటికే బియ్యం ధరలు విపరీతంగా పెరిగాయి. దానికి తోడు నిత్యావసరాల ధరలు పెరిగితే మరింత కష్టం వాతావరణ పరిస్థితుల కారణంగా పంటల దిగుబడులు తగ్గి మార్కెట్‌కు వచ్చే సరుకు పరిమాణం తగ్గితే కొన్ని ఆహార పదార్థాల ధరలపై ఒత్తిడి పెరగవచ్చు. రవాణా, నిల్వ, ఉత్పత్తి ఖర్చులు పెరగడం కూడా ధరలపై ప్రభావం చూపుతుంది. అయితే ప్రతి వస్తువు ధర తప్పనిసరిగా పెరుగుతుందని చెప్పలేం. సరఫరా, నిల్వలు, దిగుమతులు, ప్రభుత్వ చర్యలు వంటి అంశాలపైనా ధరలు ఆధారపడి ఉంటాయి.
కూరగాయలు, పప్పులు, నూనెలు, బియ్యం వంటి నిత్యావసరాల కొనుగోలుకు పేద కుటుంబాలు తమ ఆదాయంలో ఎక్కువ భాగాన్ని వెచ్చించాల్సి వస్తే ఇతర అవసరాల కోసం డబ్బు మిగలదు. ఆదాయం స్థిరంగా ఉండి ఖర్చులు పెరిగితే అప్పులు చేయడం, అవసరాలను తగ్గించుకోవడం తప్ప మరో మార్గం కనిపించని పరిస్థితి ఏర్పడవచ్చు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సవాల్

రైతు పంట పండిస్తేనే కూలీలకు పని లభిస్తుంది. కూలీలకు ఆదాయం ఉంటేనే గ్రామాల్లోని చిన్న దుకాణాలు, కిరాణా వ్యాపారాలు, చిరు వ్యాపారాలు కొనసాగుతాయి. వ్యవసాయ ఆదాయం తగ్గితే ఈ



రంగాలపైనా ప్రభావం పడుతుంది. రైతుల కొనుగోలు శక్తి తగ్గడం వల్ల గ్రామీణ మార్కెట్లలో వ్యాపార లావాదేవీలు మందగించే అవకాశం ఉంది. ఇలా వాతావరణ మార్పుల ప్రభావం ఒక్క వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోని అనేక వర్గాలపై పడుతుంది. ముఖ్యంగా పొదుపు లేని కుటుంబాలు, అప్పులపై ఆధారపడే రైతులు, రోజువారీ కూలీలకు ఈ పరిస్థితులు మరింత సవాలుగా మారుతాయి.తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు అవసరం



వర్షపాతం తగ్గి జలాశయాలు, చెరువులు, కుంటలు, భూగర్భ జలాల్లో నీటి నిల్వలు తగ్గితే తాగునీటి సరఫరాపైనా ప్రభావం పడవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు నీరు, మేత అందుబాటులో లేకపోతే పాడి రైతులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటారు. పశువుల పోషణ ఖర్చులు పెరగడం, పాల దిగుబడి తగ్గడం వల్ల వారి ఆదాయం దెబ్బతినే ప్రమాదం ఉంది.ఈ నేపథ్యంలో తాగునీటి వనరులను సంరక్షించడం, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించడం, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలను కాపాడుకోవడం, వర్షపు నీటిని ఒడిసిపట్టే చర్యలు చేపట్టడం అవసరం. సాగునీటి వినియోగంలో ప్రాధాన్యాలను నిర్ణయించి, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి నిర్వహణ చేపట్టాలి.

పేదలకు అండగా నిలవాలి

ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వ శాఖలు ముందస్తు ప్రణాళికతో పనిచేయాల్సిన అవసరం ఉంది. వాతావరణ హెచ్చరికలను రైతులకు చేరవేయడం, పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించడం, తక్కువ నీటితో సాగయ్యే పంటలపై అవగాహన కల్పించడం, అవసరమైన చోట ప్రత్యామ్నాయ పంటల సాగుకు సలహాలు ఇవ్వడం కీలకం. పంట నష్టపోయిన రైతులకు అర్హతల ప్రకారం పంటల బీమా, ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలి. ఉపాధి అవకాశాలు తగ్గిన గ్రామాల్లో అర్హులైన వారికి ఉపాధి హామీ పనులు కల్పించాలి. తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన కుటుంబాలకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందేలా చూడాలి.

ముందస్తు జాగ్రత్తలే పరిష్కారం

ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందనేది స్థానిక వర్షపాతం, ఉష్ణోగ్రతలు, జలాశయాల్లో నీటి నిల్వలు, పంటల పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి ముందుగానే ప్రజల్లో ఆందోళనలు పెంచడం కంటే శాస్త్రీయ అంచనాల ఆధారంగా చర్యలు చేపట్టడం ముఖ్యం. రైతులు కూడా వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంటల ఎంపిక,

> ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో రైతులు వరి, మొక్కజొన్న పంటలకు బదులుగా అపరాలు, మినుములు, పెసర వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని చర్ల మండల వ్యవసాయ అధికారి టీ. రవితేజస్ రెడ్డి సూచించారు. పెసర సాగుకు 50 శాతం సబ్సిడీ అందించేలా ప్రభుత్వం చర్యలు చేప డుతోంద ని తెలిపారు. పంటలు సరిగా పండక నష్టాలు ఎదురైతే వాటిని గుర్తించి ప్రభుత్వపరంగా పరిహారం అందేలా చూస్తామని మండలంలో ప్రస్తుతం 16 వేల ఎకరాల్లో వరి, 5,800 ఎకరాల్లో మిరప, 5,200 ఎకరాల్లో పత్తి సాగవుతున్నాయని నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆలోచించి, అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు.



సాగునీటి వినియోగం, పెట్టుబడుల విషయంలో నిర్ణయాలు తీసుకోవాలి.ప్రకృతి వైపరీత్యాల ప్రభావం అందరిపైనా పడినా, వాటిని తట్టుకునే ఆర్థిక సామర్థ్యం పేదలకు తక్కువగా ఉంటుంది. అందువల్ల వాతావరణ మార్పులను ఎదుర్కొనే ప్రణాళికల్లో పేదలు, రైతులు, వ్యవసాయ కూలీల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముందస్తు చర్యలు, నీటి సంరక్షణ, ఉపాధి కల్పన, సమర్థవంతమైన ప్రభుత్వ సహాయం ద్వారానే ఎల్‌నినో ప్రభావంతో పేదల జీవనంపై పడే భారాన్ని కొంతవరకు తగ్గించవచ్చు.

- టి.రాజేష్ కుమార్
చర్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.

భద్రాచలంలో అదనపు సెషన్స్ కోర్టు ఏర్పాటు చేయాలి

ఖాళీగా ఉన్న మెజిస్ట్రేట్ పోస్టును తక్షణమే భర్తీ చేయాలి

హైకోర్టు న్యాయమూర్తులకు బార్ అసోసియేషన్ ప్రతినిధుల వినతి

భద్రాచలం, నవంబర్ 4 (ప్రజా జ్యోతి):
భద్రాచలంలో అదనపు సెషన్స్ కోర్టును ఏర్పాటు చేయడంతో పాటు, ఖాళీగా ఉన్న ఫస్ట్ క్లాస్ జుడీషియల్ మెజిస్ట్రేట్ పోస్టును తక్షణమే భర్తీ చేయాలని భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రతినిధి బృందం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులకు విజ్ఞప్తి చేసింది. ఈ



మేరకు హైకోర్టు న్యాయమూర్తులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ కె. సృజన, ములుగు జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, జస్టిస్ భీమపాక నగేష్, జస్టిస్ కాజా శరత్‌లను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా భద్రాచలం ఏజెన్సీ ప్రాంత ప్రజలు, ముఖ్యంగా గిరిజనులు ఎదుర్కొంటున్న న్యాయపరమైన ఇబ్బందులను వివరించారు. న్యాయమూర్తుల బదిలీల నేపథ్యంలో ఫస్ట్ క్లాస్ జుడీషియల్ మెజిస్ట్రేట్ పోస్టు ఖాళీగా ఉండటంతో క్రిమినల్ కేసుల విచారణకు ఆటంకం కలుగుతోందని తెలిపారు. ఈ పోస్టును వెంటనే భర్తీ చేయాలని కోరారు. భద్రాచలం కోర్టులో ప్రస్తుతం 2,422 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో ఐపీసీ, బీఎన్ఎస్, చెక్ బౌన్స్, మహిళలపై నేరాలు, ఎక్సైజ్, ఎన్‌డీపీఎస్ కేసులు ఉన్నాయని వివరించారు. సెషన్స్ కోర్టు లేకపోవడంతో చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం, మణుగూరు, పినపాక తదితర సుదూర ప్రాంతాల గిరిజనులు ప్రాథమిక విచారణలు, బెయిల్ దరఖాస్తుల కోసం 100 నుంచి 200 కిలోమీటర్ల దూరంలోని కొత్తగూడెం, ఖమ్మం కోర్టులకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. రాజ్యాంగంలోని 21వ అధికరణం కల్పించిన సత్వర న్యాయ హక్కును పరిరక్షించేందుకు భద్రాచలంలో అదనపు సెషన్స్ కోర్టును మంజూరు చేయాలని కోరారు. అలాగే ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఫస్ట్ క్లాస్ జుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టును ఏర్పాటు చేయాలని జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణకు ప్రత్యేక వినతిపత్రం అందజేశారు. ఈ వినతులపై న్యాయమూర్తులు సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్, హైకోర్టు న్యాయవాదులు పి.వి. కృష్ణమాచారి, బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ సభ్యుడు ఎక్కడ మండడపు శ్రీనివాసరావు, నల్లమోతు రాము, దాగం ఆదినారాయణ, ముత్యాల ప్రవీణ్ తదితర సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

చట్టాలపై పునఃపరిశీలించాలి

న్యూఢిల్లీ, నవంబర్ 04(ప్రజాజ్యోతి):
ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఇద్దరు పిల్లలకు మించి ఉండకూడదనే నిబంధన ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతవరకు సమంజసమని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దేశంలో సంతానోత్పత్తి రేటు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ఇద్దరికి మించి పిల్లలున్నవారిని స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హులుగా ప్రకటించే చట్టాలను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. గత రెండు దశాబ్దాల్లో దేశ జనాభా పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని బుధవారం విచారణ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతం భారతదేశ మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) 2.1 అనే ప్రత్యామ్నాయ స్థాయి కంటే దిగువకు పడిపోయిందని గుర్తుచేసింది. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే దశాబ్దాల్లో వృద్ధుల జనాభా పెరిగే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఇద్దరికి మించి పిల్లలున్నవారు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించడం ఇప్పటికీ అవసరమా? అని ప్రశ్నించింది. మహారాష్ట్రలోని కాకోడా గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మంగళ భీమ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. మూడో సంతానం జన్మించడంతో ఆమెను ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హురాలిగా ప్రకటించారు. ఆమె అప్పీల్‌ను అనుమతించిన సుప్రీంకోర్టు, అనర్హత నిర్ణయాన్ని రద్దు చేసింది.
ఇదే అంశంపై 2003లో వెలువడిన జావేద్ వర్సెస్ హర్యానా రాష్ట్రం తీర్పును కూడా సుప్రీంకోర్టు పునఃపరిశీలనకు స్వీకరించింది. ఆ తీర్పును విస్తృత ధర్మాసనానికి నివేదించింది. హర్యానా పంచాయతీరాజ్ చట్టం-1994 ప్రకారం ఇద్దరికి మించి పిల్లలున్నవారు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులని అప్పట్లో ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం సమర్థించింది. 2003లో ఆ తీర్పు వెలువడినప్పుడు దేశంలో ఒక్కో మహిళకు సగటున ముగ్గురు పిల్లలు ఉండేవారని, జనాభా నియంత్రణ ప్రధాన విధానపరమైన అంశంగా ఉండేదని ప్రస్తుత ధర్మాసనం గుర్తుచేసింది. ఇప్పుడు పరిస్థితులు మారినందున ఈ నిబంధనలు రాజ్యాంగబద్ధంగా కొనసాగాలా? లేదా? అన్నది విస్తృత ధర్మాసనం తేల్చనుంది. అయితే, ఇద్దరు పిల్లల నిబంధనను దేశవ్యాప్తంగా రద్దు చేసినట్లు సుప్రీంకోర్టు ప్రకటించలేదు.

ఆర్మీలోకి శాశ్వత ఎంపిక

మొదటిపేజీ తరువాయి..

తీసుకునే సరికొత్త మార్గాన్ని ప్రభుత్వం కల్పించిందని సీడీఎస్ వెల్లడించారు. సైన్యంలో పనిచేస్తున్న అగ్నివీరుల పనితీరుపై అత్యుత్తమ స్పందన వచ్చిందని స్పష్టం చేశారు. పాత విధానం ప్రకారం ప్రతి బ్యాచ్‌లో కేవలం 25 శాతం మందిని మాత్రమే శాశ్వత సైనికులుగా తీసుకుని మిగిలిన 75 శాతం మందిని రిలీవ్ చేసేవారు. తాజా నిర్ణయంతో బయటకు వెళ్లాల్సిన మిగిలిన 75 శాతం మందికి రెండవ విడత కింద అదనంగా రెండేళ్ల పాటు దేశ సేవ చేసే సువర్ణావకాశం లభించింది. ఈ పొడిగించిన కాలంలో అగ్నివీరులకు ప్రస్తుత వేతనం కన్నా అధిక వేతనంతో పాటు సేవా నిధి ప్యాకేజీని కూడా గణనీయంగా పెంచనున్నారు. ఇప్పటికే వైమానిక దళం మొదటి బ్యాచ్ నుంచి 712 మందిని, నౌకాదళం 550 మందిని శాశ్వత సైనికులుగా అధికారికంగా ఖరారు చేశాయి. కేంద్ర తాజా నిర్ణయం వల్ల బలగాల్లో మూడు విభాగాలు ఏర్పడనున్నాయి. సాధారణ నాలుగేళ్ల కాలం పూర్తి చేసుకునేవారు, రెండేళ్ల పొడిగింపు పొందే అగ్నివీరులు, శాశ్వత కేడర్‌లో చేరిన సైనికులుగా వీరు సేవలందిస్తారు. వేలాది మంది సైనిక ఔత్సాహికులకు ఈ నిర్ణయం కొండంత భరోసానిచ్చింది. యువతకు దేశ సేవ చేసే అవకాశం కల్పించడం, దేశ నిర్మాణంలో భాగస్వాములను చెయ్యడం, సాయుధ దళాల్లో యువ శక్తిని ప్రోత్సహించడమే లక్ష్యంగా 'అగ్నిపథ్' పథకాన్ని కేంద్రం 2022లో ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద ఎంపికైన అగ్నివీర్‌లు నాలుగేళ్ల పాటు సైన్యంలో సేవలు అందించిన తర్వాత వారి ప్రతిభ, సంస్థాగత అవసరాల ఆధారంగా కేవలం 25శాతం మంది మాత్రమే సాయుధ దళాల్లో శాశ్వత నియామకానికి అర్హత పొందుతారు. మిగిలిన 75 శాతం మంది పౌర ఉద్యోగాలలో చేరడానికి వీలుగా ఆర్థిక ప్యాకేజీ, నైపుణ్య ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం నుంచి పొందుతారు. అగ్నివీర్‌ల నియామక కాలం తక్కువగా ఉండటంపై గతంలో విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో యూపీ, హరియాణా, మహారాష్ట్ర వంటి పలు రాష్ట్రాలు పోలీస్, ఇతర ఉద్యోగాల్లో అగ్నివీర్‌లకు రిజర్వేషన్లు కల్పించేందుకు ముందుకొచ్చాయి. దీంతో అగ్నివీర్‌ల సేవా కాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.మరోవైపు, బుధవారం కేంద్ర కేబినెట్ తీసుకున్న కీలక నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. చిన్నారులపై వేధింపులు, అత్యాచారాల కేసులను విచారించేందుకు దేశంలో 850 ఫాస్ట్ ట్రాక్ కోర్టులను బలోపేతం చేయడానికి, వాటి పరిధిని విస్తరించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని అన్నారు. మహిళలు, పిల్లలపై జరిగే అఘాయిత్యాల కేసులను కఠినంగా ఎదుర్కోవడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుత చట్టాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని అమలు చేయడం, అలాగే ఇలాంటి కేసులను పరిష్కరించడానికి కొత్త చట్టాలను రూపొందించే ప్రయత్నాలలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దేశంలో పునరుత్పాదక ఇంధన రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర కేబినెట్ ఒక చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967